thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 331 కరీంనగర్ శుక్రవారం, 6 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే

చెన్నై : ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నా రు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరా లను నాశనం చేశాయన్నారు.

పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు.

# ఆర్థిక వ్యవస్థను గాడినపెడుతున్నాం!

## గత ప్రభుత్వాల కారణంగా భారత్ 6వ స్థానం నుంచి 11కు పడిపోయింది




## రాజ్యసభలో సుదీర్ఘ ప్రసంగం చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు.

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు.

సరైన దిశలో దేశం ముందుకు సాగుతోం దని అన్నారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు.

**వలుదేశాలతో ట్రేడ్ డీల్స్..** ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు.

**ప్రపంచానికి ఆశాకిరణం..** ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

**గ్లోబల్ సౌత్‌కు గొంతుకగా..** గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు.

ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు.

**ప్రధాని ప్రసంగం లేకుండానే.. లోక్‌సభలో తీర్మానానికి ఆమోదం...** లోక్‌సభలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది.

అయితే, ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం లేకుండానే దీనికి ఆమోదం తెలపడం గమనార్హం. ప్రతిపక్ష నేతల నిరసనలతో ప్రధాని ప్రసంగించకుండానే సభ నిన్న వాయిదా పడింది. నేడు సభ మొదలైన తర్వాత ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇవాళే బడ్జెట్‌పై చర్చ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మరోవైపు రాజ్యసభలోనూ అధికార, విపక్ష నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సభ వాయిదా పడింది.

# మున్సిపల్ ఎన్నికలు.. ఆ రెండు రోజులు సెలవు?




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో, పోలింగ్ మరియు కౌంటింగ్ రోజులలో సెలవుల అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు మరియు 116 మున్సిపాలిటీల్లో ఈ నెల 11వ తేదీన (ఫిబ్రవరి 11, 2026) ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లోని విద్యాసంస్థలు మరియు కార్యాలయాలకు సెలవు ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా ఎన్నికల పోలింగ్ కేంద్రాలుగా పాఠశాలలను వినియోగిస్తారు కాబట్టి, విద్యార్థులకు ఆ రోజు సెలవు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

కేవలం పాఠశాలలకే కాకుండా, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు కూడా ఓటు వేసేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవు (ఖ్రుఱస ఎశీశ్రీఱుుఎ) ఇచ్చే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. ఐటీ కంపెనీలు, వాణిజ్య సంస్థలు మరియు ఇతర ప్రైవేట్ పరిశ్రమలలో పనిచేసే సిబ్బందికి ఈ హాలిడే వర్తించే అవకాశం ఉంది. పోలింగ్ జరిగే ఫిబ్రవరి 11తో పాటు, ఓట్ల లెక్కింపు జరిగే ఫిబ్రవరి 13న కూడా కొన్ని ప్రాంతాల్లో పరిమిత సెలవు లేదా పాఠశాలలకు సెలవు ప్రకటించే అవకాశముందని అధికార వర్గాల సమాచారం. దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన అధికారిక ఉత్తర్వులు ఒకటి లేదా రెండు రోజుల్లో వెలువడనున్నాయి. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ జరుగుతుంది. ఒకవేళ ఎక్కడైనా అనివార్య కారణాల వల్ల పోలింగ్ ఆగితే, ఫిబ్రవరి 12న రీ-పోలింగ్ నిర్వహిస్తారు.

ఇక ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. ఈ రెండు కీలక రోజుల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం మరియు ఎన్నికల సిబ్బందికి ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం సెలవుల విషయంలో తుది నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రజలు ఈ సెలవుల అప్‌డేట్స్ కోసం స్థానిక యంత్రాంగం ఇచ్చే ప్రకటనలను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.




## తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్‌కు ఓటెయ్యండి: కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఫిబ్రవరి 05: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు.

ఇవాళ(గురువారం) సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్లా జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు.

నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్టడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్ఎస్ కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు.

# భాజపా, బీఆర్ఎస్‌లది చీకటి స్నేహం

## ఇరు పార్టీలది ఫెవికాల్ బంధం




కరీంనగర్: తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధిపనులకు రెండేళ్లలో రూ. 17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. "తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పలేదు. తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ. 20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోంది. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారు? దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం.. మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి" అని సీఎం డిమాండ్ చేశారు.సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయాల్లో డబ్బుతో కాదు.. నమ్మకంతో గెలుస్తాం:** రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. అలాగే మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు.




## గ్రూప్ 1 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్.. హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్: గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది.

గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.




## నాలుగు వారాల్లో రెగ్యులర్ డీజీపీ నియామకం పూర్తి చేయాలి.. సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ యూపీఎస్సీ.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది. డీజీపీ నియామకాన్ని సస్పెండ్ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. వాదనలు వినిపించి విచారణను ముగించింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు డీజీపీ నియామకాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని యూపీఎస్సీతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది సుప్రీం కోర్టు. ఈ ప్రక్రియను యూపీఎస్సీ, తెలంగాణ ప్రభుత్వం సమన్వయంతో నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించింది. ఈ విషయంలో హైకోర్టు తీర్పును సుప్రీం న్యాయస్థానం సవరించింది. గత ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని యూపీఎస్సీ సహా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

**తెలంగాణలో పోలీస్ పరిపాలనపై ప్రభావం...** సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణలో రెగ్యులర్ డీజీపీ నియామకంపై నెలకొన్న అనిశ్చితి తొలిగే అవకాశం కనిపిస్తోంది. నాలుగు వారాల్లో నియామకం పూర్తి కావాల్సి ఉండటంతో రాష్ట్ర పోలీస్ పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముంది.




హైదరాబాద్, ఫిబ్రవరి5 : తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తొలి విడతగా రూ. 259.36 కోట్లు విడుదలయ్యాయి. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపి.. కేంద్ర ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరపడంతో ఈ నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈ నిధులు కొత్త ఊపిరి పోయనున్నాయి. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావడం, నూతన పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయి. గతంలో పంచాయతీల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల విడుదలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఎన్నికైన ప్రజాప్రతినిధులు(సర్పంచ్‌లు) ఉంటేనే ఈ నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. ఇటీవల ఎన్నికలు ముగియడంతో ఈ ప్రక్రియ పూర్తయింది. పంచాయతీలకు అందిన ఈ నిధులను ప్రధానంగా మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా అవసరాల కోసం రాష్ట్ర సర్కార్ ఖర్చు చేయనుంది.

## వీధి దీపాలు వెలిగించేందుకు ఈ ప్రభుత్వం వద్ద డబ్బులేవు: కేంద్ర మంత్రి




హైదరాబాద్, ఫిబ్రవరి 05: తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

## రాజకీయాల్లో డబ్బుతో కాదు.. నమ్మకంతో గెలుస్తాం: సీఎం రేవంత్



కరీంనగర్, ఫిబ్రవరి 05: రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుందని వారికి స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన వివరించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రానివారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశం చేశారు. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని గుర్తు చేశారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో మన ప్రభుత్వం అమలు చేసిన పథకాలుతోపాటు వాటి వల్ల చేకూర్చిన లబ్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## అడ్వకేట్ స్వప్న హత్య కేసులో కీలక పురోగతి.. వెలుగులోకి సంచలన విషయాలు..




చేవెళ్ల, ఫిబ్రవరి5 : చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది గోటికె స్వప్న హత్య కేసును పోలీసులు ఛేదించారు. అత్యంత పాశవికంగా జరిగిన ఈ హత్యకు సొంత అన్నయ్యే సూత్రధారి అని తేలడం స్థానికంగా కలకలం రేపింది. ఆస్తి కోసం తోడబుట్టిన బంధాన్ని మర్చిపోయి చేసిన ఈ హత్య మొయినాబాద్ ప్రాంతంలో సంచలనంగా మారింది. పోలీసులు.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వీరికి కఠిన శిక్ష పడేలా చూస్తామని డీసీపీ యోగేశ్ తెలిపారు. ఇది పూర్తిగా ప్లాన్ చేసి చేసిన హత్య అని.. భూ వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణమని ఆయన వెల్లడించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, అన్ని ఆధారాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పోలీసుల విచారణలో సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై ఉన్న వివాదమే ఈ హత్యకు కారణమని తేలిందని అన్నారు. భూమి సర్వే విషయంలో స్వప్న, రాజు మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయని చేవెళ్ల డీసీపీ తెలిపారు. ఆ భూమిని తన పేరిట మార్చుకోవాలని లేదా సొంతం చేసుకోవాలని స్వప్న సోదరుడు రాజు పథకం వేశాడు. ఈ క్రమంలో చెల్లెలు అడ్డుగా ఉందని భావించి ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే హత్యకు పాల్పడ్డాడు.

**నిందితుల వివరాలు..** ఈ కేసులో పోలీసులు నలుగురిని (A1 - A4) అరెస్ట్ చేశారు. A1: గోటికె రాజు (స్వప్న సొంత సోదరుడు – ప్రధాన నిందితుడు) A2: ఎర్రోళ్ల సందీప్, A3: వడ్డె వీరేశం, A4: కావలి శివలింగం ఉన్నారు.

**పక్కా స్కెచ్‌తో దారుణం..** హత్య జరిగిన తీరు అత్యంత భయంకరంగా ఉందని పోలీసులు తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. భూమి సర్వే కోసం స్వప్న పొలం వద్దకు వెళ్లిన సమయాన్ని నిందితులు ఆసరాగా చేసుకున్నారు. మొదట నిందితులు.. ఇన్నోవా కారుతో స్వప్నను బలంగా ఢీకొట్టారు. ఆమె కింద పడిపోగానే రాళ్లు, కర్రలతో దాడి చేశారు. చివరగా అత్యంత క్రూరంగా కొడవలితో గొంతుకోసి అక్కడికక్కడే ప్రాణాలు తీశారు. హత్య అనంతరం నిందితులు ఇన్నోవా కారు, స్కూటీపై అక్కడి నుంచి పారిపోయారు. నిందితుల నుంచి పోలీసులు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఇన్నోవా వాహనం, స్కూటీ, నిందితుల మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు.

**న్యాయవృత్తిలో ఉన్న స్వప్న..** హత్యకు గురైన గోటికె స్వప్న చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ధైర్యవంతమైన మహిళగా స్వప్నకు పేరుండేదని సహచరులు చెబుతున్నారు. సొంత అన్న చేతిలోనే ఆమె హత్యకు గురవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని తన సహచరులు ఆవేదన వ్యక్తం చేశారు.

## రెండేళ్లయితే కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు: హరీశ్‌రావు



గజ్వేల్: మనల్ని బాగా చూసుకున్న వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు గజ్వేల్‌లో పందులతో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి.. ఇప్పుడు ఎలా ఉందో చూడాలన్నారు. "రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు. కానీ, బంగారం ధర భారీగా పెరిగింది. అప్పుడు ఆశపెట్టిన సీఎం ఇప్పుడు దానిపై స్పందించట్లేదు. రేవంత్‌రెడ్డికి తిట్లు తప్ప వేరే ఏమీ రావు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. రైతుబంధు డబ్బులు ఎన్నికల తర్వాత ఇస్తానని సీఎం అంటున్నారు. 11వ తేదీలోపు రైతుబంధు ఇవ్వకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారు. రేవంత్‌రెడ్డి.. నీకు ధైర్యం ఉంటే కేసీఆర్‌తో అభివృద్ధిలో పోటీ పడు. మా కౌన్సిలర్లను గెలిపిస్తే వచ్చే ప్రభుత్వం మాదే అవుతుంది. రెండేళ్లయితే మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారు. మిగిలిన పనులు పూర్తి చేసుకుందాం. భాజపా వాళ్లు ఏమీ చేయరు"అని హరీశ్‌రావు అన్నారు.

## ఎన్నికల్లో గెలిపిస్తే.. మొదటి విడతగా రూ.500 కోట్లు తీసుకొస్తా: బండి



హుజూరాబాద్ రూరల్: గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ. 259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ. 500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. "కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తాం" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.




## అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో మరిన్ని వివరాలు

ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నందుకు మనస్తాపానికి గురై నిషిక (16), ప్రాచీ (14), పఖీ (12) బుధవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. వీరు సోషల్ మీడియాలో కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఆత్మహత్య కు 10 రోజుల ముందే వారి సోషల్ అకౌంట్లను బాలికల తండ్రి డిలీట్ చేసినట్లు తెలిసింది. ఈ ముగ్గురు బాలికలు సోషల్ మీడియాలో మరియా, అలీజా, సిండీ అనే కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచారు.

ఇంట్లో కూడా వీరు అదే పేర్లతో పిలుచుకునేవారట. 10 రోజుల క్రితం ఈ అకౌంట్ల గురించి తండ్రి చేతన్‌కుమార్‌కు తెలియడంతో ఆ ఖాతాలను డిలీట్ చేశారు. బాలికల వద్ద నుంచి మొబైల్ ఫోన్లను కూడా లాగేసుకున్నారని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇక, చేతన్‌కు రూ. 2 కోట్ల వరకు అప్పులున్నాయి. దీంతో ఇంటి అవసరాల కోసం అమ్మాయిల ఫోన్లను ఆయన విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. అంతేగాక, ఇలాగే ఉంటే పెళ్లి చేస్తానని చేతన్ తన కుమార్తెలను హెచ్చరించినట్లు తెలిపారు.

**క్షమించండి నాన్నా.. కొరియా అంటే ప్రాణం..** తండ్రి తమ సోషల్‌మీడియా ఖాతాలను డిలీట్ చేయడం, ఫోన్లు లేకపోవడంతో గేమ్‌లు, కె-డ్రామా సిరీస్‌లు చూడలేకపోవడంతో ఆ ముగ్గురు అమ్మాయిలు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. దీని గురించి తమ డైరీలో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. "కొరియానే మా ప్రాణం. ఈ విషయం మీకు ఎప్పటికీ అర్థం కాదు. మేం ఇక్కడివాళ్లను పెళ్లి చేసుకోలేం" అని వారు ఆ డైరీలో రాసినట్లు పేర్కొన్నారు. గత రెండేళ్ల నుంచి ఈ అమ్మాయిలు స్కూల్‌కు వెళ్లట్లేదని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు వారిని స్కూల్‌కు పంపించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తెలుగువారు గర్వించదగ్గ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి – ఫిబ్రవరి 6...శ్యామశాస్త్రి వర్ధంతి

సంగీత త్రిమూర్తులలో మూడవ వారైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 – ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి (క్రీ. శ. 1763 –1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు (క్రీ.శ.1767 –1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు (క్రీ. శ. 1776–1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయ లు. మహమ్మదీయుల దండయాత్ర లకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్న తనంలో ముద్దుపేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవ హారికంలో సార్థకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ.శ1763లో చిత్ర భాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమ ను తిరువారూరులో శ్యామశాస్త్రులు జన్మించినట్లు పేర్కొంటారు. తండ్రి విశ్వనాథ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలో పండితుడు కావడంతో, శ్యామశాస్త్రి చిన్న తనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతం లో తన మేనమామ దగ్గర స్వరపద చయం కల్పిన, ఆ పిదప తంజా వూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసు ని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసు డైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామ శాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మా నందం సాధించ వచ్చని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషల లో అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తనలలో భావ రాగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్టు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనలతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేక పోవడం వల్ల కూడా, ఆయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొంద లేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవ మ్మ" , "మాంజిరాగం" అలాగే 'కల్లడ '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతే " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలో వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారులు అందరికి సుపరిచితమే. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయ జ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్ట మని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతిం చుమా తొమ్మిది కృతులు "నవరత్న మాలిక" గానం చేశాడు. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవి, ధన్యాసి, కల్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వర జతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి



కుమారి", భైరవి రాగంలో "కామాక్షి అనుదినము"వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు. ఈ స్వర జతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 ం 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 ం 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచా డు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోక మాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ధి చెందిన కీర్తనలు. తంజావూరు జిల్లాలో తిరువా యూరులో ఉన్న కామాక్షి దేవాల య అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్ని ధానం లోనే 'శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులను రచించాడయన. శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ -- అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామ శాస్త్రి రచించాడని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామ శాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ – సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు. శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయ శాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగం బాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆయుర్వేద వైద్యానికి పునర్జీవం ప్రసాదించిన దీవి రంగాచార్యులు

## ఫిబ్రవరి 6...దీవి రంగాచార్యులు వర్ధంతి

దీవి రంగాచార్యులు భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుల్లో ఒకరు. ఆయన ప్రాచీన వైద్యశాస్త్రంలో తన విశేష కృషి, ప్రతిభతో భారతీయ వైద్య చరిత్రలో చిరస్మర ణీయ స్థానాన్ని సంపాదించారు. ఆయుర్వేద వైద్యానికి పునర్జీవం ప్రసాదించిన మహోన్నత వ్యక్తిగా ఆయన పేరు నిలిచిపోయింది. దీవి రంగాచార్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లలో 1898 జూలై 3న జన్మించారు. చిన్ననాటి నుంచే ఆయుర్వేదం పట్ల ఆసక్తిని పెంచుకున్న ఆయన, ఈ ప్రాచీన వైద్యశాస్త్రం పై లోతైన అధ్యయనానికి, ప్రజల సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. దీవి రంగాచార్యులు ప్రాచీన భారతీయ వైద్యశాస్త్ర గ్రంథాలు చరక సంహిత, సుశ్రుత సంహిత, ఇతర సంప్రదాయ గ్రంథాలను లోతుగా అధ్యయనం చేశారు. ఆయుర్వేదం మాత్రమే కాకుండా, అల్లోపతి, నేచురోపతి, హోమియోపతి, క్రోమోథెరపీ, హైడ్రోథెరపీ, యోగా వంటి వివిధ వైద్య విధానాల్లో శిక్షణ పొందారు. వీటిని కలిపి సమగ్ర వైద్య. శాస్త్రానికి ఆయన ఆధునిక రూపురేఖలు ఇచ్చారు. తన జీవితమంతా కర్మయోగిగా జీవించిన దీవి రంగాచార్యులు, ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించడమే తన ధ్యేయంగా పెట్టుకున్నారు. గుంటూరులో విద్యుత్ చికిత్సలను ప్రవేశపెట్టి, ఆయుర్వేద వైద్యానికి ఆధునిక సాంకేతికతను జోడించారు. ఆయన కేరళ పంచకర్మ చికిత్స విధానాలను అధ్యయనం చేసి, వాటిని మరింత సమర్థవంతంగా మార్చి ప్రజలకు అందించారు. వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధానాలు:దీవి రంగాచార్యులు రోగుల పట్ల గాఢ శ్రద్ధ చూపేవారు. వ్యాధి మూలాలను గుర్తించి, చికిత్సలను రోగి శరీర స్థితికి అనుగుణంగా నిర్దేశించేవారు. ఆయుర్వేద వైద్యాన్ని ఒక ఉద్యమంగా మార్చి రాష్ట్రమంతటా ప్రచారం చేశారు. దీవి రంగాచార్యులు శాస్త్ర పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, ఆయుర్వేదంలో అనేక నూతన ఆవిష్కరణలను చేశారు. 1936లో గుంటూరులో ఒక ప్రఖ్యాత ఆయుర్వేద కళాశాలను స్థాపించి, అనేక మంది వైద్య విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన ప్రచురించిన "వైద్య ప్రదీపిక" మాస పత్రిక వైద్యశాస్త్ర సంబంధిత పరిశోధనలకు ఎంతో దోహదపడింది. 1926లో బాపట్లలో ప్రకృతి వైద్య మహాసభ నిర్వహించారు. 1927లో మచిలీపట్నంలో ఆయుర్వేద మహా మండలిని నిర్వహించి, ఆయుర్వేద వైద్య విస్తరణకు కృషి చేశారు. అనువంశిక



ఆయుర్వేద, యునాని వైద్య సంఘమును స్థాపించి, 1933లో బ్రిటిష్ ప్రభుత్వం జారీ చేసిన ఇండియన్ మెడికల్ యాక్టు అనుగుణంగా మార్చి, వైద్య రంగానికి సాంకేతిక ప్రామాణికత కల్పించారు. దీవి రంగాచార్యుల విశేష కృషిని గుర్తించి, అమెరికా ప్రకృతి వైద్య పరిషత్ వారు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయుర్వేద వైద్య రంగంలో చేసిన మార్గదర్శక కృషికి రాష్ట్ర ప్రభుత్వం ఆయనను "కవి వాచస్పతి" బిరుదుతో సత్కరించింది. దీవి రంగాచార్యులు నిత్య విద్యార్థిగా జీవిస్తూ వైద్య రంగంలో కొత్త మార్గాలను ఎప్పటికప్పుడు అన్వేషించేవారు. విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చే విధంగా తన విద్యా పద్ధతులు, సిద్ధాంతాలను రూపొందించారు. ఆయన 1976 ఫిబ్రవరి 6న గుంటూరులో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భారతీయ సంగీత ప్రపంచానికి ఆభరణం లతా మంగేష్కర్ - ఫిబ్రవరి 6... భారత గాన కోకిల వర్ధంతి



లతా మంగేష్కర్ భారతీయ సంగీత ప్రపంచానికి ఆభరణం. ఆమె అద్భుతమైన గాత్రం, నెమ్మదైన స్వరం, భావోద్వేగ పూరితమైన గానంతో భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమెను "స్వర కోకిల"గా గుర్తించి, భారతీయ సంగీత అభిమానులు గర్వపడు తుంటారు. లతా మంగేష్కర్ 1929 సెప్టెంబర్ 28న మహారాష్ట్రలోని ఇండోర్‌లో జన్మించారు. ఆమె తండ్రి పండిట్ దీనానాథ్ మంగేష్కర్ గోవా మూలాలు కలిగిన ప్రసిద్ధ సంగీతకారుడు, నాటక కళాకారుడు. తండ్రి ప్రోత్సాహంతోనే చిన్ననాటి నుంచే లతా సంగీతంలో ప్రవేశం చేశారు. తండ్రి నుండి ప్రాథమిక సంగీత పాఠాలు నేర్చుకొని, తన గాన ప్రతిభను నిరూపించు కున్నారు. కుటుంబ పరిస్థితుల వల్ల, 13వ ఏట లతా తండ్రిని కోల్పోయారు. కుటుంబ బరువు ఆమెపై పడటంతో, తన కెరీర్‌ను కొనసాగించాలనే సంకల్పంతో పాటల ప్రపంచంలోకి ప్రవేశించారు.

**సంగీత ప్రస్థానం...** 1942లో "కిటి హసాల్" అనే మరాఠీ చిత్రంలో లతా తన మొదటి పాట పాడారు. కానీ సినిమా విడుదలకు ముందు ఆ పాట తొలగించబడింది. 1945లో హిందీ సినిమాల్లోకి ప్రవేశించి, "అప్ కీ సేవా మే" చిత్రంలో పాడి, ఆమె సంగీత ప్రయాణానికి బలమైన పునాది వేశారు. 1949లో "మహల్" చిత్రంలోని "ఆయేగా ఆనేవాలా" పాట ఆమెకు విశేషమైన పేరు తెచ్చి పెట్టింది.

ఈ పాట లతా మంగేష్కర్‌కు బహుళ ప్రాచుర్యం తెచ్చింది. ఆ తర్వాత ఆమె హిందీ సినిమా పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచు కున్నారు.

**సినీ సంగీత సేవలు...** లతా మంగేష్కర్ సుమారు 30,000 పాటలు 36 భాషల్లో పాడారు. హిందీతో పాటు మరాఠీ, బంగ్లా, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ వంటి భాషల్లో కూడా ఆమె గానం చేశారు. ఆమె పాటల్లో గాఢ భావోద్వేగాలు, స్వచ్ఛమైన సంగీత నైపుణ్యం ప్రతిఫలించాయి. సంగీత దర్శకులు నౌషాద్, శంకర్–జైకిషన్, ఆర్.డీ. బర్మన్, లక్ష్మీ కాంత్ ప్యారేలాల్, సలీల్ చౌదరిలతో కలిసి ఆమె చేసిన సంగీత ప్రయాణం ప్రత్యేకతను చాటుతుంది.

**గౌరవాలు, పురస్కారాలు...** లతా మంగేష్కర్ భారతీయ సంగీత రంగానికి చేసిన సేవలకు అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు: భారతరత్న (2001): భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం, పద్మ భూషణ్ (1969), పద్మ విభూషణ్ (1999), దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1989), ఫిల్మ్ ఫేర్ అవార్డులు 4 సార్లు, నేషనల్ ఫిల్మ్ అవార్డులు 3 సార్లు, మహారాష్ట్ర భూషణ్ అవార్డు (1997), లెజియనాఫ్ హానర్ (ఫ్రాన్స్ నుండి గౌరవం). దేశభక్తి గీతం "ఏ మేరే వాతన్ కే లోగో" 1963లో భారత–చైనా యుద్ధం తర్వాత లతా పాడిన "ఏ మేరే వాతన్ కే లోగో" దేశభక్తి గీతం, భారతీయుల హృదయాలను తాకింది. దాని ప్రదర్శన సమయంలో ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కన్నీరు పెట్టుకున్నారు. ఈ గీతం భారతదేశం కోసం ఆమె చేసిన అత్యుత్తమ సాంస్కృతిక కృషిగా గుర్తించ బడింది.


**ఆల్బమ్‌లు, రికార్డులు...** లతా మంగేష్కర్ ఎన్నో ఆల్‌టైమ్ హిట్ ఆల్బమ్‌లను విడుదల చేశారు. 1974లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో "మోస్ట్ రికార్డెడ్ ఆర్టిస్ట్" గా గుర్తింపు పొందారు.

**ప్రపంచ ప్రాశస్త్యం...** లతా మంగేష్కర్ సంగీతానికి భారతీయతను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆమె గానంతో భారతీయ కళాశైలలు, సంప్రదాయాలను కొత్త స్థాయికి తీసుకెళ్లారు. 2022 ఫిబ్రవరి 6న, లతా మంగేష్కర్ ముంబయిలో తన చివరి శ్వాస విడిచారు. ఆమె మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటు. లతా మంగేష్కర్ తన గానం ద్వారా సంగీత ప్రియుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయారు. ఆమె పాటలు తరతరాలకూ అందరినీ అలరిస్తూ ఉంటాయి. ఆమె భారతీయ సంగీతానికి చేసిన సేవలు చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయ బడతాయి. స్వర కోకిలగా ఆమె పేరు యుగయుగాల పాటు ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విజయవాడలో అనుమానాస్పదస్థితిలో వైద్య విద్యార్థిని మృతి

విజయవాడ : నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. అనస్తీషియా విభాగంలో పీజీ ఫైనలియర్ చదువుతున్న దీపిక మృతిచెందినట్లు సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందా?ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు దీపిక విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఆకలిగా ఉందంటూ తోటి విద్యార్థినితో ఆమె ఆహారం తెప్పించుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఒంట్లో కాస్త ఇబ్బందిగా ఉందని చెప్పడంతో మరో వైద్య విద్యార్థిని ఇంజక్షన్ చేశారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఆపరేషన్ గదిలో బల్లపై పడిపోయిన స్థితిలో దీపిక ఉన్నారు. అనంతరం మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై



వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రితో ఆయన మాట్లాడారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దీపిక మృతికి గల కారణాలు తెలుసుకోవాలని సీపీ రాజశేఖర్‌బాబును మంత్రి ఆదేశించారు.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు సూరి భగవంతం – ఫిబ్రవరి 6...సూరి భగవంతం వర్ధంతి

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948–49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితులైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్



(ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్.బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువరించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువరించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# అపర చాణక్యమే.. ట్రంప్ ను దిగొచ్చేలా చేసిందా ?

మాయల్లేవు. మంత్రాల్లేవు. కేవలం వ్యూహమే. అదరలేదు. బెదరలేదు. వ్యూహాత్మక అడుగులు వేశారంతే. వెంటనే ట్రంప్ కు వాస్తవం బోధపడింది. దీంతో ఇండియాతో టారిఫ్ వార్ కు ఎండ్ కార్డ్ పడింది. మోదీ అనుసరించిన వ్యూహమే భారత ఎగుమతులపై టారిఫ్ లు 50 శాతం నుంచి 18 శాతానికి దిగిరావడానికి కారణం. 500 శాతం విధిస్తామని బెదిరించిన ట్రంప్ ను.. 18 శాతానికి తీసుకొచ్చారంటే.. దాని వెనుక ఉన్నది సమయస్ఫూర్తితో వ్యవహరించడం, అవకాశాలను అనుకూలంగా మలుచుకోడం. ఫలితంగానే ఇండియా యూఎస్ మధ్య ఉన్న టారిఫ్ వార్ కు ముగింపు పడింది. లేదంటే ఎడతెగని వ్యవహారంగా మారేది. ట్రంప్ వార్నింగ్.. రష్యా నుంచి ఆయిల్ కొనొద్దని అమెరికా ఒత్తిడి చేసింది. కానీ భారత్ వెంటనే తగ్గలేదు. కొనుగోలు చేసింది. ట్రంప్ ఆంక్షలు విధించారు. 50 శాతం టారిఫ్ విధించారు. అయినా భారత్ వెనకడుగు వేయలేదు. పరిస్థితులను అంచనా వేసింది. పరిణామాలను ఊహించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించింది. అమెరికా మనకెంత అవసరమో. అమెరికాకు మనం అవసరం అంతే ఉంది. అందుకే వ్యూహాత్మకంగా పావులు కదిపింది. అమెరికాపై పూర్తిగా ఆధారపడకూడదని నిర్ణయం తీసుకుంది. మార్కెట్ రిస్క్ ను తగ్గించుకునే విధంగా డైవర్సిఫై చేయడం మొదలుపెట్టింది. కొత్త మార్కెట్ల అన్వేషణ మొదలుపెట్టింది. యూరోపియన్ యూనియన్ తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఇది రెండు దేశాల దీర్ఘకాల అభివృద్ధికి చాలా కీలకం. దీంతో అమెరికాకు వాస్తవం బోధపడింది. అప్పుడు కూడా అమెరికా సైలెంట్ కాలేదు. ఇండియాతో ఈయూ డీల్ అంటే.. పరోక్షంగా రష్యాకు యుద్ధ వనరులు సమకూర్చడమే అని హెచ్చరించింది. ఈయూ కూడా అమెరికాను లెక్కచేయలేదు. అదే సయమంలో గ్రీన్ ల్యాండ్ విషయంలో అమెరికా తీరును తప్పుపట్టింది. ట్రంప్ వ్యవహార శైలితోనే ఈయూ, భారత్ మధ్య ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ తొందరగా కుదిరిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాకే నష్టం.. ఇండియాపై టారిఫ్ లు విధించడం ద్వారా అమెరికాకే నష్టం. ఎందుకంటే భారత ఎగుమతులకు అమెరికా మార్కెట్ ఎంత అవసరమో.. అమెరికాకు ఎగుమతులకు భారత మార్కెట్ అంతే అవసరం. ప్రపంచంలో జనాభాలో రెండో స్థానంలో ఉన్న భారత మార్కెట్ లేకపోతే అమెరికా ఉత్పత్తులు అమ్ముడుపోవు. అదే విధంగా టెక్నాలజీ రంగంలో అమెరికా ఆధిపత్యం చెలాయించడానికి భారత నిపుణులే మూలాధారం. వీరు లేకుండా టెక్నాలజీ రంగంలో అమెరికా ముందుకు వెళ్లలేదు. ఆవిష్కరణలు సాధ్యం కావు. కాబట్టి ఎలా చూసినా మనలాగే అమెరికాకు అవసరాలు ఉన్నాయి. వీటిని అంచనా వేసుకుని ఇండియా ఈయూతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుంది. తద్వార కొత్త మార్కెట్ ద్వారాలు తెరుచుకున్నాయి. మరికొన్ని దేశాలతో కూడా ఇండియా చర్చలు జరుపుతోంది. దీంతో అమెరికాపై పూర్తి స్థాయిలో ఆధారపడాల్సిన పనిలేదు. ఇది ట్రంప్ కు అర్థమైంది. అందుకే టారిఫ్ లు తగ్గించారు. రష్యాతో ఆయిల్ కొనొద్దని ట్రంప్ ఒత్తిడి తెచ్చినా ఇండియా వెంటనే తగ్గలేదు. టారిఫ్ ప్రభావాన్ని భరిస్తూనే చర్చలు జరిపింది. మరోవైపు నూతన మార్కెట్లను అన్వేషించింది. క్రమంగా రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించింది. అమెరికాతో ముడిపడి ఉన్న దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించింది. ఫలితంగా ట్రంప్ దిగొచ్చారు. ఇండియా రష్యా ఆయిల్ కొనుగోలు ఆపడంతో ట్రంప్ అనుకున్నది జరిగింది. దీంతో రెండు దేశాల మధ్య జరుగుతున్న టారిఫ్ వార్ కు ఎండ్ కార్డ్ పడింది.


# అనంత మహిమాన్వితుడు భీర్పూరు నారసింహుడు - నేడు భీర్పూరు నారసింహుని రథోత్సవం



స్వర్ణాసన పీఠాయ దండకారణ్య వాసినే, శ్రీమద్భీర్పురీశాయ శ్రీనృసింహాయ మంగళం:" రాష్ట్రం లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ధర్మపురి సమీపస్థ, భీర్పూర్ మండల కేంద్ర సమీప శ్రీ లక్ష్మీనర సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28న ప్రారంభమై, ఫిబ్రవరి 6వ తేదీన రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగనున్నాయి. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఈఓ సంకటాల శ్రీనివాస్ ఆద్వర్యంలో, అర్చకులు, అధికారులు వలసిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. భీర్పూర్ గ్రామ శివార్లలో పెద్దగుట్ట, చిన్న గుట్టలపై వెలసిన శ్రీలక్ష్మీనర సింహ స్వామి భక్తుల పాలిటి కరుణా కటాక్ష మూర్తిగా, దుష్ట శిక్షకుడుగా, శిష్ట రక్షకుడుగా పేరెన్నిక గన్నారు. పూర్వం అవుసుల ధర్మయ్య అనే అధ్యాప కుడు, తన కుమారునితో విభేదించి, స్వామిని ఆశ్రయించాడని, ఆచార వ్యవహారాలు, సాంప్రదా యాలను తులనాడే తన కుమారున్ని కడతేర్చి పరువు కాపాడితే, కస్తూరి తిలకాన్ని స్వామికి దిద్దగలనని ధర్మయ్య మొక్కుకోగా, అదేవిధంగా జరగడంతో, వెంటనే మొక్కు తీర్చుకున్నాడనే కథ ఈ ప్రాంతంలో మిగుల ప్రచారంలో ఉంది. నేరేళ్ళ గ్రామానికి చెందిన ఒక గొల్ల బాలుడు, మేకలను మేపుతూ, ఒక రోజున చిన్నగుట్ట పైకి వెళ్ళగా, బాలుని రూపంలో వచ్చిన స్వామి తన దాహం తీర్చమని అబాలుని కోరారు. మేకలన్నింటిని గుహ లోనికి తోలుకెళ్ళి, వాటి పాలతో గొల్ల బాలుడు స్వామి దాహాన్ని తీర్చాడు. అలాగే గుట్ట దిగుతూ వెను తిరిగి చూడగా తనమంద అనూహ్యంగా పెరగడాన్నిగాంచి, అశ్చర్య చకితుడై, దానిని భగవత్కృపగా భావించి, నేరేళ్ళ సంస్థానాధీశునికి జరిగిన విషయం చెప్పాడట. అంతకు ముందు రోజు స్వామి తనకు కలలో కనిపించి, ఆలయ నిర్మాణానికి సహకరించ మనడాన్ని గుర్తెరిగి, ఆయన వెంటనే నమ్మనాచార్యులకు కబురు పంపాడు. ఆయన సహకారంతో, నమ్మనాచార్యులు అప్పటికే వెలసిన స్వామిని కనుగొని భక్తి శ్రద్ధలతో పూజించి, ఆలయ నిర్మాణం పూర్తి గావించడం జరిగింది. అప్పటినుండి ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెపుతారు. దేవాలయ ఉత్సవ నిర్వహణకై ఖుతుబ్ షాహీల కాలంలో మాన్యాలు ఇవ్వ బడినాయని, అయితే ఢిల్లీ సుల్తానులు, ఖుతుబ్ షాహీలపై దండెత్తి గోల్కొండను కైవసం చేసుకున్నాక, అట్టి మాన్యాలను రద్దు పరచినట్లు చెపుతారు. 1881లో నిజాం ప్రభువులు స్వామివారల పేరున ఉన్న మాన్యాలను ఆలయ ధర్మకర్తలు, ప్రధానాచార్యుడైన వొద్దిపర్తి రామానుజాచార్యులనుండి తిరిగి తీసుకున్నారని చారిత్రికా ధారాలున్నట్లు చెపుతారు. ఆ తర్వాత అర్చకులు తుంగూరు, భీర్పూరు, నర్సింహుల పల్లె తదితర గ్రామాల్లో భిక్షాటనచేసి ఉత్సవాలను నిర్వహించారు. అదేవిధంగా అర్షకోట పరగణా క్రింద గల గ్రామాల ప్రజలు స్వామివారి ఉత్సవాల నిర్వహణకు కానుకలను సమర్పించడం అనవాయితీగా మారింది. భీర్పూర్ నృసింహుని ఉత్సవ వేడుకలలో భాగంగా, 6న శుక్రవారం ఉదయా త్పూర్వం 4గంటలకు దోపుకథ, మద్యాహ్నం 12గంట లకు మహా పూర్ణాహుతి, సాయంత్రం 4గంటలకు రథోత్సవం, రాత్రి 7గంటలకు నాగబలి, చక్ర తీర్థం, 7 శని వారం రాత్రి 7 గంటలకు ఏకాంతోత్సవం, 8న ఆది వారం ఉదయం 10 గంటలకు ఏకాదశ కలశ స్వపన తిరుమంజనం, పవిత్రో త్సవం, ప్రధాన కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. దేవస్థానం నిర్వహణాధికారి ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, దేవస్థానం చైర్మన్ చీరనేని శ్రీనివాస్, యశోద రమేష్, గుమ్మడి రమేష్, గంగామణి, లక్ష్మణ్, జగన్మోహన్, సత్యం, చల్ల లక్ష్మణ్, సతీష్, సత్యనారాయణ, గంగాధర్, సామ్రాట్, లవణ్, సురేందర్, దేవస్థానం అర్చకులు, సిబ్బంది బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించే కార్యక్రమాలలో నిమగ్నమైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# "ఇట్లు మీ విధేయుడు" భమిడిపాటి - ఫిబ్రవరి 6...భమిడిపాటి రామగోపాలం జయంతి


భమిడిపాటి రామగోపాలం (ఫిబ్రవరి 6, 1932 – ఏప్రిల్ 7, 2010) గా తెలుగు రచయిత, పత్రికా సంపాదకులు. విజయనగరం జిల్లా పుష్పగిరిలో 1932 ఫిబ్రవరి 6న జన్మించారు. తండ్రి సూర్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్ టీచర్. అమ్మ సూరమ్మ. ఇద్దరు తమ్ముళ్లు. ఉద్యోగ రీత్యా తండ్రి వివిధ ఊళ్లు తిరిగారు. విజయ నగరంలో స్థిరపడ్డారు. ఐదో తరగతి వరకు నాన్న ఇంటి దగ్గరే చదువు. అలమండ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో ఆరో తరగతి. 1951లో బీ.ఏ. భాగల్పూర్ యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. (ఇంగ్లిషు), ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఏ. (తెలుగు) చేశారు. విజయనగరం సత్రంలో ఉచిత భోజనం చేస్తూ, పిల్లలకు ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదించి, అది ఇంటికి ఇస్తూ చదువుకున్నారు. 1951లోనే విజయ నగరంలోనే సెన్సస్ ఆఫీసులో చెకర్‌గా ఉద్యోగ జీవితం మొదలైంది. అప్పటి మద్రాసు సర్వే విభాగంలో గుమస్తాగా, సర్వేయర్‌గా, హెడ్ సర్వేయర్‌గా పనిచేశారు. వివిధ ప్రదేశాలు తిరిగారు. 1967లో నర్సరావుపేటలో ఉద్యోగం చేశారు. అప్పటికే రచనా వ్యాసంగంలో ఉండటం, రేడియో స్టేషన్‌కు వెళుతుండటం వంటి వ్యాపకాల వల్ల తరచూ విజయవాడలో ఉండేవారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు బదిలీ అయ్యారు. కాఫీ అన్నా, ఆంధ్ర పత్రిక పత్రి కన్నా, రేడియో అన్నా ప్రాణం. ఉద్యోగానికి సెలవు పెట్టి బెజవాడ వీధుల్లో తిరుగుతూ నార్ల వెంకటేశ్వరరావు కంటబడ్డాడు. ఆయన అక్కడిక్కడే ఉద్యోగం ఇచ్చి ఆంధ్రజ్యోతిలో ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్యశర్మకు అసిస్టెంట్‌గా నియమించాడు. 1967 నుంచి 68 వరకు అక్కడ పనిచేశారు. 1985–86 మధ్య మద్రాసు నుంచి వెలువడే ఉదయ భారతి పత్రిక ఎడిటర్‌గా చేశారు. 1974లో విశాఖ పోర్టులో చేరి, 1990లో ఉద్యోగ విరమణ చేశారు. 1974–78 మధ్య 'ఈనాడు' కల్చరల్ రిపోర్టర్‌గా పనిచేశాడు. ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లకూ కొన్నాళ్లు పనిచేశారు. భమిడిపాటి చాలా చమత్కారులు. ముక్కుకు సూటి వ్యక్తి. ఆయన కథలు వ్రాసే తొలినాళ్ళలో ఒక పత్రిక ఆయన కథను ప్రచురించి పారితోషికం 3 రూపాయలు ఆయనకు పంపలేదట! వెంటనే ఆయన ఆ పత్రికాఫీసుపై కోర్టుకెళ్ళారు. "రచయిత ఎంతో సమయాన్ని వెచ్చించి బుర్ర చించుకొని మీకు పంపిస్తే, మీరు దాన్ని అచ్చేసి అమ్ముకొని సంపాదించు కొన్నప్పుడు దానిలో ఒక్క మూడు రూపాయలు పారితోషికాన్ని అతనికి పంపలేరా? ఆ వ్యక్తి కొత్త రచయిత అయితే మాత్రం నిర్లక్ష్యం చేస్తారా? " అని కోర్టు తీర్పు యిస్తూ, ఈ కేసుకు చెందిన కోర్టు ఖర్చులు కూడా ఆ పత్రికా కార్యాలయం చేత యిప్పించింది. 78 ఏళ్ళ వయసులో రెండు కాళ్లు వేళ్లూ పడిపోయినా సహాయకులకు మౌఖికంగా చెబుతూ సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఆస్టియో ఆర్థరైటిస్ వల్ల రెండు కాళ్లు పని చేయలేదు. 2004 నుంచీ కాలివేళ్లు, చేతి వేళ్లకు తిమ్మిరి. ఇంటా, బయటా చక్రాల కుర్చీలోనే. అయినా సాహితీ వ్యాసంగాన్ని మానలేదు. ఆరు కథా సంపుటాలు, మూడు నవలలు వెలువరించారు. తన ఆత్మకథను "ఆరామ గోపాలమ్" పేరుతో సచిత్రంగా ప్రచురించారు. ప్రముఖ వ్యక్తులు, సంస్థలపై 17 సావనీర్లు రూపొందించారు. మిత్రుడి జ్ఞాపకార్థం నెలకొల్పిన జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్ తరపున అనేక పుస్తకాలు ప్రచురించారు. 'ఇట్లు మీ విధేయుడు'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గెలుచుకున్నారు. 1980 – నేనెందుకు వ్రాస్తున్నాను? వ్యాస సంపుటికి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం (అత్తలూరి నరసింహారావుతో కలిసి), 1991 – ఇట్లు మీ విధేయుడు గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. 2010 ఏప్రిల్ 7 న భమిడిపాటి రామగోపాలం (భరాగో) విశాఖ నగరంలో కృష్ణా కళాశాల సమీపంలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఎవరూ ఊహించలేని ఆయన శరీరానికున్న సమస్యలు, మొరాయించే చేతి వేళ్ళు, కదలని కాళ్ళు, కదలికకు సహకరించని శరీరం, చెప్పినమాట వినని గుండె, ఇంకా ఇలా ఎన్నెన్నో సమస్యలు, నిత్య జీవిత పోరాటాలు. ఒక్క మెదడు చురుకుగా పనిచేస్తే చాలు... ఎన్ని రుగ్మతలనయినా జయించవచ్చని నిరూపించి చూపిన దృఢ చిత్త వ్యక్తి ఆయన. జీవితాన్ని ఎదిరించి, శాసించి, కష్టానికీ, నష్టానికీ లొంగక– తన షరతులమీదే జీవికని నడిపించి– హఠాత్తుగా, తీవిగా, గర్వంగా వెళ్ళిపోయిన ఓ "ఉద్యమం" అయన. ఎందరికో స్ఫూర్తిని కలిగించున హాస్య రచయిత భమిడిపాటి. నేను సున్నా నుంచో... మరీ చెప్పాలంటే మైనస్ నాలుగు నుంచో జీవితం మొదలు పెట్టాను. పేదరికం చాలా గొప్పది. అది పని చేసే ఉద్దేశం కలుగ చేస్తుంది. "నేను నా జీవితాన్ని సంపూర్ణంగా జీవించాను. సంతోషంగా బతికాను. బతికినంత కాలం పనిచేస్తూ ఉండటమే నా లక్ష్యం. సాహితీ రంగంలో నాకంటే ఘనులు




చాలా మందే ఉన్నారు. కానీ నా ప్రత్యేకత నాకుంది. నాకు భోజనం, దుస్తులు, ధనం మీద ఆసక్తి తక్కువ. అందుకే ఇంత సంతోషంగా ఉండగలుగు తున్నాను. జీవితాన్ని తేలిగ్గా తీసుకోవాలి". భమిడిపాటి పై వాక్యాలు చూస్తే, ఆయన వ్యక్తిత్వం, జీవితంలో సంతృప్తితో బ్రతికిన తీరు స్పష్టం అవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అహింసా వాది సరిహద్దు గాంధీ - ఫిబ్రవరి 6... ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ జయంతి



మహాత్మా గాంధీజీ లాగే ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ అహింసా వాది. జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు. అందుకే అయన సరిహద్దు గాంధీగా పేరెన్నిక గన్నాడు. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.... ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంత మందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించాడు. "ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి" అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. "నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసా మార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను" అన్న ప్రతిజ్ఞతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ. "బాద్షా ఖాన్" గా కూడా సరిహద్దు గాంధీ పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారాన్ని పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఆయన అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. అయన పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారత దేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధుడు. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అయన మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు, మిత్రుడు, ఆయన భారత దేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు. వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉత్మాన్జై లోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్–ఇ ఇస్లా–ఇ అఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), అలాగే 1927 లో యువత ఉద్యమమైన 'పాక్తున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత, పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం... గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే, అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. ఆయన 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నాడు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వరించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని, ఖుదై ఖిద్మత్గర్... అల్లా సేవకునిగా మాత్రమే నేను సేవ చేయాలనుకుంటున్నాను" అని చెప్పి సున్నితంగా తిరస్కరించాడు. అయన చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా మాత్రం ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడు తుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడడానికి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడడానికి ప్రతిజ్ఞ చేయడానికి ఒప్పించాడు. ఆ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అయన "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సేవకులు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి వివరించి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారత దేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మందికి శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాధన ద్వారానే సాధ్యమని నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్ లో పాఠశాలలను తెరిచాడు. మహిళలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేశాడు. తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయ నాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లిం లీడర్లు, ఆయన ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశాడు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు. 'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. సరిహద్దు ప్రాంత వాసులకు ద్వేషిగా మారాడు. దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ నాయకులు తీవ్రంగా ద్రోహం చేశారని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు" అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది. శాశ్వతంగా మిగిలి పోతుందని పిలుపు నిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటు పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చాడు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచి పోయినట్లు గానే గాంధీని మరచి పోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్ ఖాన్ పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు



# ఆదాయం.. 'దారి'తప్పుతోంది!

కొత్తగూడెం : పిల్లలందరూ టై, బెల్టు, యూనిఫాం ధరించి పాఠశాలలోకి ప్రవేశిస్తున్నారా? లేదా? తెలియాలంటే ఏం చేయాలి? ప్రవేశ ద్వారం ఎదుట ఓ ఉపాధ్యాయుడు నిల్చుని తనిఖీ చేస్తే సులువుగా తెలిసి పోతుందిగా..! పొరుగు రాష్ట్రం నుంచి వచ్చే ఇసుక వాహనాలన్నీ పన్ను చెల్లించేలా చూడాలంటే ఏం చేయాలి? చిన్న పని.. సరిహద్దున ఓ తనిఖీ కేంద్రం ఏర్పాటు చేస్తే సరి. కానీ మన అధికారులు ఇంత సులువైన ప్రక్రియను పక్కనబెట్టి రోడ్లపైనే అక్కడక్కడా తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నారు.. కొంచెం నిశితంగా గమనిస్తే ఇందులోనే మతలబు ఉందని అర్థమవుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే విధి నిర్వహణలో మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం మనకు చిక్కదు.. యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు అసలు దొరకరు. రాష్ట్ర ఖజానాకు జరుగుతున్న నష్టం మాత్రం ప్రత్యక్షంగా కనిపిస్తోంది.. భద్రాచలం సరిహద్దుగా ఉన్న ఏపీ ఇసుక రీచ్ నుంచి ఉభయ జిల్లాల మీదుగా ఇతర ప్రాంతాలకు తరలుతున్న ఇసుకకు ఒక రోజులో రావాల్సిన అంతర్రాష్ట్ర పన్ను రూ.1.8 లక్షలు.. ఇదంతా ఎటుపోతుందో అర్థం కావటం లేదు.

**విషయం ఏంటి?**

పూర్వ ఖమ్మం జిల్లాకు ఏపీ సరిహద్దుగా ఉంది. ఆ రాష్ట్రంలోని గోదావరి తీరం నుంచి వేల టన్నుల ఇసుక నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దులు దాటుతోంది. భద్రాచలం సమీపంలోని ఈ రీచ్ నుంచి భద్రాద్రి, ఖమ్మం జిల్లాలను వారధులుగా చేసుకుని హైదరాబాద్ అక్కడి నుంచి కర్నూలు, కడప జిల్లాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఖనిజ రవాణా జరగాలంటే పన్నులు చెల్లించాలి. మనదగ్గర అధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో 'మామూళ్ల' పర్వం జీరో ట్యాక్స్‌కు రాచబాటలు వేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.



**ఎంత తరలుతోంది?**

రోజుకు సుమారు 30కి పైగా లారీలు అంటే 900 టన్నులకు పైగా ఇసుక ఇతర ప్రాంతాలకు చేరుతోంది. టన్నుకు అంతర్రాష్ట్ర పన్ను కింద రూ.200 చొప్పున రోజూ ఖజానాకు రూ.1.80లక్షల చిల్లు పడుతోంది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు మామూళ్ల మత్తులో ఉండి కళ్ల ముందే భారీ వాహనాలు వెళ్తున్నా పట్టించుకోవడం లేదు.

**స్థానిక మార్కెట్‌లోనూ..**

ఏపీ ఇసుక కేవలం హైదరాబాద్, కడప, కర్నూలుకే పరిమితం కావడం లేదు. ఉభయ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లోని భవన నిర్మాణాల కోసం వినియోగిస్తున్నారు. ఇక్కడ స్థానిక సైకతం కంటే తక్కువ ధరకు (ఎలాంటి పన్నులు లేకపోవడం వల్ల) లభిస్తుండటంతో భవన నిర్మాణ గుత్తేదారులు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంలో భారీగా కోతపడుతోంది. 'అంతర్రాష్ట్ర పన్ను చెల్లించకుండా ఇసుక రవాణా చేస్తున్న వాహనాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. క్షేత్ర స్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఇటీవల కొన్ని లారీలను సీజ్ చేసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు తరలించాం. అదనపు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తాం.'

దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

# ఇట్టే కని'పెట్టె'

ఖమ్మం : క్షయ వ్యాధి నిర్ధారణలో ఖమ్మం జిల్లా మరో ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని సెంట్రల్ టీబీ డివిజన్ సహకారంతో అత్యాధునిక ఏఐ సాంకేతికతతో కూడిన పోర్టబుల్ ఎక్స్-రే పరికరాన్ని దాదాపు రూ.23 లక్షలతో అందుబాటులోకి తెచ్చింది. జిల్లా క్షయ విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ పరికరాన్ని ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముఖ్యంగా చిన్నపిల్లలకు టీబీ పరీక్షలు దీంతో సులభతరం కానున్నాయి.

ఇదీ ప్రత్యేకత

1 ఆధునిక పరికరం కేవలం 3 సెకన్ల కంటే తక్కువ సమయంలోనే ఎక్స్-రే చిత్రాన్ని తీయగలదు. శిబిరాల్లో తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి స్క్రీనింగ్ చేయటం సాధ్యమవుతుంది.

2 70కేవీ హై ఇమేజ్ క్వాలిటీ, 0.4ఎంఎం ఫోకల్ స్పాట్ సాంకేతికతతో ఎంతో స్పష్టంగా చిత్రాలను అందిస్తాయి. తద్వారా వైద్యులు వ్యాధిని కచ్చితంగా నిర్ధారించే అవకాశం ఉంటుంది.

3 సాధారణ ఎక్స్-రే తీసే సమయంలో వృద్ధులు, పిల్లలు అటుఇటు



కదులుతుండటంతో చిత్రం మసకబారే ఆస్కారం ఉంటోంది. ఈ పరికరంతో అలాంటి సమస్యలుండవు.

4 చాలా తక్కువ బరువు ఉండటంతో తరలించటం సులువు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు సులువుగా తీసుకెళ్లి నిముషాల్లో ఫలితాలను రాబట్టవచ్చు.

5 స్వల్ప లక్షణాలు ఉన్నవారిలో కూడా టీబీని గుర్తించి అరికట్టవచ్చు. రేడియేషన్ సమస్యకూడా లేకపోవడంతో స్క్రీనింగ్ చేసేటపుడు రోగులపై ఎలాంటి దుష్ప్రభావాలకు అవకాశం ఉండదు.

'రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు మాత్రమే ఈ తరహా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. క్షయ నివారణలో బాగా ఉపయోగపడుతుంది. ఏ ఒక్కరూ రోగ నిర్ధారణ కాకుండా, చికిత్స అందకుండా మిగిలిపోవద్దన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అత్యాధునిక పరికరం అందుబాటులోకి రావటం ద్వారా టీబీ రహిత సమాజం దిశగా పునాదులు పడే అవకాశం ఏర్పడింది. రోగులకు ఉచితంగా ఈ సేవలు అందించనున్నాం.'

డాక్టర్ వి.సుబ్బారావు, జిల్లా క్షయ నివారణాధికారి.

# వారధి నిర్మాణం.. ఇంకెంత కాలం



కోరుట్ల: కోరుట్ల పరిధి కల్లూర్ శివారులోని పెద్దవాగుపై నూతన వంతెన నిర్మాణం అంచనాలకే పరిమితమైంది. ఏటా భారీ వర్షాలకు వాగులో వరదలు రావడంతో కల్లూర్ పెద్దవాగుపైనున్న లోలెవల్ వంతెన పూర్తిగా మునిగిపోతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత నెల 16న గోదావరిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ప్రారంభం సందర్భంగా నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామానికి సీఎం రేవంత్‌రెడ్డిరాగా స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్లూర్ వాగుపై వారధి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

**అంచనాలు సరే నిధులేవి..**

రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న వంతెనలను పరిశీలించి నూతన నిర్మాణాలకు అంచనాలను రూపొందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు కల్లూర్ వారధిని పరిశీలించి సర్వే చేశారు. లోలెవల్ వంతెనను తొలగించి దాని స్థానంలో నూతనంగా నిర్మాణం చేపడితే ప్రజా రవాణాకు ఉపయోగకరంగా ఉంటుందని నిర్ణయించారు. రూ.10 కోట్లతో అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఏడాదిన్నర గడిచిన ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

**కొట్టుకుపోతున్న పైపులు**

కల్లూర్ వంతెనపై మీదినుంచి మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పైపు ద్వారా కోరుట్ల పరిధిలోని సర్వరాజ్‌పూర్, మాదాపూర్, పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, జోగిన్‌పల్లి, రాయికల్ మండలం మైతాపూర్ గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా అవుతుంది. వాగులో వరదలు వచ్చినప్పుడల్లా ఏటా పైపులు కొట్టుకుపోతున్నాయి. దీంతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసేవరకు ఆరు గ్రామాల ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నూతన వంతెన నిర్మాణం జరిగితే దానిపైనుంచి భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసి భగీరథ నీటి సరఫరా ఇక్కట్లు తొలగించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# అంచెలంచెలుగా ఎదిగిన.. కరీంనగర్



కరీంనగర్: 1952 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 74 ఏళ్ల ప్రస్థానంలో మున్సిపల్ స్థాయి నుంచి నగరపాలక హోదాతో స్మార్ట్‌సిటీ నగరాల్లో చోటు దక్కించుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ కరీంనగర్ స్థానం పదిలపర్చుకుంది. ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచి.. రాజకీయ, ఉద్యమాలు, సామాజిక స్థితిగతులు, అభివృద్ధి విషయాల్లో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు.

**కుగ్రామం నుంచి నగరం వరకు..**

మానేరు నదికి ఉత్తరాన గతంలో ఆరిఫిరాల అనే కుగ్రామం ఉండేది. ప్రస్తుతం నగరంలోని పాతబజారులోని శివాలయం ప్రాంతంలో ఈ గ్రామం ఉండేది. ఈ ప్రాంతం క్రీస్తు శకం 978-1153 వరకు కల్యాణి చాళక్యులు, 1159-1323 వరకు కాకతీయులు, 1518-1687 వరకు కుతుబుషాహీలు, 1687-1724 వరకు ఢిల్లీ మొగలాయిలు, 1724-1948 వరకు అసఫ్‌జాహీల పాలనలో ఉండేది.


16, 17వ శతాబ్దంలో కుతుబుషాహీల కాలంలో గోల్కొండ నుంచి అరబ్బులు ఇక్కడికి వచ్చే వారు. ఆ సమయంలో వర్షాల కారణంగా వరదలు వచ్చి నదిని దాటడానికి ఏనుగులను ఉపయోగించుకునేవారు. కరి(ఏనుగు) పేరుతోనే ఈ ప్రాంతాన్ని కరినగర్‌గా పిలిచే వారని చరిత్ర చెబుతోంది.

19వ శతాబ్ది ప్రారంభంలో కరీముల్లాషా బాబా అనే వారు ఇక్కడ ఉండేవారు. ఆయన స్మారకార్థం పాతబజారులో కరీముల్లాషా దర్గా ఏర్పాటు చేశారు. అసిఫ్‌జాహీల పాలనలో ఎలగందుల సర్కార్ కేంద్రంగా ఉండేది. దానికి ఖిలేదారు అయిన కరీముల్లాషా బాబా పేరుతోనే కరీంనగర్ పేరును ఖాయం చేశారని చరిత్ర చెబుతుంది. కరీంనగర్ పురపాలికల నుంచి నగరపాలక స్థాయిలో కొనసాగిన పాలకవర్గాల్లో ఛైర్‌పర్సన్‌గా ఒకేసారి మహిళ ప్రేమలతాదేవికి అవకాశం దక్కింది.

మూడో గ్రేడ్ నుంచి స్మార్ట్‌సిటీ నగరపాలిక

1948 సెప్టెంబరులో పోలీసు చర్య అనంతరం తెలంగాణ ఇండియాలో విలీనమైంది. 1952లో కరీంనగర్ పట్టణం మూడో గ్రేడ్ పురపాలికగా పురుడు పోసుకుంది. 2005లో నగరపాలిక హోదా సాధించుకొని నేడు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ స్థాయికి చేరుకుంది.

# పుర పోరులో.. యువ బలగం



పెద్దపల్లి : ప్రశ్నించేతత్వం, ఉడుకు రక్తం, సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకునే యువత ఓటు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే విషయంలో వీరి అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలోని రామగుండం నగర పాలకసంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల్లో యువత నిస్వార్థంగా ఓటు అస్త్రాన్ని సంధించి అభివృద్ధికి బాటలు వేయాల్సిన తరుణం ఆసన్నమైంది. కాగా జిల్లాలో 46 శాతం యువ ఓటర్లు ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

**యువతే కీలకం** జిల్లాలో 124 వార్డుల్లో 1,28,281 పురుషులు, 1,29,749 మహిళలు, 34 ఇతరులు కలుపుకొని మొత్తం 2,58,064 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అతివల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. పురుషుల కంటే మహిళలు 1,468 మంది ఎక్కువ ఉన్నారు. జిల్లాలో 18-39 ఏళ్లలోపు గణాంకాలు పరిశీలిస్తే 46 శాతంతో 1,18,570 యువ ఓటర్లు ఉన్నారు. యువత ఆలోచన సరళిలో మార్పు వస్తోంది. విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు రాజీనామా చేసి బరిలో నిలిచేందుకు ముందుకొస్తున్నారు. అభివృద్ధి కోసం నిబద్ధత ఉన్న వ్యక్తులకే ఓటు వేసి తమ ఓటు విలువకు సార్థకత చేకూర్చాల్సిన అవసరం యువత ముందు ఉంది.

**సామాజిక మాధ్యమాల వేదికగా..**

యువత సామాజిక మాధ్యమాల వేదికగా ఓటు చైతన్యంపై ప్రచారం చేస్తున్నారు. మిత్రులు బృందాలుగా ఏర్పడి ఫేస్‌బుక్, వాట్సప్, ట్విటర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఆలోచింపజేసే సందేశాలను పంపిస్తున్నారు. యువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. ఆట స్థలాలు, స్వయం ఉపాధి కల్పన, వ్యాయామశాలలు, గ్రంథాలయాలు, ఉద్యోగార్థులకు శిక్షణ కేంద్రాలు నెలకొల్పనున్నామని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పట్టణాల్లో అక్షరాస్యులైన యువత నేను ఒక్కడిని వేయకుంటే ఏమవదనే నిర్లిప్తతతో చాలా మంది వెనకాడుతున్నారు. అయితే పట్టణ ప్రగతి రూపురేఖలు మార్చేందుకు అభ్యర్థుల పక్షాన నిలబడి నిస్వార్థంగా ఓటేస్తేనే సార్థకత ఉంటుంది.

# హైదరాబాద్ వ్యర్థం.. మిర్యాలగూడలో దుర్గంధం

మిర్యాలగూడ : హైదరాబాద్ ఐడీఏ బొల్లారంలోని పరిశ్రమల నిషేధిత వ్యర్థాలను కొందరు ఏజెంట్లు మిర్యాలగూడ పట్టణానికి రాత్రి సమయాల్లో తరలించి అద్దంకి నార్కట్‌పల్లి రహదారి వెంట పోస్తున్న తీరు పరిశీలనలో వెలుగు చూసింది. బొల్లారంలోని ఓ పరిశ్రమ నుంచి కొందరు ఏజెంట్లు బస్తాలలో వ్యర్థాలను వాహనాల్లో తరలిస్తున్నారు. మిర్యాలగూడకు చెందిన డీసీఎంలు, లారీలు లోడు వేసుకొని హైదరాబాద్‌కు వెళ్లి ఖాళీగా వచ్చే వాహనాలను గుర్తించి వారికి అద్దె చెల్లించి వీటిని తరలిస్తున్నారు. ఒక్కో టన్నుకు రూ.వెయ్యి చెల్లిస్తూ డీసీఎంలో 20, లారీల్లో 35 టన్నుల మేర బస్తాలతో నింపి వ్యర్థాలు తరలిస్తున్నారు. అదనంగా డ్రైవర్లకు బస్తాలు అన్ లోడ్ చేసేందుకు సైతం డబ్బులు ఇస్తుండగా వారు యథేచ్ఛగా తరలిస్తున్నారు.

**అర్ధరాత్రి సమయంలో...** వ్యర్థాలను సదరు వాహనదారుడు పట్టణానికి తీసుకొచ్చి అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా అద్దంకి రహదారి వెంట పోస్తున్నారు. దీనికి పట్టణంలోని హనుమాన్‌పేటకు చెందిన కొందరు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ సుమారు రెండేళ్లుగా ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యర్థాల నుంచి భరించలేని దుర్వాసన వస్తుండగా ఏజెంట్లు వాటిపై మట్టి, ఇతర వ్యర్థాలతో కప్పి వేయిస్తున్నారు.

పరిశ్రమల వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేర నిర్ణీత విధానంలో భూమిలో మట్టితో నింపి కప్పేయాల్సి ఉండగా ఆయా కంపెనీల వారు డీసీఎం, లారీల వారికి అప్పగించి వదిలేస్తున్నారు.

**వారానికి నాలుగు వాహనాల చొప్పున...**

హనుమాన్‌పేట ప్రధాన రహదారి వెంట సర్వీసు రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డ్రైనేజీ పక్కన లోతట్టు ప్రాంతం మొత్తం కొద్ది రోజులుగా ఈ బస్తాలను నింపి వేస్తున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఉండటంతో డీసీఎంలు, లారీలు పగటి సమయాల్లో నిలిపి ఉంచుతుండగా ఎవరికి అనుమానం రావడం లేదు. ఇటీవల మిషన్ భగీరథ పైపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో సైతం వ్యర్థాల బస్తాలను తెచ్చి పడేశారు. వారానికి నాలుగు వాహనాల చొప్పున వ్యర్థాలను తీసుకువస్తున్నట్లు సమాచారం.

ఈ విషయంపై పుర కమిషనర్ జి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా పరిశ్రమల వ్యర్థాల తరలింపు విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే పురపాలిక పర్యావరణ ఇంజినీర్‌ను పంపి వ్యర్థాలను పరిశీలించి...తరలించిన వాహనాల వారిని గుర్తించి కేసులు నమోదు చేయిస్తామన్నారు.

# ఆమె ఆత్మస్థైర్యం.. ఎందరికో ఆదర్శం

కొణిజర్ల, : తెలిసి తెలియని వయసులో పెళ్లి.. ఆపై బాధ్యతలు.. పిల్లలు.. ఇవన్నీ కుదుటపడే సమయానికి భర్త మరణం.. చిన్న వయసులోనే ఎన్నో కష్టాలు ఎదుర్కొని నిలబడటం అంత తేలిక కాదు.. జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందని ఆశపడ్డ ఆమెకు ప్రతిదీ బాధనే మిగిల్చింది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని తల్లిదండ్రులున్న గ్రామానికి వచ్చి స్థిరపడ్డారామె. లక్ష్యం మీద అవగాహన.. కాస్త ప్రోత్సాహం.. ఉంటే మహిళలు సాధించలేనిదంటూ ఉండదని నిరూపిస్తున్నారు తేజావత్ శిల్ప. ఓ వైపు చదువుతూ మరోవైపు చిత్రలేఖనంలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**కష్టాలను అధిగమించి..**

అన్నవరానికి చెందిన శిల్పకు చిన్న వయసులోనే పెళ్లిచేశారు. ఇద్దరు పిల్లలకు జన్మనివ్వడం, భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఎటూ పాలుపోని స్థితిలో జీవితం చీకటిమయంగా మారింది. తల్లిదండ్రుల ఇంటికి వచ్చి పనిచేసుకుని పిల్లలను పోషించాలని నిర్ణయించుకున్నారు.



అక్కడ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి కూలీ పనులకు వెళ్లేవారు. అక్కడి ఉపాధ్యాయులు చదువుకోవాలనే ఆమె తపనను గమనించి దాతల సాయంతో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదివేందుకు ప్రోత్సహించారు. ఖమ్మంలోని ఓ కళాశాలలో మొదటి ఏడాది చదువుతున్నారు.

**చిత్రలేఖనంతో..**

శిల్పకు చదువుకునే రోజుల్లో చిత్రలేఖనంపై ఎంతో ఆసక్తి. వివాహంతో వాటికి దూరమయ్యారు. ఏడాది నుంచి ఈనాడులో వచ్చే స్ఫూర్తినిచ్చే కొటేషన్స్ చదువుతూ ముందుకు సాగాలనుకున్నారు. అద్భుతంగా చిత్రాలు గీస్తూ అందరిని అబ్బురపరుస్తున్నారు. ప్రకృతి అందాలు, ఆడపిల్లల సమస్యలు, గ్రామాల్లోని సంప్రదాయాలు, నాయకులు, సందేశాత్మక, సామాజిక అంశాలను చిత్రాలుగా వేస్తున్నారు. మరోవైపు ప్రాథమిక పాఠశాల, బాలవికాస్‌లోని విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనంలో శిక్షణ పొంది మంచి చిత్రకారిణిగా స్థిరపడాలనేది తన లక్ష్యమని శిల్ప అన్నారు.

# గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును

మెదక్: గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలు, ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు ఉమ్మడి జిల్లాలో తమ ఆధిపత్యాన్ని చాటేందుకు పురపాలికల వారీగా ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. నేడు నామపత్రాల ఉపసంహరణ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటికే మెదక్ జిల్లా కేంద్రంలో ప్రతిపక్ష భారాసకు చెందిన ఓ వార్డు అభ్యర్థి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో అప్రమత్తమైన ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. దీంతో అందరి దృష్టి నామినేషన్ల ఉపసంహరణలపైనే కేంద్రీకృతమైంది.

**ససేమిరా అంటూ..**



సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, సదాశివపేట, అందోలు-జోగిపేట పురపాలికల్లో కాంగ్రెస్, భారాసల నుంచి ఒక్కో వార్డులో ముగ్గురు, నలుగురు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సంగారెడ్డి బల్దియాలో అధికార కాంగ్రెస్ నుంచి ఎనిమిది వార్డుల్లో ఇద్దరేసి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం కాంగ్రెస్ అభ్యర్థులకు బీ-ఫాంలు జారీచేసింది. మిగిలిన అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకొని అధికారింగా ప్రకటించిన అభ్యర్థులకు సహకరించాలని సూచిస్తోంది. కొందరు దారికి వస్తుండగా మరికొందరు ససేమిరా అంటున్నారు.

**హామీలు ఇస్తూ..**

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో కొన్ని వార్డుల్లో భారాస నుంచి ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేశారు. వీరిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సిద్దిపేటకు పిలిపించుకొని మంతనాలు సాగించి బుజ్జగిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేల హామీలకు చల్లబడుతుండగా మరికొందరు పోటీకి సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాలలో మూడు పార్టీల అభ్యర్థుల ఎంపిక దాదాపుగా పూర్తయింది.

**అభ్యర్థులతో మంతనాలు సాగిస్తూ..**

మెదక్ జిల్లాలోని నాలుగు బల్దియాల్లో ప్రధాన పార్టీల మధ్య నువ్వానేనా అనే తీరుగా రాజకీయం నెలకొంది. ఓ పార్టీ నేత పలు వార్డుల్లో అభ్యర్థుల ఏకగ్రీవానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రతిపక్ష పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులపై దృష్టి కేంద్రీకరించినట్లు సమాచారం. దీనికి తోడు అధికార పార్టీ నుంచి రెబల్ అభ్యర్థులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసిన వారితో మంతనాలు సాగిస్తూ ఉపసంహరణ చేసుకునేందుకు ఒప్పిస్తున్నారు.

చురకలు



# ఎక్కడికక్కడే కీమో సేవలు



హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా స్థానిక జిల్లా ఆసుపత్రుల్లో కీమో థెరపీ అందుబాటులోకి వచ్చింది. డేకేర్ విధానంలో ఈ సేవలు అందిస్తున్నారు. వనస్థలిపురం, కొండాపూర్‌లో ఈ సేవలు ప్రారంభించారు. ప్రతిసారి వ్యయ ప్రయాసలు పడి దూరం నుంచి రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే పరిస్థితి లేకుండా వైద్య ఆరోగ్యశాఖ ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు ప్రతి దవాఖానాలో పది పడకలు కేటాయించారు. ఎంఎన్‌జే ఆసుపత్రికి వచ్చే రోగులకు క్యాన్సర్ లక్షణాలు బయట పడితే తీరునుబట్టి సర్జరీలు, రేడియేషన్ అవసరమైతే ఎంఎన్‌జేలో నిర్వహిస్తారు. డే కేర్ విధానం రోగి ఆరోగ్య పరిస్థితినిబట్టి వైద్యులు నిర్ణయిస్తారు. ముఖ్యంగా తొలి కీమో సైకిల్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి లేదా ఇతర ప్రైవేటులోనే తీసుకోవాలి. ఇక్కడే రోగి వివరాలను నమోదు చేస్తారు. తదుపరి సైకిల్స్‌ను ఎంఎన్‌జే నిపుణుల పర్యవేక్షణలో జిల్లా ఆసుపత్రిలో పొందవచ్చు.

**ఎన్ని అవసరమైనా సరే...**

ఒక్కో రోగి ఆరోగ్య పరిస్థితినిబట్టి ఆరు, ఏడు అంతకంటే ఎక్కువ కీమో సైకిల్స్ అవసరం అవుతాయి. ప్రతిసారీ ఎంఎన్‌జేకు రాలేరు. ఖర్చుతో కూడుకోవడంతో మధ్యలోనే మానేస్తుంటారు. ఇకనుంచి ఈ ఇబ్బందులు తప్పనున్నాయి. సమీపంలోని జిల్లా ఆసుపత్రికి వెళ్లి ఒక్కరోజులోపే ఈ సేవలు పొందొచ్చు. రక్త పరీక్షలు, కీమో, ప్రీ-మెడికేషన్ సేవలన్నీ ఒక్కచోట అందిస్తున్నారు. ఇవి ఉచితం.

**గ్రేటర్‌లో 12 రకాల వ్యాధులపై..**

డా. లలితాదేవి, డీఎంఅండ్‌హెచ్‌వో

గ్రేటర్‌లో జీవనశైలికి సంబంధించి 12 రకాల వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా అధ్యయనం చేస్తోంది. పీహెచ్‌సీలో అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, అధిక బరువు, ఇతర వ్యాధులపై పరీక్షలు చేస్తారు. క్యాన్సర్ బయట పడితే ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు.

# పట్టణాల్లోని పొగ.. పల్లెలపై పొగా..!

నల్గొండ :తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసి పుర ఆదాయ వనరుగా మార్చాల్సి ఉన్నప్పటికీ జిల్లాలో ఏ ఒక్క మున్సిపాలిటీ యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయడం లేదు. నల్గొండలో ఏడాదిన్నర కాలంగా మిర్యాలగూడ, దేవరకొండ పురపాలికల్లో ఐదేళ్లకు పైగా సేంద్రియ ఎరువుల తయారీ నిలిచిపోయింది. కొత్త మున్సిపాలిటీల్లో ఎరువుల తయారీ కేంద్రాలు లేకపోవడంతో వ్యర్థాల కుప్పలు డంపింగ్ యార్డుల్లో కొండలుగా పేరుకుపోతున్నాయి. పట్టణాల్లో చెత్త శుద్ధి కరవైంది. పుర అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం పోగవుతున్న టన్నుల కొద్దీ వ్యర్థాలతో పర్యావరణం కలుషితంగా మారుతుంది.

నల్గొండ నగరపాలక సంస్థ, మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, చిట్యాల, చండూరు, నకిరేకల్‌లో నిత్యం 230 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు, చెత్త ఉత్పత్తి అవుతోంది. వాటిని సేకరించి మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డులకు తరలించి చేతులు దులుపుకొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తడి, పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉంది.

**నిత్యం వ్యర్థాల దహనం..:** నల్గొండ, మిర్యాలగూడ పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పదేళ్లకు పైగా పేరుకుపోయిన వ్యర్థాలు కుళ్లిపోయి రసాయనాలు విడుదల చేయడంతో అవి పొగ మంటలుగా వ్యాపిస్తున్నాయి. సమీప ప్రాంతాల ప్రజలు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నల్గొండ పరిసర గ్రామాలైన చందనపల్లి, కేశరాజుపల్లి ప్రజలు, నల్గొండ నుంచి నకిరేకల్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నల్గొండ కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని అన్ని పురపాలికల్లో బయో మైనింగ్ పద్ధతి ద్వారా వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ప్రణాళిక తయారు చేసినా నేటికీ ఆ ప్రక్రియ పట్టాలెక్కకపోవడంతో పురపాలికల్లో వ్యర్థాల దహనం కొనసాగుతునే ఉంది. పుర, నగరపాలక అధికారులు స్పందించి క్షేత స్థాయిలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేస్తే డంపింగ్‌యార్డుల్లో కొంత మేర వ్యర్థాలను తగ్గించే అవకాశం ఉంటుంది. మరో వైపు బయోమైనింగ్ ప్రక్రియ వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

# హలో.. ప్రాణాలు గాల్లో

మిర్యాలగూడకు చెందిన ఓ యువకుడు గతేడాది చరవాణి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ నియంత్రణ కోల్పోయి కిందపడి డివైడర్‌కు బలంగా తగలడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చరవాణి మన మనసుల్లో చొచ్చుకుపోయి చేతిలో ఇమిడిపోయింది. అన్నం తినేటప్పుడు, టీవీ చూసేటప్పుడు, ఇంట్లో పనులు చేస్తున్నా చరవాణి వైపు చూస్తున్నారు. ఇక కొందరైతే ముఖ్యంగా యువత వాహనాలు నడుపుతున్నప్పుడు సైతం చరవాణిలో మాట్లాడుతూ రీల్స్ చూస్తూ, చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు



ప్రమాదాల్లో అత్యధికం చరవాణి మాట్లాడుతున్నప్పుడు సంభవించినవేనని అధికారులు చెబుతున్నారు.

**యువతే అధికం...**

డ్రైవింగ్‌లో ఫోన్ వాడుతూ ప్రమాదాల బారిన పడుతున్న వారిలో యువతే అధికంగా ఉన్నారు. వాహనం నడుపుతూ చరవాణిలో మాట్లాడటంతో పాటు స్నేహితులతో చాటింగ్ సైతం చేస్తున్నారు. మరి కొందరు డ్రైవింగ్‌లో ఉన్న సమయంలో సైతం రీల్స్ చూస్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు, ఇతర క్రీడా పోటీలు జరిగే సమయాల్లో ఫోన్లలో పోటీలను చూస్తున్నారు. దీంతో ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నారు.

# కార్చిచ్చు.. ఇక ఆపొచ్చు!

పాల్వంచ : వేసవిలో కార్చిచ్చుల నియంత్రణకు అటవీ శాఖ సిద్ధం అవుతోంది. బ్లోయర్స్(మంటలు ఆర్పే యంత్రాలు) కొనుగోలుకు భద్రాద్రి సర్కిల్‌కు రూ.19 లక్షలు మంజూరయ్యాయి. భద్రాద్రి అటవీ సర్కిల్ పరిధిలో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో 6.29 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కిన్నెరసాని అభయారణ్యం, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు తదితర ఏరియాల్లో ఎక్కువగా వేసవిలో కార్చిచ్చులు ఏర్పడతాయి. 2021-25 వరకు సుమారు 1200 పైగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అక్రమంగా బొగ్గు ఉత్పత్తి, బీడీ ఆకుల సేకరణకు మొదెం పనులు



చేపట్టకుండా అడవుల్ని కాల్చడం, లారీ డ్రైవర్లు, స్థానికులు అడవుల్లో భోజనాలు చేసుకొని మంటలు ఆర్పకపోవడం.. పశువుల కాపర్లు దూమపానం చేసి పడేయటం సమస్యకు ప్రధాన కారణాలు.

**ఎక్కడెక్కడ?** భద్రాద్రి సర్కిల్‌లో 14 క్విక్ రెస్పాన్స్ బృందాలున్నాయి. ఒక్కో బృందంలో ఐదుగురు అటవీ సిబ్బంది ఉన్నారు. వీరి వద్ద 86 బ్లోయర్స్ ఉన్నా భారీ ప్రమాదాలు నియంత్రించటం సాధ్యపడట్లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 32 బ్లోయర్ల కొనుగోలుకు నిధులు మంజూరు చేసింది. అభయారణ్యాల్లో(సాంక్చువరీ ప్రొటెక్టడ్ ఏరియా) సివిల్ వర్క్సులో భాగంగా ఈ నిధులు కేటాయించారు. భద్రాద్రి జిల్లాలో 22, ఖమ్మంలో 2, మహబూబాబాద్ 8 బ్లోయర్లు మంజూరు చేశారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోనే 20 పనిచేస్తాయి. డీఎఫ్‌వో కిష్టాగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులు ఖాతాల్లో జమ అయిన వెంటనే బ్లోయర్స్ కొనుగోలు చేసి బృందాలకు అప్పగిస్తామన్నారు.

# చిన్న పరి'శ్రమ'..ప్రగతికి చిరునామా



వికారాబాద్ : జిల్లాలోని స్వయం సంఘాల సభ్యులు కుటీర, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభ్యున్నతి చెందుతున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి అండగా నిలుస్తున్నాయి. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి, వ్యక్తిగత, బృందాలకు రుణాలు మంజూరు చేస్తోంది. ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన అవగాహన పెంపొందిస్తున్నారు.

**రూ.50 వేల నుంచి 5 లక్షల వరకు**

కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు స్వయం సంఘాల సభ్యులకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. యూనిట్ ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. కిరాణా దుకాణాలు, టైలరింగ్, పచ్చళ్ల తయారీ, పిండి, నూనె మిల్లు, బేకరీ తదితర వాటిని ఏర్పాటు చేశారు. జిల్లాలోని 9,777 యూనిట్లలో 75 శాతం గ్రౌండింగ్ చేశారు. మిగిలిన 25 శాతం వచ్చే మార్చిలోగా పూర్తి చేస్తారు. **షీమార్టుల ఏర్పాటు**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో షీమార్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలోని మహిళలకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు మరింతగా తోడ్పాటు అందనుంది. జిల్లాలో 2023-24లోనే ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుకు తగిన ప్రోత్సాహన్ని అందించింది. దీంతో సభ్యులు వాటిని ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నారు.

జిల్లాలో ఇలా

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు: 2023-24

పాత ఎంటర్‌ప్రైజెస్‌లు: 4230

కొత్తగా ఏర్పాటు: 5,547

కిస్తు చెల్లిస్తూ ఆదాయం పొందుతున్నా

మమత, పులుమద్ది

రూ.1.50 లక్షలు రుణం తీసుకుని కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేశా. ప్రతినెలా వాయిదాలు చెల్లిస్తున్నా. రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. గ్రూప్‌లో సభ్యురాలిగా చేరడం వల్లే ఇది సాధ్యమైంది.

మహిళల అభ్యున్నతికి సహకారం

అనంతుల శ్రీనివాస్, డీఆర్‌డీఓ

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మహిళలకు షీమార్టులు ఏర్పాటు చేయాలన్న నిర్ణయించింది. దీనివల్ల వారికి ప్రభుత్వ సహకారం మరింత పెరుగుతుంది. దుకాణాల ఏర్పాటుకు తోడ్పాటు అందుతుంది. మార్టులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందేందుకు చక్కటి మార్గం. ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. దీంతో స్థిరమైన ఆదాయం సమకూరి అభ్యున్నతి సాధించనున్నారు.

# తెరపై వీక్షించు.. నిక్షిప్తం చేసుకో!



కొడంగల్ : పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించింది. మార్చి 14 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకనుగుణంగా ఇప్పటికే పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సాధన చేయిస్తున్నారు. ప్రభుత్వం టీశాట్ ద్వారా నేటి నుంచి ఈనెల 5 వరకు డిజిటల్ పాఠాల ప్రసారానికి శ్రీకారం చుట్టింది. ఇందుకనుగుణంగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) పాఠ్యాంశాల ప్రసారానికి ఏర్పాట్లు చేసింది. దీంతో విద్యార్థులు చూసి వినడం ద్వారా పాఠ్యాంశాలు మదింపు చేసుకోవడంలో ఎంతగానో దోహదపడుతుందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

**ఈనెల 3 నుంచి 5 వరకు ప్రసారం** ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 3 నుంచి 5 వరకు ప్రతి రోజు నాలుగు పాఠ్యాంశాలపై ప్రసార పాఠాలు ఉంటాయి. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పాఠాలను నిపుణులతో నిర్వహిస్తారు. దీంతో విద్యార్థులు పాఠ్యాంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రసార మాధ్యమాన్ని విద్యార్థులకు ఏ మేర అందిస్తున్నారో మండల విద్యాధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. 3న భౌతిక, జీవ శాస్త్రం, ఆంగ్లం, హిందీ, 4న గణితం, తెలుగు, సాంఘిక శాస్త్రం, ఉర్దూ మాధ్యమంలో గణిత, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాలపై పాఠాలు నిర్వహించనున్నారు. **విద్యార్థులకు ఎంతో ప్రయోజనం**

వెంకటస్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్‌డిజిటల్ పాఠాల ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి సన్నద్ధం చేశాం. తెరపై వీక్షించడం ద్వారా వారు అంశాలను మదింపు చేసుకోవడమేగాకుండా మర్చిపోవడానికి వీలు లేకుండా ఉంటుంది. దీంతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ బోధన ఎంతో ఉపయోగం.

# కన్పించని పచ్చదనం.. అందని ఆహ్లాదం

యాదగిరిగుట్ట : పురపాలికల్లో పచ్చదనం పెంచి.. ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు బోసిపోయి కనిపిస్తున్నాయి. భువనగిరి మినహా..మిగిలిన ఐదు కొత్త పురపాలికల్లో పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు. ఖాళీస్థలాల్లో ఉద్యానాల అభివృద్ధిపై నూతన పాలకులు దృష్టిపెట్టాల్సి ఉంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిస్థితిపై కథనం. భువనగిరిలో పార్కుల నిర్వహణ కొంతవరకు ఫర్వాలేదు. చెరువుకట్ట అభివృద్ధికి హెచ్‌ఎండీఏ ద్వారా రూ.8 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలో 11 పార్కులు ఆహ్లాదం పంచుతున్నాయి. మరి కొన్నింటిలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేవు. మున్సిపల్ నిర్వహిస్తున్న ఏడు పార్కుల నిర్వహణ బాధ్యతను స్వయంసహాయక సంఘాలకు అప్పగించారు. నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ.7,500 నెలకు చెల్లిస్తున్నట్లు మున్సిపల్ డీఈ కొండల్‌రావు తెలిపారు. బ్రాహ్మణవాడలో 140 గజాల స్థలంలో పిల్లల కోసం ఆటల పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు యూఐడీఎఫ్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. టీచర్స్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు, అర్బన్‌కాలనీ, స్రిగ్ధా కాలనీలోని నాలుగు పార్కులను హెచ్‌ఎండీఏ నిర్వహిస్తోంది. సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది. పగిడిపల్లి, రాయగిరి, బొమ్మాయిపల్లిలో లేవు. యాదగిరిగుట్టలో ఓపెన్ జిమ్‌తో కలిసి ఉన్న మూడు పార్కులు యాదగిరిపల్లి, బీసీకాలనీ, అంగడిబజార్‌కాలనీలో ఏర్పాటు చేశారు. కోతుల బెడద ఉండటం వల్ల తక్కువ శాతం వినియోగించుకుంటున్నారు. మార్కెట్ యార్డులోని పార్కు వద్ద మాంసం విక్రయాలతో దుర్వాసన ఇబ్బంది కలిగిస్తోంది. ఓపెన్ జిమ్ పరికరాలు పనిచేయడంలేదు. ఆలేరులో 20 వేల జనాభా ఉంది. దశాబ్ద కాలంలో కొత్తగా 12 కాలనీలు ఏర్పాటయ్యాయి. ఎక్కడా పార్కు ఏర్పాటు చేయలేదు. బృందావన్‌కాలనీలో రూ.కోటితో నాలుగు నెలల క్రితం



పార్కు ఏర్పాటుకు పుర అధికారులు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. అనుమతులు వచ్చినా పనులు నేటికీ ప్రారంభించలేదు. భూదాన్ పోచంపల్లి పట్టణంలో ఒక్క పార్కు కూడా లేకపోవడం గమనార్హం. స్థలాలు ఉన్నా మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టడంలేదు. వినోభా మందిరంలో మాత్రం పర్యాటక శాఖకు చెందిన ఉద్యానం ఉన్నా స్థానికులకు అనుమతి లేదు. పొరుగున జలాల్‌పురం గ్రామపంచాయతీ పార్కులో స్థానిక ప్రజలు సేదతీరుతున్నారు. చౌటుప్పల్‌లో పదేళ్ల కిందట మిషన్ భగీరథ పైలాన్ చుట్టూ పార్కు ఏర్పాటు చేయగా నిర్వహణను 2018లో పురపాలికకు అప్పగించారు. విద్యుత్తు వ్యవస్థ పనిచేయక రాత్రి పూట అంధకారంలో ఉంటోంది. 4, 5, 15 వార్డుల్లో ఖాళీ స్థలాలు దొరకక ఏర్పాటు చేయలేదు. పురపాలిక పది శాతం గ్రీన్ బడ్జెట్ కింద నిధులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

# సొమ్మొకరిది.. సోకొకరిది

సూర్యాపేట : ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు మిల్లులపై దాడులు నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలో రూ.19.32 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం దారిమళ్లించినట్లు గుర్తించారు. వాస్తవానికి రూ.వేల కోట్ల విలువైనవి అమ్ముకున్నారనే విమర్శలున్నాయి. ఇంత పెద్దమొత్తంలో మాయం చేసిన మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. నల్గొండ జిల్లాలో 45 వేల టన్నులను వేలం వేయగా చిట్యాలలోని వరలక్ష్మి మిల్లు 5,053.8 టన్నులు, నల్గొండలోని రామ్‌లక్ష్మణ్ 7,811, నల్గొండలోని గౌతమీ ఇండస్ట్రీస్ 15,080 టన్నుల ధాన్యం ఇవ్వాల్సి ఉంది. వీరే కాదు మరికొందరూ ఆ జాబితాలో ఉన్నారు. వడ్లను కేటాయించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో వాటి నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వదిలేయడంతో మిల్లర్లు అమ్మేసుకున్నారు. వీరిపై రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్ట్ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. ధాన్యం మాయం చేసిన మిల్లర్ల విషయంలో పౌరసరఫరాల శాఖ సబ్ కమిటీ చర్యలకు తగు కసరత్తు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారి ఒకరు చెప్పారు. నల్గొండ, సూర్యాపేటలలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం కేటాయించిన వడ్లను కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో దాదాపు తొమ్మిదేళ్ల సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇప్పటికీ సర్కారుకు అందజేయని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 2022-23 యాసంగి సీజన్‌లో భారీ మొత్తంలో ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. పలుమార్లు గడువు



ఇచ్చినా మిల్లర్ల నుంచి స్పందన లేకపోవడంతో చివరకు నోటీసులు జారీ చేశారు. కొందరిపై కేసులూ నమోదు చేశారు.

**ఇదీ పరిస్థితి..** రెండు జిల్లాల్లోని 42 మంది మిల్లర్లు దాదాపు రూ.1,613 కోట్ల విలువైన ఎనిమిది లక్షల టన్నుల వడ్లను మాయం చేశారు. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోని 34 మంది మిల్లర్లు రూ.1,498 కోట్ల విలువ చేసే 7.49 లక్షల టన్నులు, నల్గొండలో రూ.114 కోట్ల విలువైన 57 వేల టన్నుల వడ్లు దారిమళ్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో 2022-23 యాసంగికి సంబంధించిందే సింహభాగమని చెప్పొచ్చు. సూర్యాపేట జిల్లాలో 2,98,172.092 టన్నుల ధాన్యాన్ని వేలం వేయగా అందులో 62,778.890 టన్నుల ధాన్యానికి సంబంధించి కొందరు అందుకు సమానమైన సొమ్ము, మరికొందరు ధాన్యాన్ని సర్దుబాటు చేసినట్లు సమాచారం. ఇంకా 2,35,393.202 టన్నులు బకాయిపడ్డారు. ఇందులో అత్యధికంగా తిరుమలగిరిలోని సంతోష్ రైస్‌మిల్లు 27,121.255 టన్నులు, రఘురాం రైస్ మిల్లు 27,870, గడ్డిపల్లిలోని శ్రీసంతోషిమాత రైస్ మిల్లు 21,442.116 టన్నులున్నాయి. బకాయి పడిన మిల్లర్లకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. 2022-23 యాసంగికి సంబంధించి వేలం వేసిన ధాన్యం అప్పగించని మిల్లర్ల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

మోహన్‌బాబు, పౌరసరఫరాలశాఖ అధికారి, సూర్యాపేట

## ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

హైదరాబాద్ : భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు. అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



**నగరంలో పరిస్థితి ఇదీ...**

నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు – 300(సుమారు)..

ప్రధాన రకాలు–సింగిల్ యూజ్ ప్లాస్టిక్

మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.

మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.

ప్రత్యామ్నాయాలు ఇవీ..

హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)

జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.

కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.

హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.

బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

## 'దారి' దోపిడీ

హైదరాబాద్ : నగరంలోని రహదారులను చూస్తే.. గుంతలు, మిట్టలే దర్శనమిస్తాయి. ఇంజినీర్ల అవినీతి, గుత్తేదారుల నిర్లక్ష్యంతో.. రోడ్ల నిర్మాణం అత్యంత దారుణంగా జరుగుతోంది. ద్విచక్ర వాహనంలో కిలోమీటరు దూరం కూడా సవ్యంగా వెళ్లలేని పరిస్థితులున్నాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి మధ్యనున్న సమన్వయ లోపం కూడా శాపమే.

ఎన్నెన్ని లోపాలో..

రహదారిపై ఏర్పడే 2.5మీటర్ల పొడవు, 1.33మీటర్ల వెడల్పు, 0.3మీటర్ల లోతున్న గుంతను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ రూ.12,500 ఖర్చు చేస్తోంది. వర్షాకాలంలో అలాంటి 30వేల గుంతలను పూడ్చినట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. అంటే.. వానాకాలంలో గుంతలను పూడ్చినందుకే రూ.37.50 కోట్లకుపైగా ఖర్చయినట్లు.

చిన్న కాంట్రాక్టర్లకు రోడ్డు పనులిస్తున్నారు. వారి దగ్గర నైపుణ్యమున్న సిబ్బంది లేకపోవడంతో..ఇష్టానుసారం రోడ్లను నిర్మిస్తున్నారు. పాత రోడ్లను మిల్లింగ్ చేయట్లేదు. రోడ్లపై ఉన్న గుంతలను వదిలేస్తున్నారు. వాలుగా నిర్మాణం జరగట్లేదు.ఇంజినీర్లు పర్యవేక్షించడం లేదు. దీంతో ప్రజాధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



జీహెచ్‌ఎంసీకి రెండు తారు మిశ్రమం తయారీ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి నలుమూలలకు తారు మిశ్రమాన్ని తరలిస్తుండటంతో.. వేడి చల్లబడి నాణ్యత ఉండట్లేదు.

గతేడాదిలో రూ.600 కోట్ల విలువైన పనులు సీసీ రోడ్లకు చెందినవే. ఒకసారి రోడ్డు వేస్తే.. 40ఏళ్లు నిలవాలి. నగరంలో ఐదు, పదేళ్లకోసారి సీసీ రోడ్లను తిరిగి నిర్మిస్తున్నారంటే.. నాణ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.ఏటా రోడ్ల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ చేస్తోన్న వ్యయం: రూ.1,000 కోట్లు

**నగరంలో తిరిగే వాహనాల సంఖ్య: 60 లక్షలు**

గుంతలతో దెబ్బతినే వాహనాల మరమ్మతుల ఖర్చు: రూ.50 కోట్లు

ట్రాఫిక్ సమస్యతో జరిగే ఇంధన వృథ: రూ.100 కోట్లు

గుంతలతో అనారోగ్యం.. చికిత్స కోసం ప్రజలు చేసే ఖర్చు: రూ.50 కోట్లుపనులు పకడ్బందీగా జరిగితేనే..

ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, జేఎన్‌టీయూ నగర రహదారులపై రాకపోకలు ఎక్కువ. వాటిని తట్టుకుని నిలవాలంటే నాణ్యతకు పెద్దపీట వేయాలి. నాసిరకం సామగ్రితో కట్టే మ్యాన్‌హోళ్లు కారు బరువును కూడా తట్టుకోలేవు. నీరు నిలవకుండా.. రోడ్ల నిర్మాణం జరగాలి. అప్పుడే నగరంలో రహదారులు మెరుగుపడతాయి.

## నర్సా'పుర' రాజకీయం.. రసవత్తరం




నర్సాపూర్: పురపాలిక ఎన్నికలు సమీపిస్తుండగా నర్సాపూర్‌లో రాజకీయం వేడెక్కుతోంది. మున్సిపాలిటీగా ఆవిర్భవించాక జరుగుతున్న రెండో ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించగా, తుది జాబితా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ క్రమంలో ఆశావహులు టిక్కెట్లను పొందేందుకు పావులు కదుపుతున్నారు. మొదటి సారిగా జరిగిన ఎన్నికల్లో భారాస జెండాను ఎగురవేసింది. ఈ సారి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా హస్తగతం చేసుకోవాలని ఉవిళ్లూరుతోంది. భాజపా సైతం పట్టు సాధించడానికి ప్రయత్నాలు సాగిస్తోంది.

**కలిసి సాగేనా..**

మొన్నటివరకు అధికార కాంగ్రెస్‌లో నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంలా సాగారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజిరెడ్డి ముందస్తుగా నమస్తే నర్సాపూర్ పేరిట కార్యక్రమం చేపట్టగా, సొంతపార్టీ నేతలు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి కలిసి కార్యక్రమాలు చేపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆరోగ్యం సహకరించడం లేదు. శుక్రవారం వీరంతా కలిసి సమావేశం నిర్వహించడం కొంత ఊరటనిచ్చేదే.

**ఎమ్మెల్యేకు ప్రతిష్ఠాత్మకం..**

ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గంలోని ఏకైక పురపాలిక కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తొలి ఎన్నికల్లో భారాస పీఠాన్ని దక్కించుకుంది. తొలిసారి ఛైర్మన్‌గా ఎన్నికైన మురళీయాదవ్ పార్టీని వీడి భాజపాలో చేరారు. ఆయన్ని గద్దె దించడానికి పావులు కదపగా ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత వైస్‌ఛైర్మన్ నయిమొద్దీన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత అవిశ్వాసం పెట్టగా భారాసకు చెందిన 1వ వార్డు కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**భాజపా పట్టుకోసం..**

గత ఎన్నికల్లో 4 వార్డుల్లో భాజపా కౌన్సిలర్లు గెలుపొందారు. వీరిలో ఒకరు భారాసలో చేరగా, భారాస నుంచి మరో ముగ్గురు పార్టీలో వచ్చి చేరారు. ఈ సారి మున్సిపల్ మాజీ ఛైర్మన్, భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మురళీయాదవ్ కాషాయ జెండాను ఎగురవేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వార్డుల వారీగా పర్యటిస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం ప్రత్యేకంగా దృష్టి సారించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పట్టు నిలుపుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పురపాలిక: నర్సాపూర్

ఓటర్లు: 17.066

వార్డులు: 15

పురుషులు: 8328

మహిళలు: 8737

ఇతరులు: 01

## చెక్కులు రాసుకున్నారు.. బిల్లులు వెనకేసుకున్నారు..!



వైరా : వైరా పురపాలికలో జరిగిన చెక్కుల దందాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇష్టారాజ్యంగా మున్సిపాలిటీ సొత్తును కాజేసిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. గతేడాది ఆగస్టు మూడోవారం వరకు వైరా పుర కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన చింతా వేణు, ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేసిన ఎ.వెంకటేశ్వరరావు (ఇప్పటికే సస్పెండయ్యారు)పై తక్షణమే క్రిమినల్ కేసు పెట్టాలంటూ పురపాలిక వరంగల్ ప్రాంతీయాధికారి(ఆర్‌డీఎంఏ) సాహిద్ మసూద్ ప్రస్తుత పుర కమిషనర్ గురులింగానికి లిఖితపూర్వక ఆదేశాలు వెలువరించారు. చింతా వేణు ప్రస్తుతం నల్గొండ జిల్లా నందికొండ పుర కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

**సొంత ఖాతాకు రూ.52 లక్షలు బదిలీ**

'వీడాలి చెక్కుముడి' శీర్షికన గతేడాది అక్టోబర్ 8న కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు అక్టోబర్ రెండో వారంలో విచారణ నిర్వహించి అవినీతి జరిగిందని నిర్ధారించారు. ఇన్‌ఛార్జి అకౌంటెంట్(ఒరిజినల్ పోస్టింగ్ జూనియర్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న ఎ.వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట 28 చెక్కులు రాసుకొని రూ.52, 29,657 సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నట్లు గుర్తించి అదే నెల 17న సస్పెన్షన్ వేటు వేశారు.

**నాటి కమిషనర్ ఎందుకు అడ్డుకోలేదు..?**

ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి ఏకంగా తన పేరిట 28 చెక్కులు రాసుకొని రూ.52లక్షలకు పైగా సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నా నాటి కమిషనర్ చింతా వేణు ఎందుకు అడ్డుకోలేదనే అంశాన్ని ఉన్నతాధికారులు పసిగట్టారు. కార్యాలయం నుంచి ఏదేని చెక్కు మంజూరు చేస్తే దానిని ఎవరి పేరిట ఎందుకు ఇస్తున్నారు..? చెక్కు విలువ, వివరాలు, సంబంధిత బిల్లులు, ఓచర్లు తదితరాలు ఉంటేనే కమిషనర్ ఆయా సమాచారాలను క్యాష్‌బుక్‌లో నమోదుచేయించి చెక్కుపై సంతకం పెట్టాలి. బిల్లులు, ఆధారాలు లేకున్నా, ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్ నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట చెక్కులు రాసుకున్నా కమిషనర్ అభ్యంతరం పెట్టకపోవటాన్ని అధికారులు విస్పష్టంగా తప్పుబట్టారు. ఆర్థిక ఉల్లంఘనలకు కమిషనర్ వేణు సైతం బాధ్యుడని తేల్చారు. కమిషనర్, ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగి ఎ.వెంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చింతా వేణుపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు సమాచారం. క్రిమినల్ కేసు అనంతరం సొత్తును రికవరీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## నిదరోతున్న.. 'నియంత్రణ' మండలి

జిన్నారం: ప్రజా సమస్యల పరిష్కారానికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా వాయు, జల కాలుష్యంపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబరు 10741, హెల్ప్‌లైన్ నంబరు 91773 03214 అందుబాటులో ఉంచారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ నంబర్ల ద్వారా తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కానరావడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో టోల్‌ఫ్రీ నంబరు చాలా వరకు పని చేయడంలేదని వాపోతున్నారు.

**కింది స్థాయి సిబ్బందితోనే..**

పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో రాత్రి వేళల్లో వాయు కాలుష్యం అధికంగా ఉంటోంది. దీంతో స్థానికులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేస్తారు. వెంటనే అక్కడి వారు క్షేత్రస్థాయిలో ఉంటే టాస్క్‌ఫోర్స్, పెట్రోలింగ్ టీమ్‌కు సమాచారం ఇవ్వాలి. రాత్రి వేళల్లో సంచరించే సిబ్బంది కాలుష్య కారక పరిశ్రమను గుర్తించినా, లోపలికి వెళ్లి నిర్ధారించే అవకాశం లేదు. కేవలం బయట ఉండే వీవోసీ యంత్రంపై రీడింగ్ రాసుకుని వెళ్లాలి. దానిని పీసీబీ ప్రాంతీయ, రాష్ట్ర కార్యాలయంలో సమర్పించినా ఎటువంటి చర్యలు కానరావడంలేదు. గతంలో అధికారి స్థాయి వారు రాత్రి వేళల్లో పర్యటించే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఫిర్యాదు చేసిన వారికి తాము క్షేత్ర స్థాయికి వచ్చామనే సమాచారం కూడా ఇవ్వడంలేదు. తీవ్రమైన సమస్య ఉంటే ఫిర్యాదును కొందరు అధికారులు ముందే సంబంధిత పరిశ్రమలకు చేవేస్తారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

**నెలలో వెయ్యికి పైగా**

కాలుష్య సమస్యలపై నెలలో వెయ్యికి పైగా ఫిర్యాదులు అందుతాయి. ఇందులో టోల్‌ఫ్రీ నంబరుతోపాటు అధికారులకు ఫోన్ ద్వారా వివరిస్తారు. ఇదే సమయంలో పారిశ్రామిక వాడలకు సమీపంలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల నుంచి మెయిల్ ద్వారా వస్తాయి. ఇదే సమయంలో లిఖిత పూర్వకంగా కూడా అందుతాయి. కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో వచ్చే వాటిని పీసీబీకి పంపుతారు. ఇన్ని రకాలుగా వచ్చినా చర్యలు మాత్రం తీసుకోరు. పారిశ్రామిక వాడల వారీగా అధికారులను నియమిస్తే ప్రయోజనం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఖాతాల్లో నిధులు.. కదలని పనులు

హైదరాబాద్ : కోట్ల రూపాయల నిధులు ఖాతాల్లో మూలుగుతున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కీలకమైన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.303 కోట్లు ఎస్క్రో ఖాతాలో సుమారు రెండు నెలలుగా ఉన్నా వినియోగంలో జాప్యం కొనసాగుతోంది. పర్యవసానంగా కంటోన్మెంట్ పరిధిలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణ, హస్మత్‌పేట నాలా, పికెట్‌నాలాల అభివృద్ధి జాడలేదు.

**శాఖల మధ్య లోపించిన సమన్వయం**


ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రక్షణ శాఖకు చెందిన 24 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దీనికి పరిహారంగా రక్షణ శాఖకు ఇచ్చిన రూ.303.62 కోట్లను కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించారు. వాటిని అక్టోబరులో



బోర్డు, జీహెచ్‌ఎంసీ ఎస్క్రో ఖాతాలో జమచేశారు. మూడు నెలలు కావస్తున్నా పనులకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదు. సుదీర్ఘకాలంగా ఈ పనుల కోసం కంటోన్మెంట్ ప్రజలు ఎదురుచూస్తున్నా అంతకంతకూ జాప్యం జరుగుతోంది. దశాబ్దాల నాటి పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పాటు వరద ముప్పును తప్పించేలా హస్మత్‌పేట్, పికెట్ ప్రధాన నాలాలను విస్తరించి రక్షణ గోడలను నిర్మించడం వంటి కీలకమైన పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి చేపట్టాల్సి ఉంది. శాఖల మధ్య సమన్వయ లోపంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల ప్రకియ చేపట్టి పనులు ప్రారంభించే నాటికి వర్షాకాలం వస్తుందని వెంటనే పనులు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు జీహెచ్‌ఎంసీకి వివరిస్తున్నా ఫలితం లేదు.

## యువత.. ఆర్థిక అక్షరాస్యత

హైదరాబాద్: దైనందిన జీవితంలో భాగమైన వస్తువులు, సేవలు, అనూహ్యంగా దూసుకువెళ్తున్న బంగారం, వెండి ధరలను తెలుసుకోవడంతో పాటు అవి ఎందుకు పెరుగుతున్నాయి? మార్కెట్‌లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయ్? అన్న అంశాలపై ఓయూ వాణిజ్య విభాగం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. స్టాక్‌మార్కెట్‌లో అంశాలను వారికి పరిచయం చేస్తున్నారు. ఇందుకోసం సెబీ గుర్తింపున్న సంస్థల నుంచి ప్రతినిధులను ఎంపిక చేసి వారికి ఆర్థిక అక్షరాస్యతను నేర్పిస్తున్నారు.పొదుపు.. వ్యూహాత్మక పెట్టుబడులపై.. బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయడం, బీమా పాలసీలు తీసుకోవడం వంటివి సాధారణ పొదుపు విభాగంలోకి వస్తుండగా... స్టాక్ మార్కెట్‌లో




పెట్టుబడులు వ్యూహాత్మకమైనవని స్టాక్ మార్కెట్ నిపుణులు ఓయూ విద్యార్థులకు వివరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం స్టాక్ మార్కెట్ నిపుణులు డాక్టర్ సారికా లోహానా హైదరాబాద్‌కు వచ్చి పెట్టుబడుల తీరును వివరించారు. ఎలాంటి షేర్లు పెరుగుతున్నాయి? ఎందుకు అవే షేర్లు లాభాల్లో ఉంటున్నాయి? పెరుగుదల, తగ్గుదలతో ఏయే కారణాలు ప్రభావం చూపిస్తున్నాయన్న అంశాలను ఆమె విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. వస్తువులు (కమోడిటీస్), బంగారం, వెండి (బులియన్) మార్కెట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుకోకుండా అవసరాలు వస్తే ఇబ్బందులు పడకుండా షేర్లు, పొదుపు సొమ్ముతో వాటిని తీర్చుకునేలా ప్రణాళికలు ఉండాలని సోదాహరణంగా తెలియజెప్పారు.

## వంటనూనెల మంట

పెద్దపల్లి: ఏడాదిగా పెద్దగా పెరగని వంట నూనె ధరలు రెండు వారాల్లోనే ఒక్కసారిగా పెరిగాయి. సీజన్ కావడం.. పిండి వంటలు పెద్దఎత్తున చేసుకోవడం ఆనవాయితీ కావడం కారణమా.. మరైదేనా పరిస్థితులా తెలియదు కానీ.. గడిచిన పదిహేను రోజుల్లో లీటర్ పొద్దు తిరుగుడు నూనె ధర రూ.5 వరకు పెరిగింది. దసరా (అక్టోబరు నెల) పండగ రేట్లతో పోలిస్తే లీటర్‌కు రూ.10 చొప్పున పెరిగింది. మూడు నెలల్లోనే ఇంత మొత్తంలో పెరగడంపై అనుమానాలున్నాయి. ఒకేసారి ఇలా ధరలు పెరగడానికి వ్యాపారులు సరకు బ్లాక్ చేసి ధరలు పెంచడమూ కారణమన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**ఉమ్మడి జిల్లా ప్రజలపై రూ.కోటి భారం**

ఉమ్మడి జిల్లాలో ప్రజలు, ఇతర వాణిజ్య అవసరాల(హోటళ్లు, రెస్టారెంట్లు) కోసం ప్రతినెలా 3400 మెట్రిక్ టన్నుల వంటనూనెలు వినియోగిస్తారు. వీటిలో సింహభాగం పొద్దు తిరుగుడు నూనె 2040 మెట్రిక్ టన్నులు, పామాయిల్ 840 మెట్రిక్ టన్నులు, ఇతర నూనెలు 520 మెట్రిక్ టన్నులు ప్రజలు వాడుతున్నారు. ఈ నెల మొదటి వారం ముగిసేసరికి గృహావసరాల కోసం ఒక నెలకు సరిపడా నూనెలను ప్రజలు కొనుగోలు చేశారు. ఈ విధంగా జిల్లా ప్రజలపై అదనంగా రూ.కోటి భారం పడింది. జిల్లాలో ప్రతినెలా రూ.30.60 కోట్ల విలువైన పొద్దుతిరుగుడు నూనె వినియోగమవుతుండగా.. ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం రూ.31.62 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. **లీటరు రూ.10 వరకు..** దేశీయ అవసరాలకు పొద్దుతిరుగుడు నూనెను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా.. అంతర్జాతీయ మార్కెట్ ఎగుడు దిగుడులకు అనుగుణంగా కొన్ని రోజులుగా ఈ నూనెల ధరల్లో మార్పులు లేవనే చెప్పాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరంభంతో పోలిస్తే లీటరు ధర రూ.10 వరకు పెరిగింది. అయితే దేశీయ నూనెలైన వేరుశనగ, రైస్‌బ్రాన్(తవుడు), సోయాబీన్ నూనెల ధరల్లో పెద్దగా మార్పులేమి లేవు. సాధారణంగా పొద్దు తిరుగుడు, ఇతర నూనెల కంటే వేరుశనగ నూనె ఎక్కువ ధర పలుకుతుంది. కానీ ఈ ఏడాది వేరుశనగ.. సీజన్ ఆరంభం నుంచి ఇతరవాటికంటే తక్కువ ధర ఉంటుంది.

చురకలు

శుక్రవారం 6 ఫిబ్రవరి 2026

# కళ్లారా చూశారు.. కట్టడి వదిలేశారు!

అనకాపల్లి : జిల్లాలోని ల్లాలోని అనధికారిక చేపల చెరువులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వడమే కాదు.. అందులో పెంచుతున్న చేపలకు కుళ్లిన మాంసం, కోళ్ల వ్యర్థాలను ఆహారంగా వేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల నుంచి వాహనాల్లోతెచ్చి వీటిని వేస్తున్నారు. ఈ దందా దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో వెలుగులోకి వచ్చినా మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు హెచ్చరికలకే పరిమితం అయ్యారు.

దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో 230 వరకు చేపల చెరువులు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా చెరువులకు ఎలాంటి అనుమతులు లేవు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దేవరాపల్లి మండలంలోని చేపల చెరువుల్లో పంకజం రకం చేపలు పెంచుతున్నారు. ఇవి కళేబరాలు, కోళ్ల వ్యర్థాలను తింటాయి. దీంతో విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల నుంచి కోళ్ల వ్యర్థాలను వారాంతాల్లో భారీగా సేకరించి చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. ఈ వ్యర్థాల సేకరణకు రెండు జిల్లాలో పెద్ద సిండికేటే ఉంది. విశాఖలో టన్ను రూ. 8 వేల చొప్పున, అనకాపల్లిలో రూ. 5 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

దేవరాపల్లిలో కొన్నాళ్ల కిత్రం మత్స్యశాఖ ఏడీ స్వయంగా చెరువులను



పరిశీలించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న వాటికి నోటీసులు దగ్గరుండి ఇప్పించారు. కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి స్పందనా లేదు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూడా అనధికారిక చేపల చెరువులు, వాటికి ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేస్తే అటువంటి చెరువులను సీజ్ చేయాలంటూ స్థానిక అధికారులకు ఆదేశించారు. వీటికి విద్యుత్తు కనెక్షన్లను సైతం రద్దు చేయాలని చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్కటంటే ఒక్కసారీ అధికారులు కొరడా ఝుళిపించిన దాఖలా లేదు.

దేవరాపల్లి మండలం ముషిడిపల్లి చెరువులో చేపలు పెంచడం నిషేధం. కానీ స్థానిక నేతల అండదండలతో వేలం వేసి చెరువులో చేపలు పెంచుతున్నారు. పెదనందిపల్లి చెరువుపై గతంలో ఓ నేత ఫిర్యాదు చేసినా.. అధికారులు కనీసం పట్టించుకోలేదు. కూటమి నేతల అక్రమాలు చూసి వైకాపా నేతలు సైతం చెలరేగిపోతున్నారు.

కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తే చర్యలు: జిల్లాలో చేపల చెరువులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. సాధారణ రకపు చేపలే పెంచుతున్నారు. కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు మాదృష్టికి రాలేదు. క్షేత్రస్థాయి సిబ్బందితో నిఘా పెట్టాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజయ, ఏడీ, మత్స్యశాఖ, అనకాపల్లి

# ఖనిజంతో కలిసొచ్చేదెంత?


అల్లవరం: కోనసీమ అనగానే ఇప్పటి వరకు ఆక్వా హబ్‌గా.. కొబ్బరి, అరటి వంటి ఉద్యాన పంటల నిలయంగా గుర్తింపు పొందింది. వరి దిగుబడుల్లోనూ ప్రత్యేకత చాటుతోంది. తాజాగా తీరంలో కొత్త అవకాశాలు రానున్నాయి. ఇక్కడ లభించే ప్రత్యేక, అరుదైన ఖనిజాలను వెలికితీసేందుకు తాజా కేంద్ర బడ్జెట్‌లో బాటలు వేయడం చర్చనీయాంశమైంది.

**ప్రత్యేక కారిడార్..**

ఒడిశా, ఏపీ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను కలుపుతూ అరుదైన ఖనిజాల తవ్వకాలకు కేంద్రం ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో బీచ్ సాండ్ మైనింగ్ ప్రక్రియతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో లభించే బాక్సైట్, గ్రాఫైట్, సిలికా వంటి ఖనిజాలను వెలికితీస్తారు.

**అవకాశం అందిపుచ్చుకుంటే..**

అరుదైన ఖనిజ నిక్షేపాల తవ్వకాలకు ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేసి, వాటి శుద్ధి, ఇతర అంశాలకు ప్రోత్సాహం అందిస్తామని తాజా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాలోని సముద్ర తీరం వెంబడి అనేక విలువైన ఖనిజ నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. వీటి వెలికితీత, శుద్ధి సంబంధిత పరిశ్రమలు సాధించగలితే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.



జిల్లాలో తీరం పొడవు: 93 కిలోమీటర్లు
తీర మండలాలు: 8
ఇప్పటి వరకు ఖనిజాల వెలికితీత: లేదు

**పరిశ్రమలు వస్తేనే..**

జిల్లాల పునర్విభజన అనంతరం కోనసీమ వ్యవసాయం, ఆక్వా రంగాలపైనే ఆధారపడి ఉంది. దీంతో తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది. జిల్లా పారిశ్రామికంగానూ అభివృద్ధి సాధిస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు చెబుతున్నారు.

**ఈ రకాలు లభ్యం**

రాష్ట్రంలోని సముద్ర తీరంలో ప్రధానంగా ఇలిమినైట్, రూటైల్, జిర్కాన్, మోనజైట్, సిలిమనైట్, గార్నెట్ బీచ్ శాండ్ ఆఫ్‌షోర్ ఇన్వెస్టిగేషన్(బీఎస్‌వోఐ) పరిశోధనల్లో తేలింది. జిల్లాలోని అల్లవరం, ఎస్.యానాం, అంతర్వేది, మలికిపురం, కాట్రేనికోన సముద్ర తీరం వెంబడి వీటిలో చాలా ఖనిజాలు ఉన్నాయి.

**పారిశ్రామికంగా అభివృద్ధి**

రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటుతో తీర ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందనున్నాయి. జిల్లాలో లభించే ఖనిజాలపై పరిశోధనలు జరిగితే వాటి ఫలితాల ఆధారంగా పరిశ్రమల స్థాపన జరిగే అవకాశం ఉంటుంది. ముడి ఖనిజాన్ని వేరుచేసి తరలించే ప్రక్రియలో కాలుష్యం ఉండదు. వంశీధర్ రెడ్డి, భూగర్భ, గనులు, మైనింగ్ శాఖ అధికారి

# వెలికితీస్తే గలగలే



తిరుపతి: జిల్లాలో అపార ఖనిజ సంపద ఉంది. గ్రానైట్, గ్రావెల్‌తోపాటు ఇనుము, బంగారం వంటి నిక్షేపాలూ అధికంగానే ఉన్నాయి. ఇటీవల కుప్పం ప్రాంతంలోని బిసానత్తం– చిగురుకుంట ప్రాంతాల్లో ముడి బంగారపు నిల్వలను వెలికి తీసేందుకు కసరత్తు జరుగుతోంది. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్‌ఈఈ) సైతం మన ప్రాంతంలో ఉన్నాయని పరిశోధనలో తేలింది. ఆర్‌ఈఈల ఉత్పత్తిలో ప్రస్తుతం చైనా అగ్రస్థానంలో ఉండటం.. అక్కడి నుంచి మనం చేసుకుంటున్న దిగుమతులతో ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో రేర్ ఎర్త్ కారిడార్‌ను ప్రకటించారు. ఈ జాబితాలో మన రాష్ట్రం కూడా ఉన్నందున.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అరుదైన ఖనిజాల తవ్వకాలకు మార్గం సుగమం కానుంది.

**అరుదైన ఖనిజాలు అదనపు బలం**

ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 1,100 గ్రానైట్ క్వారీలున్నాయి. మరో 500 పాలిషింగ్ యూనిట్లున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి దాదాపు 1.50 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆర్‌ఈఈలు ఉండి తవ్వకాలు ప్రారంభిస్తే మరింత మందికి లబ్ధి జరుగుతుంది. ఇప్పటికే ఐదు మండలాల్లోని 46,792 ఎకరాల్లో అటవీ భూమి ఎంత? ప్రభుత్వ, పట్టా భూములు ఎంత? అనే వివరాలు సేకరించారు. ప్రాథమికంగా 209 చ.కిమీ పరిధిలో ఆర్‌ఈఈల కోసం కోల్ ఇండియా సంస్థ అన్వేషించనుంది.

**కోల్ ఇండియాతో ఒప్పందం**

జిల్లాలో సైనైట్ రాక్ గనులు అధికంగా ఉండటంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆర్‌ఈఈల కోసం అన్వేషణ ప్రారంభించారు. ఒంటిమిట్ట–చంద్రగిరి మధ్య ఉన్న బ్లాక్‌లో మూలకాలు ఉన్నట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వాస్తవంగా అక్కడ నిక్షేపాలు ఉన్నాయా? లేదా? అని వెతికే కాంట్రాక్టు ఇప్పటికే కోల్ ఇండియా సంస్థకు దక్కింది.

చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, పెనుమూరు, పూతలపట్టు మండలాల్లో అల్లనైట్, సెరియేట్, థోరట్, కొలంబైట్, ట్యాంబలైట్, ఫ్లోరైట్, మోనజైట్ వంటి ఆర్‌ఈఈలు ఉంటాయని భావిస్తున్నారు. ఇందులో అల్లనైట్ అణు ఇంధన, పారిశ్రామిక అవసరాల్లో వినియోగిస్తారు. థోరట్.. అధిక– ఉష్ణోగ్రత గల సిరామిక్స్, ప్రత్యేకమైన లోహ మిశ్రమాల తయారీలో ఉపయోగిస్తారు.

జిల్లాలో లభించే ఖనిజాలకు అదనపు విలువ జోడించి ఎగుమతులు చేసేలా వ్యాపారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో విస్తారంగా లభించే గ్రానైట్‌ను దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు చైనాకూ పంపిస్తున్నారు. ప్రస్తుత నిర్మాణ అవసరాలకు అనుగుణంగా అక్కడి వ్యాపారులు గ్రానైట్‌తో ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. దాంతో జిల్లాకు పెద్దగా లబ్ధి జరగడంలేదు. ఈ అంశంపై దృష్టి సారించాలని ఇప్పటికే గనుల శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# మహిళా వర్సిటీలో క్వాంటం టెక్నాలజీ కోర్సులు




తిరుపతి : రాష్ట్రాన్ని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. దీనికి మానవ వనరులను అందించేందుకు క్వాంటం టెక్నాలజీకి సంబంధించిన కోర్సులను మహిళా వర్సిటీలో ప్రవేశపెట్టారు. ఇంజినీరింగ్ కళాశాలలో క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెన్సింగ్ వంటి రంగాలపై విద్యార్థినులు ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు.

**ఆప్షనల్ సబ్జెక్టులు..**

విద్యార్థినులు చదువుతున్న శాఖలతోపాటు సర్వే ఆఫ్ క్వాంటం టెక్నాలజీస్ అండ్ అప్లికేషన్స్, ఫౌండేషన్స్ ఆఫ్ క్వాంటం టెక్నాలజీస్ సబ్జెక్టులను తప్పనిసరిగా చదవాలి. వీటితోపాటు బేసిక్ ప్రోగ్రామింగ్, బేసిక్ ఆఫ్ క్వాంటం టెక్నాలజీస్‌లో ఏదైనా ఒక సబ్జెక్టు తీసుకోవాలి. ఇంట్రోడక్షన్ టు క్వాంటం కంప్యూటేషన్, ఇంట్రడక్షన్ టు క్వాంటం కమ్యూనికేషన్ సబ్జెక్టుల్లో ఏదో ఒకటి తప్పనిసరి.

ఇంజినీరింగ్ ఫౌండేషన్ ఆఫ్ క్వాంటం టెక్నాలజీస్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ఫర్ క్వాంటం టెక్నాలజీస్, క్వాంటం ఆప్టిక్స్ సబ్జెక్టులను ఆప్షనల్‌గా ఇచ్చారు. కోర్సులోని సబ్జెక్టులు కాకుండా అదనంగా 5 క్వాంటం సబ్జెక్టులను విద్యార్థినులు తప్పనిసరి.

**మైనర్, మేజర్ డిగ్రీలు**

సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థినులు క్వాంటం టెక్నాలజీ సబ్జెక్టులను చదివితే వారికి బీటెక్ డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు మైనర్, మేజర్ డిగ్రీ సర్టిఫికెట్లు అందిస్తారు. మొదటిసారిగా మహిళా వర్సిటీలోనే ఈ విధానాన్ని ప్రారంభించారు.

**విస్తృత అవకాశాలు**

క్వాంటం టెక్నాలజీతో క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థలు, యూనివర్సిటీలతో కలిసి పరిశోధనలు చేసే అవకాశాలు కూడా లభిస్తాయని వర్సిటీ వీసీ వి.ఉమ, ఇంజినీరింగ్ కళాశాల సంచాలకులు మల్లికార్జున తెలిపారు.

**ఏఐసీటీఈకి ప్రతిపాదనలు**

వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న వాటితోపాటు 2026–27 విద్యా సంవత్సరంలో కొత్తగా బీటెక్ ఏఐ అండ్ డీఎస్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్) కోర్సును ప్రారంభించనున్నారు. ఈ కోర్సులో 60సీట్లు ఉంటాయి. ఈ కోర్సు ప్రారంభానికి అనుమతి కోరుతూ అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి వర్సిటీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు.

# గాలిలో ధూళిలా.. జనంపై భూతంలా!!



విశాఖపట్నం: విశాఖ నగరాన్ని కమ్మేస్తున్న కాలుష్య కారకాల్లో జిప్సం కూడా ఒకటి. ఎరువుల తయారీ పరిశ్రమలో జిప్సం ఉప ఉత్పత్తిగా వస్తుంది. విశాఖలోని కోరమండల్ ఫెర్టిలైజర్స్ (ఎరువులు) కంపెనీ... జిప్సంను యార్డులో నిల్వ చేసుకోవాలి. కానీ, బహిరంగంగా నిల్వ చేశారు. జిప్సం ఎగుమతులు మందగించి గడిచిన ఏడాదిగా నిల్వలు పేరుకుపోయాయని సమాచారం. వీటిని తనిఖీ చేసిన అధికారులు రూ.3.25 కోట్ల మేర జరిమానా విధించినా ఇంకా నిర్వహణలో మార్పు రాలేదు. ఫలితంగా విశాఖ నగర ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందోనని ఎదురుచూస్తున్నారు. **ప్రజారోగ్యంపై ప్రభావం:** జిప్సం నిల్వలు నుంచి ఎగసిపడే సూక్ష్మ ధూళి కణాల వ్యాప్తితో గాలి నాణ్యత దెబ్బతింటోంది. జిప్సం తడిచెత్తతో కలిస్తే రసాయన చర్య జరిగి హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) అనే విషవాయువు విడుదలవుతుంది. వర్షాలు పడినప్పుడు జిప్సం నుంచి సల్ఫేట్లు భూమిలోకి ఇంకి నీటి కాలుష్యానికి కారణమవుతాయి. ఎగుమతులకు అనుకూలంగా ఉండేలా డాక్ యార్డు గేటు ఎదురుగా రైల్వే ట్రాక్ సమీపంలో నిల్వలు బహిరంగంగా పెట్టడంతో డాక్‌యార్డు బ్రిడ్జి నుంచి మారుతి సర్కిల్‌కు వెళ్లే రహదారిని కాలుష్యం కమ్మేస్తుంది.

ఈ నిల్వలపై ఫిర్యాదులు వెళ్లకుండా, ఒకవేళ వెళ్లినా చర్యల్లేకుండా కొందరు ప్రజాప్రతినిధులే అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**ఇలా ఉంచితే..:** జిప్సంలో సూక్ష్మ ధూళి కణాలుంటాయి. బహిరంగ ప్రదేశాల్లో నిల్వలు ఉంచడం వల్ల వాటి ప్రభావం జనంపై పడుతుంది. ఊపిరితిత్తుల సమస్యలు, చర్మవ్యాధులు, కళ్లపై ప్రభావం తప్పదు. ఇందులో ఉండే కొన్ని కారకాల వల్ల దీర్ఘకాలంలో లంగ్ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

– బసవయ్య, ఏయూ కెమిస్ట్రీ ఆచార్యులు

జిప్సం కాలుష్యంపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ నియంత్రణ సూచనలు చేస్తూ వస్తున్నాం. 'టెరీ' అనే ప్రాజెక్టులో భాగంగా జిప్సంపై గతంలో మొక్కలు సైతం పెట్టారు. ఇటీవల నిల్వలు పేరుకుపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ సమస్య అధిగమించడానికి జిప్సం డ్రై చేసి బోర్డుల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అలాగే... కొన్ని ప్రాజెక్టుల్లో వినియోగానికి అనుమతి కోరగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. – పీవీ ముకుందరావు, పీసీబీ ఈఈ

విశాఖలో కాలుష్యానికి కారణమైన పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులపై, చర్యలు తీసుకోకుండా ఒత్తిడి తెచ్చే రాజకీయ నాయకులపైనా చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులకు ఉత్తర్వులివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ రాశాను.– ఈఏఎస్ శర్మ, విశ్రాంత ఐఏఎస్ అధికారి

# నిబంధనలకు బంక్ కొడుతున్నారు

గరివిడి: జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారుల నుంచి డబ్బులు తీసుకుని పెట్రోల్, డీజిల్ పోస్తున్నారే తప్ప వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి పెట్టడంలేదు. వినియోగదారుల నుంచి వివిధ రకాల పన్నులు వసూలు చేస్తున్నా.. నిబంధనలు పాటించడం లేదు. కనీస వసతులైన గాలి మిషన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలి. వీటి విషయం పట్టించుకోవడం లేదు. జిల్లాలోని సుమారు 117 బంకుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి.

**అలంకార ప్రాయంగా యంత్రాలు**

ప్రతి బంకులో వాహనాలకు గాలి నింపే యంత్రాలు పెట్టి, కోరిన ప్రతి వినియోగదారుడి వాహనానికి ఉచితంగా నింపాలి. జిల్లా కేంద్రంలో కొన్ని బంకుల్లో తప్ప మిగతాచోట్ల ఇవి అలంకారప్రాయంగానే ఉన్నాయి. నిర్వహణకు ఖర్చవుతోందని బంకుల యజమానులు చెబుతున్నారు. వినియోగదారులు అడిగితే మరమ్మతులకు గురైనట్లు చెప్పి తప్పించుకుంటున్నారు. గుర్ల, గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లోని బంకుల్లో యంత్రాలు నిత్యం మరమ్మతులతోనే ఉంటున్నాయి.

**సిబ్బందికే మరుగుదొడ్లు..**

శుద్ధమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, మూత్రశాలలు ఉండాలి. చాలాచోట్ల మరుగుదొడ్లు ఎక్కడున్నాయో సూచిక బోర్డులు పెట్టకపోవడంతో వాహనదారులు గుర్తించలేకపోతున్నారు. బంకు సిబ్బందికి తప్ప వాహనదారుల వినియోగానికి ఇవ్వడం లేదు. మెరకముడిదాం మండలంలోని ఓ బంకులో మరుగుదొడ్లు తాళం వేసి ఉంటున్నాయి. తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయడం లేదు. అడిగితే కేవలం సిబ్బందికే అనే సమాధానం వస్తోంది.

**భద్రతా ప్రశ్నార్థకమే..**

పెట్రోల్, డీజిల్ నాణ్యతను నిర్ధారించుకునేందుకు అవసరమైన ఉపకరణాలు అందుబాటులో ఉండాలి. వాహనదారుడికి అనుమానం వస్తే నివృత్తి చేసుకునేందుకు తగిన పరీక్షలు నిర్వహించాలి. ఇవేవీ అందుబాటులో ఉంచడం లేదు. వినియోగదారులు ప్రశ్నించినా.. నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ప్రతి బంకులోనూ సేల్స్ మేనేజర్ల నంబర్లు పెట్టాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అలంకారప్రాయంగానే ఉంటున్నాయి. ఫస్ట్ ఎయిడ్ కిట్లు కనిపించడం లేదు.

**చర్యలు తీసుకుంటాం..: మురళి, డీఎస్‌వో.(ఎఫ్ఏసీ), విజయనగరం**

బంకుల్లో వాహనదారులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలి. గాలి మిషన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాల్సిందే. బంకులను పరిశీలించి నిబంధనల ప్రకారం వసతులు కల్పించని వారికి నోటీసులిస్తాం. చర్యలు తీసుకుంటాం.

# 16 పాఠశాలల్లో లేవ్.. 18 చోట్ల ఉన్నా లేనట్టే!

అసంపూర్తి ఈ నిర్మాణం ఎస్.కోట మండలం కె.ఆలుగుబిల్లి ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్డి. నాడు–నేడు కింద పాఠశాల భవనం, మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు మధ్యలో ఆగిపోయాయి. ప్రస్తుతం పాఠశాల పాత పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇక్కడి నుంచి పాఠశాలలోని పాత మరుగుదొడ్డికి వెళ్తున్నారు. శిథిల సముదాయాలు.. ఊడిన తలుపులు.. అసంపూర్తి నిర్మాణాలు.. భవనాలున్నా సమకూర్చని నీటి సదుపాయం.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. విద్యార్థులు అత్యవసరంగా ఒకటికి, రెంటికి వెళ్లాలంటే ప్రాంగణం దాటి బయటకు వెళ్లాల్సిన దుస్థితి. ఇక విద్యార్థినుల స్థితి మరింత దయనీయం. జిల్లాలోని పరిస్థితి ఇందుకు నిదర్శనం. విద్యాసంస్థల్లో బాలికలు, బాలురు, దివ్యాంగులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, విఫలమైతే ప్రభుత్వాలను జవాబుదారీగా చేస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోజిల్లాలోని పాఠశాలలను పరిశీలించింది. జిల్లాలో 16 పాఠశాలల్లో అసలు మరుగుదొడ్లే లేవు. ఇంకో 18 పాఠశాలల్లో మరమ్మతులకు గురయ్యాయి. చాలాచోట్ల అసంపూర్తి నిర్మాణాలతో ఉన్నాయి. దివ్యాంగులకు ప్రతి బడిలో ప్రత్యేకంగా ఉండాల్సి ఉన్నా.. కొరతే ఉంది. పరిశుభ్రత కూడా అంతంతమాత్రమే.


**ప్రైవేటులో గగనమే..**

ప్రైవేటు బడుల్లో మరుగుదొడ్ల సదుపాయాలు గగనమే. వీటి సమాచారమే విద్యాశాఖ వద్ద లేదు. దీంతో ఆయా యాజమాన్యాలు సదుపాయాల కల్పనను పట్టించుకోవడం లేదు. జిల్లాలో 435 ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఉన్నవి అరకొరే.. అక్కడా అపరిశుభ్రతే.

**కొన్నిచోట్ల ఇదీ పరిస్థితి**

750 మంది విద్యార్థులు.. 40 మంది ఉపాధ్యాయులు ఉన్న చీపురుపల్లి ఉన్నత పాఠశాలలో కేవలం పది(బాలురకు 5, బాలికలకు 5) ఉన్నాయి. అన్నీ బాలికలు, ఉపాధ్యాయినిలకే కేటాయించారు. బాలురు అత్యవసరమైతే బయటకు వెళ్తున్నారు.

ఎస్.కోట నియోజకవర్గంలోని వేపాడ మండలం మారిక గ్రామంలో పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో పాకలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సదుపాయాలు లేవు. ఎల్.కోట మండలం వేచలపువానిపాలెంలో



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేళ్లుగా పాలసేకరణ కేంద్రంలో నడుస్తోంది.

కొత్తవలస కేజీబీవీలో 275 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడున్న 24 మరుగుదొడ్లు 6–10 తరగతుల విద్యార్థినులకే సరిపోతాయి. ఇంటర్ చదువుతున్న 75 మంది విద్యార్థినులకు భవన నిర్మాణానికి (మరుగుదొడ్లతో కలిపి) రూ.1.60 కోట్లు మంజూరైనా స్థల సమస్యతో నిర్మించలేదు.

జిల్లాలో పరిస్థితి..ప్రభుత్వ పాఠశాలలు: 1777
మరుగుదొడ్లు లేని బడులు: 16అదనపు అవసరం బాలికలకు : 14, బాలురకు 11, దివ్యాంగ పిల్లలకు : 77

**వచ్చే ఏడాదికి...**

న్యాయస్థానం తీర్పుతో 'మనబడి– మన భవిష్యత్తు' పథకం ద్వారా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సీఎస్ఆర్ నిధులు సమకూర్చి, వచ్చే ఏడాదిలో పూర్తిచేస్తాం. ప్రైవేటు బడుల్లోనూ పరిశీలిస్తాం. ఎ.రామారావు, ఏపీసీ, సమగ్ర శిక్ష అభియాన్

## 'గుడ్లు' మింగేస్తున్నారు!

ధర్మవరం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు నిధులు ఖర్చు చేస్తోంది. ప్రతిరోజూ మెనూ ప్రకారం శుచి, శుభ్రతతో వంటలు వండి వడ్డిస్తున్నారు. విద్యార్థులకు వారంలో ఒక మినహా మిగతా 5 రోజుల పాటు కోడి గుడ్డును భోజనంలోకి అందజేస్తున్నారు. ఆన్‌లైన్‌లో టెండరు దక్కించుకు న్న గుత్తేదారు కాసులకు కక్కుర్తి పడి తక్కువ బరువున్న, చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్నారు. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి.

**నిబంధనలు ఇలా..**

ప్రతి విద్యార్థికి 45 నుంచి 52 గ్రాముల బరువు ఉండే గుడ్డు ఇవ్వాలి.
10 గుడ్లు ఉంటే ఒక యూనిట్‌గా పరిగణించి.. వాటి బరువు 450-525 గ్రాములుండాలి.
ప్రస్తుతం ఇస్తున్నవి 35-45 గ్రాముల మధ్య ఉంటున్నాయి.



జిల్లా: శ్రీసత్యసాయి
ప్రభుత్వ పాఠశాలలు: 1,983
విద్యార్థుల సంఖ్య: 1,16,137
వారానికి సరఫరా అయ్యే గుడ్లు: 1,36,675

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

పాఠశాలలకు గుడ్లు సక్రమంగానే సరఫరా అవుతున్నాయి. వాటి బరువులో తేడాలుంటే హెచ్‌ఎంలు గుర్తించి మాకు తెలియజేయాలి. గుడ్ల నాణ్యతపై ఫిర్యాదు వస్తే గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం.
వినయ్‌మోహన్, మధ్యాహ్న భోజనం జిల్లా కోఆర్డినేటర్

## డ్రోన్‌కు చిక్కలేదు.. బోనులో పడలేదు..!

రాజానగరం : జిల్లాలో పెద్దపులి సంచారంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి గత నెల 20న ఏలూరు జిల్లా కొయ్యలగూడెం ప్రాంతంలో సంచరించిన పెద్దపులి 30న పట్టిసీమ ప్రాజెక్టు వద్ద గోదావరి నదిని దాటి జిల్లాలోకి ప్రవేశించింది. సీతానగరం మండలం చిన్నకొండేపూడి వద్ద సంచరించిన దీనిని గుర్తించడానికి అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి సుమారు 15 కి.మీ దూరంలో ఉన్న తొర్రేడు వద్ద సంచరించినట్లు అధికారులు గుర్తించారు. ఇక్కడ



సమీపంలోని వెంకటనగరం వరకు పులి పాదముద్రలు కనిపించాయి. ఇక్కడ కాలువ అడ్డురావడంతో పులి ఎటువెళ్లిందో తెలియలేదు. సోమవారం ఆరు ట్రాప్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసినా దీని ఆనవాళ్లు ఎక్కడా లభించలేదు. దీని ఆచూకీ గుర్తించడానికి 30 మంది అటవీ, 10 మంది పోలీసు సిబ్బంది గాలిస్తున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

తొర్రేడు, వెంకటనగరం పరిసర ప్రాంత ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో పొలాల వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. రాత్రి సమయాల్లో ఇళ్ల వద్ద ఉన్న పశువుల పాకలు చుట్టూ ఎక్కువ కాంతి వచ్చే దీపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒంటరిగా బయట తిరగవద్దని పేర్కొన్నారు.

**పర్యవేక్షణ లేక.. తగ్గుతున్న దిగుబడి: సాయిరామ్, స్థానిక రైతు**

పులి సంచారంతో అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని చెబుతున్నారు. ప్రధానంగా వ్యవసాయం పైనే జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతానికి పంటలు పొట్టదశలో ఉన్నాయి.
ఈ పరిస్థితుల్లో చేనుకు నీరు పెట్టాలి. పొలంపై పర్యవేక్షణ లేకపోతే దిగుబడి తగ్గుతుంది.

**పని వదిలేసి వచ్చేశాం: రాజు, స్థానికుడు**

అటవీశాఖ అధికారులు పులిని గుర్తించడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులందర్నీ పశువులను ఇళ్ల వద్దే కట్టేయమంటున్నారు. రాత్రంతా పశువులను కాపలా కాస్తూ నీరసించిపోయాం. చిన్న పిల్లలను అదుపు చేయాలంటే కష్టంగా ఉంది. పులి సంచరించిన పక్క పొలంలోనే పని చేస్తున్నాం. అధికారులు వచ్చి పని మానేసి వెళ్లండని హెచ్చరించారు. పని వదిలేసి వచ్చేశాం.

## కొండ కొల్లగొట్టేస్తున్నారు..

ఏలేశ్వరం : జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కొండను కొందరు తవ్వేసే పనిలో పడ్డారు. పక్కనే ఉన్న భూమిని చదును చేసి స్థిరాస్తి వ్యాపారానికి సిద్ధం చేస్తున్నారు. తవ్వేస్తున్న కొండ బౌద్ధకాలం నాటి ఆనవాళ్లు ఉన్న ప్రాంతం. పురావస్తుశాఖ హద్దులు నిర్ణయించి చారిత్రక సంపదగా నిలిపేందుకు గుర్తించిన కొండ. ఏలేశ్వరం మండలం ఎర్రవరం హైవేని ఆనుకొని ఉన్న సర్వే నంబరు 366లోని ఈ కొండ 42 ఎకరాల్లో విస్తరించి ఉంది. కొండ పాదపీఠం కదిలేలా గ్రావెల్ తవ్వకాలకు పెద్దలు నడుం కట్టారు. రేయింబవళ్లు యంత్రాల సాయంతో తొలిచే పనిలో ఉన్నారు. అనుమతులు లేవనేది బహిరంగ రహస్యం. కొండను ఆనుకొని ఉన్న 10 ఎకరాలు హైవేకు చేరువగా ఉంటుంది. వ్యాపార అవసరాల కోసం ఈ ప్రదేశాన్ని చదును చేయడానికి ఎక్కడో దూరం నుంచి గ్రావెల్, రాయి తెచ్చుకునే బదులు పక్కనే ఉన్న కొండపై కన్నేశారు. ట్రాక్టర్ రూ.900లు నుంచి రూ.1300 లకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. సుమారు 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా గ్రావెల్‌ను ఇప్పటివరకూ తరలించినట్లు అంచనా. పురావస్తుశాఖ హద్దులు నిర్ణయించిన చోట నుంచి దిగువకు తవ్వుతుండగా.. ఇదే అదనుగా అసలు కొండకు ఎసరు పెట్టారు. హైవే పక్కనే ఇంత జరుగుతున్నా ఏ శాఖ అటు చూడలేదు. పురావస్తుశాఖకు అసలు విషయమే తెలియదు.

## కాటికోటేశ్వరా.. కష్టాలు కనవయ్యా?




తాడిమర్రి : తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపాన వెలసిన కాటికోటేశ్వరస్వామి క్షేత్రం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివరాత్రి బ్రహ్మోత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. రాయలసీమ జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. భక్తులకు సరైన సౌకర్యాలు లేవు. క్షేత్రంలో దేవాదాయశాఖ ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు నగదు, ఆభరణాలు కానుకలుగా వేస్తుంటారు. వీటితోపాటు పూజాసామగ్రి, బొమ్మల విక్రయం, తలనీలాల సేకరణతో ఏటా సుమారు రూ.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. గత రెండేళ్లుగా అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. నామమాత్రంగా పనులు చేపట్టి ఉత్సవాలు జరిపిస్తున్నారు.

**భక్తుల సమస్యలు ఇవీ..**

క్షేత్రంలోని అన్ని నిఘా నేత్రాలు పని చేయడం లేదు. వాటి తీగలను కోతులు కొరికేయడంతో నిరుపయోగంగా మారాయి.
భక్తుల దాహార్తి తీర్చేందుకు గతంలో ఏర్పాటు చేసిన కుళాయిలు పనికి రాకుండాపోయాయి. ఫలితంగా గొంతులు తడుపుకోవడం కష్టమే.
కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో నీటి వసతి లేకపోవడంతో వృథా ఉన్నాయి.
గదేగుండం వద్ద మహిళా భక్తులు స్నానాలు ఆచరించి దుస్తులు మార్చుకునేందుకు సరైన ఏర్పాట్లు లేవు. ఆరుబయటే మార్చుకోవాల్సిన దుస్థితి. శివరాత్రి రోజు ఉపవాసం ఉండి క్షేత్రంలో జాగారం చేస్తే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. కానీ అక్కడ వేచి ఉండలేని పరిస్థితి. మౌలిక వసతులు కల్పిస్తాం: నరసింహరాజు, దేవాదాయశాఖ అధికారి భక్తులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేస్తాం.

## జడ్పీలో విలీనం చేస్తారా.. నిర్వహిస్తారా?



పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో కీలకమైన శ్రీసత్యసాయి తాగునీటి పథకం నిర్వహణపై చర్చ జరుగుతోంది. నిర్వహణ బాధ్యతలను జిల్లా పరిషత్తుకు అప్పగించడంపై సమ్మతి తెలపడం, శ్రీసత్యసాయి వాటర్ బోర్డు పథకాలకు సంబంధించిన నాలుగేళ్ల ఏజెన్సీల వివరాలు, బిల్లులను ఈనెల పదిలోపు అప్‌లోడ్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పలు సూచనలూ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పథకంపై చర్చ జరుగుతోంది.

**దాహార్తి తీర్చాలని..**

కరవు పరిస్థితులను చూసి చలించిన పుట్టపర్తి సత్యసాయిబాబా 1995లో తాగునీటి పథకం పనులను సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టారు. నాడు తెదేపా అధికారంలో ఉండగా.. బాబా సూచన మేరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం పరిధిలోకి తీసుకొచ్చారు. 1997, సెప్టెంబరు 16న 9మంది సభ్యులతో శ్రీసత్యసాయి వాటర్ సప్లయ్ ప్రాజెక్ట్ బోర్డును ఏర్పాటు చేశారు. ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఇన్‌ఛార్జి ఎస్‌ఈ, జడ్పీ సీఈఓ, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ, ఇరిగేషన్ ఎస్‌ఈ, ఆర్.కొండలరావులను సభ్యులుగా నియమించారు. స్వతంత్ర ప్రతిపత్తిన బోర్డు నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఇందులో 70 శాతం ప్రభుత్వ నిధులు, 30 శాతం వినియోగ రుసుం కింద స్థానిక సంస్థల నుంచి వసూలు చేసుకోవాలని సూచించింది. బోర్డు ఆధ్వర్యంలో కార్మికుల జీతాలు, మోటార్ల మరమ్మతులు తదితర పనులు చూసుకునేందుకు 1998లో ఎల్‌అండ్‌టీకి కమిటీ బాధ్యతలు అప్పగించింది.

**కొనసాగించాలని మంత్రి లేఖ**

లక్షలాదిమంది ప్రజల దాహార్తి తీరుస్తున్న పథకాన్ని బోర్డు పరిధిలోనే కొనసాగించాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

**పథకం తీరు..**

ప్రాజెక్టు వ్యయం: రూ.380 కోట్లు
సీపీడబ్ల్యూఎస్ పథకాలు: 19
మొత్తం గ్రామాలు: 1,341
లబ్ధిదారులు: 16.40 లక్షలు

**వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యం**

పంచాయతీల్లో వెయ్యి లీటర్లకు రూ.5, మున్సిపాలిటీల్లో రూ.27 చొప్పున యూజర్ ఛార్జీలను ఎల్‌అండ్‌టీ వసూలు చేసేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్వహణను గాలికొదిలేసింది. 2019-2020లో నిధులే ఇవ్వలేదు. తర్వాత అరకొరగా విడుదల చేసింది. స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాల్సిన నిధులనూ మళ్లించింది. ఈకారణంగా స్థానిక సంస్థలు యూజర్ ఛార్జీలు చెల్లించలేకపోయాయి. ఎల్‌అండ్‌టీ కంపెనీకి రూ.140 కోట్లు బకాయి పెట్టింది. దీంతో సదరు కంపెనీ కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

**బోర్డు ఛైర్మన్‌ను మార్చాలని ప్రతిపాదించాం: మురళీధర్, ఇన్‌ఛార్జి ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

తాగునీటి పథకం బోర్డు ఛైర్మన్‌గా ప్రారంభం నుంచి అనంతపురం కలెక్టరే కొనసాగుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడటంతో ఛైర్మన్‌గా ఇక్కడి కలెక్టర్‌ను నియమించాలని ప్రతిపాదనలు పంపించాం. ఇలా చేయడం వల్ల ఈ ప్రాంతంలో సరఫరాను మరింత మెరుగ్గా పర్యవేక్షించే అవకాశం లభిస్తుంది.

## సాగు'బడి'.. నూతన ఒరవడి



కదిరి : గ్రామీణ భారతానికి వ్యవసాయమే ఊతం. సాగు పచ్చగా పండాలంటే భూసారం ఎంతో ముఖ్యం. పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయాలి. ఇవన్నీ చేయాలంటే అవగాహన అవసరం. అందుకు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్రోన్ పైలెట్, భూసార నిర్ధారణ పరీక్షలపై స్వల్ప కాలిక శిక్షణ ఇచ్చారు. సొంత సాగులో మెలకువలు ఉపయోగించటం, వ్యవసాయం లేకుంటే ఉపాధి అవకాశంగా ఉపయోగపడతాయని శిక్షణ విద్యార్థినులు చెబుతున్నారు.

**ఏమి నేర్చారంటే..** కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు ఏరియల్ డ్రోన్ పైలెట్ ప్రోగ్రాం, భూసార పరీక్షలు, అంచనాల వర్క్‌షాప్ నిర్వహించారు. పీఎం-ఉష అరైజ్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆసక్తి కలిగిన వంద మందికిపైగా విద్యార్థినులు శిక్షణ పొందారు.
నల్లరేగడి, ఇసుక, బరక, ఎర్రనేలల్లో పంటల సాగుకు అవసరమైన భూసారం ఏ మేరకు ఉండాలి. స్వయంగా భూసారాన్ని పరీక్షించి తక్కువ, ఎక్కువలను ఎలా సరి చూసుకోవాలో నేర్చారు. పంటలకు మందుల పిచికారి, ఫొటోషూట్, విపత్తు సమయాల్లో అవసరమైన వస్తువులను చేరవేయడానికి డ్రోన్‌ను ఎలా ఎగురవేయాలి. ఎలా నిర్వహించాలన్న దానిపై మెలకువలను నేర్చారు.

**ఆరోగ్యకర నేలతో మేలైన దిగుబడి: అర్షియా, బీఏ ఉర్దూ విద్యార్థిని**

నాకు వ్యవసాయమంటే ఇష్టం. సాగుకు నేల ఎంతో ముఖ్యం. ఆరోగ్యకరమైన భూమితోనే పంటలు సమృద్ధిగా పండుతాయి. అందుకు భూసారం ఏ మోతాదులో ఉండాలో తెలుసుండాలి. సమతుల భూసారంతో ఆయా పంటలను సాగు చేయగలం. లేదంటే ఏదోక లోపంతో నష్టపోవాల్సి ఉంటుంది. శిక్షణ లోపాన్ని సరిదిద్దుకునే మెలకువలను నేర్పింది. **డ్రోన్ ఆపరేట్తో ప్రయోజనం : స్పందన, బీఏ పొలిటికల్ సైన్స్** శిక్షణలో డ్రోన్‌తో ఏయే పనులు ఎలా చేసుకోవచ్చో తెలుసుకున్నాను. వ్యవసాయ కుటుంబానికి చెందిన నాకు డ్రోన్‌తో పంటల్లో చీడపీడల నివారణకు మందులు పిచికారి చేయటానికి దోహదపడనుంది. దీంతో పాటు ఫొటోషూట్లకు వినియోగించుకోవచ్చు. డ్రోన్ ఆపరేటింగ్ నేర్చుకోవడం వల్ల సొంత పనులు, ఇతరులకు పనులు చేయించి ఉపాధి పొందొచ్చు.

## బెంగళూరుకు రయ్.. రయ్

కోవెలకుంట్ల: జాతీయ రహదారి (167కే) పనులు వేగమంతమయ్యాయి. ఈ దారి పూర్తయితే బెంగళూరుకు దూరాభారం తగ్గనుంది.. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ రహదారులను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 167కే దారి పనులు చేపడుతున్నారు. తర్వాత జమ్మలమడుగు- కడప దారికి అనుసంధానం చేస్తారు.

**రూ.691.81 కోట్లు మంజూరు**

నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల పరిధిలోని 22 గ్రామాలను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారి వెళ్తుంది. నొస్సం, అల్లూరు, రూపనగుడి వద్ద రహదారిపై వంతెనలు, కల్వర్టులు కలిపి 158 వరకు నిర్మిస్తున్నారు. రహదారి నిర్మాణానికి రూ.691.81 కోట్లు మంజూరయ్యాయి.. 173 ఎకరాల ప్రభుత్వ, 313 ఎకరాల ప్రైవేట్ భూమి సేకరించారు.

**వాహనాలన్నీ బైపాస్**

నంద్యాల నుంచి నొస్సం వరకు 62 కి.మీ. దూరం ఉంటుంది. రహదారి నిర్మాణంలో భాగంగా నంద్యాల రైతునగరం- కానాల,



పసురుపాడు- గోస్పాడు, జొలదరాశి- కోవెలకుంట్ల, నొస్సం వరకు బై'పాస్'లు నిర్మిస్తున్నారు. గతేడాది జూన్‌లో ప్రారంభించిన బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు ఈ మార్చినాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. రైతునగరం, కానాల మినహా అన్నిచోట్లా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. జొలదరాశి, కోవెలకుంట్ల మధ్యలో ఒక లేయర్ తారు రోడ్డు నిర్మించారు. బైపాస్‌ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీరనుంది.. నంద్యాల నుంచి గంట లోపే ప్రయాణికులు నొస్సం దాటనున్నారు.

**ఎంతో మందికి ప్రయోజనం**

జిల్లాకు చెందిన పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బెంగళూరులో పని చేస్తున్నారు. వ్యాపారులు వెళ్తుంటారు. వీరంతా ప్రస్తుతం అవుకు, కొలిమిగుండ్ల మార్గాల్లో తాడిపత్రి, అనంతపురం మీదుగా ప్రయాణిస్తున్నారు. 167కె పూర్తయితే జమ్మలమడుగు, ముద్దనూరు రోడ్డులో తాడిపత్రి హైవేలో బెంగళూరుకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తక్కువ సమయంలో సులభంగా చేరుకోవచ్చు.

## పారిశ్రామికవాడ.. ఏదీ నీటి జాడ

కర్నూలు : ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వివిధ పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. అవసరమైన వసతులు కల్పిస్తోంది. మరోవైపు పారిశ్రామికవాడకు నీటి వసతి సమకూరని పరిస్థితి. పైపులైన్ల పనులు పూర్తవుతున్నా నీటిని నిల్వ చేసే జలాశయం అందుబాటులో లేదు. ఫలితంగా ఆయా సంస్థలు పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపడం లేదు.

**రూ.288 కోట్ల వరకు వెచ్చించి..**

ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు వరకు 54 కి.మీ. మేర పైపులైను పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. దీనికి 288 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పైపులైను వేస్తామని చెప్పి దాని అలైన్‌మెంటును ఇష్టారాజ్యంగా మార్చేశారు. ఫలితంగా పనుల్లో ఆలస్యం జరిగింది. ప్రస్తుతం 6 కి.మీ. మేర పైపులైను వేయాల్సి ఉంది. మరో నెల రోజుల్లో పూర్తవుతుందని అంచనా. పనులు పూర్తైతే ముచ్చుమర్రి నుంచి 74 ఎంఎల్‌డీ నీటిని తరలించుకునే అవకాశముంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా నీటిని నిల్వ చేసుకునేందుకు



ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ పరిధిలో జలాశయం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.37 వేల కోట్ల పెట్టుబడులు కర్నూలుకు వచ్చేలా ఒప్పందాలు జరిగాయి. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ సంస్థే రూ.2,480 కోట్ల పెట్టుబడులు పెట్టే క్రమంలో నిర్మాణ పనులను ప్రారంభించింది. మిగిలిన సంస్థలు మాత్రం స్పందించడం లేదు. ఇదేమని అడిగితే నీటి కోసం వేచి చూస్తున్నట్లు ఆయా పరిశ్రమల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

**ఎప్పటికి పూర్తయ్యేనో..**

పారిశ్రామిక అవసరాలకు వీలుగా మీదివేముల గ్రామంలో రూ.370 కోట్లతో జలాశయ నిర్మాణానికి ప్రభుత్వం గత నెలలో అనుమతిచ్చింది. 4,205 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో సుమారు 120 ఎకరాల్లో దీనిని నిర్మించనున్నారు. నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలను రెండేళ్లపాటు చూసుకునేలా టెండర్లు పిలవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తై ఎప్పటికి జలాశయం పనులు ప్రారంభమవుతాయన్నది మారింది. బ్రాహ్మణపల్లి ప్రాంతంలోనూ పలు పరిశ్రమలు వస్తున్న నేపథ్యంలో ఓర్వకల్లు నుంచి బ్రాహ్మణపల్లి వరకు సుమారు 12 కి.మీ. దూరంపాటు పైపులైను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికిగాను రూ.9 కోట్లు వెచ్చించనున్నారు. టెండర్లు పూర్తవడంతో ఈ మార్గంలో పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు ముచ్చుమర్రి వద్ద ఇన్‌టేక్‌వెల్ పనులను రూ.8 కోట్లతో చేపట్టారు.

## కంటెయినర్‌లో పశువుల తరలింపు

పత్తికొండ : పదుల సంఖ్యలో ఎద్దులు, ఆవులు, గేదెలు తరలిస్తున్న ఓ కంటెయినర్‌ను పత్తికొండ సమీపంలో విశ్వహిందూ పరిషత్తు నాయకులు అడ్డుకున్నారు. ఎమ్మిగనూరు నుంచి పుంగనూరుకు ఓ కంటెయినర్‌లో పెద్ద సంఖ్యలో గోవులు తరలిస్తునారన్న సమాచారం మేరకు పత్తికొండ వ్యవసాయ మార్కెట్ సమీపంలో వేకువ జామున కంటెయినర్‌ను పట్టుకున్నారు. వాహనాన్ని ఎక్కి పరిశీలించారు. అందులో 36 పశువులను కుక్కి తరలిస్తున్నారని విశ్వహిందూ పరిషత్తు నాయకులు ఆరోపించారు. పత్తికొండ పోలీసులకు సమాచారం అందించారు. ఆదోని ప్రధాన రహదారి పక్కన ఈరన్న స్వామి ఆలయ సమీపంలోకి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ జయన్న ఉదయం అక్కడి వెళ్లి పశువుల తరలింపుపై విచారణ చేపట్టారు. ఎమ్మిగనూరు నుంచి జరిగే పత్తికొండ సంతలో పశువులను విక్రయించేందుకు ఆరుగురు రైతులతో కలిసి వ్యాపారులు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు. అక్రమంగా గోవులు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు వీర్రాజు, రామలింగ కోరారు.

## విలువల బడి.. భవిత మెరుగుపడి

కుప్పం : పిల్లలకు విలువలతో కూడిన విద్య అందించాలన్న లక్ష్యంతో కుప్పం పురపాలికలోని సామగుట్టపల్లె ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి చేతుల మీదుగా 'విలువల బడి' ప్రారంభించారు. ఇది సత్ఫలితాలు ఇస్తోందని, దీన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30–8.00 గంటల వరకు నైతిక విలువలతో కూడిన విద్య బోధిస్తున్నారు. దీనిద్వారా విద్యార్థుల్లో మంచి మార్పులు వస్తుండటంతో నియోజకవర్గంలోని బల్ల, పైపాళ్యం, సోగడబళ్ల, కంచిబందార్లపల్లె ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రారంభించారు. ఇది విజయవంతమైతే రాష్ట్ర



వ్యాప్తంగా ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**ఏం నేర్పుతున్నారంటే..**

విద్యార్థి నడత, యోగా, ధ్యానం, ఆత్మవిశ్వాసం పెంచే క్రీడలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన.

**సమన్వయకర్తను నియమించి..**

ప్రతి పాఠశాలకు ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తిని సమన్వయకర్తగా నియమించి, దాతల సాయంతో గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తున్నాం. ప్రస్తుతం సమన్వయకర్తలకు గౌరవ వేతనాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమకూరుస్తున్నారు. లెనిన్ బాబు, సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు

## ఖ'నిజం' తేలిస్తే బంగారమే..!

ఓబులవారిపల్లె : ఖనిజాల కాణాచి తిరుపతి జిల్లాలోని మంగంపేట బెరైటీస్ గనుల్లో అరుదైన పుల్లరిన్ ఖనిజ నిక్షేపాలున్నట్లు అమెరికాలోని పరిశోధన సంస్థలు గతంలో తేల్చాయి. నానో టెక్నాలజీకి కీలకమైన పుల్లరిన్ వెలికితీస్తే దేశ భవితే మారుతుంది.

**18 ఏళ్ల కిందటే గుర్తింపు**

మంగంపేట గనుల్లో భారీగా పుల్లరిన్ నిక్షేపాలున్నట్లు 18 ఏళ్ల కిందటే భూభౌతిక శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటి నుంచి ఇక్కడ లోతుగా పరిశోధనలు చేశారు. తొలుత ఇవే నమూనాలతో అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశీలన చేపట్టగా సి60, సి70, సి80 పుల్లరిన్ రీతులు ఉన్నట్లు ఫలితాలొచ్చాయి.

**ఏమిటీ పుల్లరిన్?** పుల్లరిన్ అనేది కార్బన్ సమ్మిళిత పదార్థం. గోళ, స్థూపాకార ఆకృతుల్లో ఉండే ఈ ఖనిజం.. సి60, సి70, సి80.. ఇలా వివిధ రూపాంతరాల్లో లభ్యమవుతుంది. 2–డైమన్షన్‌లో గ్రాఫీన్‌గా పిలుస్తుండగా.. 3–డైమన్షన్‌లో పుల్లరిన్‌గా వ్యవహరిస్తున్నారు. దృఢత్వంలో ఉక్కు కంటే 250 రెట్లు ఎక్కువ కాగా.. 10 రెట్లు తేలికైంది. దీనిపై ఇప్పటికే అమెరికా లోతైన పరిశోధనలు చేపట్టగా మిగిలిన దేశాలు నిల్వలకు అన్వేషిస్తున్నాయి.

**ఒప్పందం ఊసే లేదు..**

మంగంపేట బెరైటీస్ గని పరిసరాల్లోని మొత్తం 156 ప్రాంతాల్లో మరో 150 నమూనాలు సేకరించి పరీక్షించారు. జీఎస్ఐ బృందాలు పరిశోధనలు నిర్వహించాయి. మూడేళ్ల క్రితం భువనేశ్వర్‌లోని ఐఎంఎంటీ బృందం 255 ప్రాంతాల్లో 250 నమూనాలు సేకరించింది.



ఈ పుల్లరిన్ నిక్షేపాలపై లోతుగా పరిశోధించేందుకు ఏపీఎండీసీ అప్పట్లో భువనేశ్వర్‌లోని ఐఎంఎంటీ బృందంతో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం దాని ఊసేలేదు.

**ప్రయోజనాలివీ..**

బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, పిడుగుపాటు నుంచి రక్షణకు విమానాలకు పైపూతగా వాడతారు. క్షిపణులకు ఈ పూతపూస్తే రాడార్లు పసిగట్టలేవన్నది శాస్త్రవేత్తల మాట. ఇంధన వాహకాల తయారీలో వినియోగిస్తారు. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్, సోలార్ ఎనర్జీ టెక్నాజీ పరంగానూ వాడనున్నారు. లోతైన అధ్యయనం జరగాలిపుల్లరిన్ నిక్షేపాలపై కొన్ని బృందాలతో ఏపీఎండీసీ ఉన్నతాధికారులు పరిశోధించారు. మరింత లోతైన అధ్యయనం జరిగితే దేశానికి మంచి జరుగుతుంది. గోపీనాథ్, ఏపీఎండీసీ సీపీవో, మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు

## చరిత్రకు గుర్తు.. పాలేగాళ్ల గుర్రపుశాల

పెనుమూరు: ఇదేదో శిథిలావస్థకు చేరిన భవనం అనుకుంటే పొరపాటే. రెండు వందల ఏళ్లనాటిదీ కట్టడం. కార్వేటినగరం సంస్థానాధీశులు పెనుమూరు ఉత్తర దిశలో ఉన్న కొండల కింద భాగం భూములను పాలేగాళ్ల ఆధీనంలో ఉంచారు. వారు పన్నులు వసూలు చేసి సంస్థానాధీశులకు పంపేవారు. పాలేగాళ్లు ఈ ప్రాంతంలో



తిరిగేందుకు వీలుగా గుర్రాలను ఉపయోగించేవారు. వాటిని ఉంచేందుకు కట్టిందే ఈ భవనం. మొత్తం సున్నం, ఇసుక కలిపి రాతి స్తంభాలతో నిర్మించి అందులో గుర్రాలను కట్టేవారు. ఆనాడే ఇక్కడ శివాలయం, రామాలయాలు నిర్మించి పూజలు చేశారు. ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలమై ఆనవాళ్లు మాత్రమే మిగిలాయి. పాలేగాళ్లు ఉండే ఈ ప్రాంతాన్ని పాళ్యంగా పిలిచేవారు. అదే పేరుతో ఇక్కడ ఓ గ్రామానికి పాళ్యంకొత్తూరు అనే పేరొచ్చింది. ఇక్కడ వందల ఎకరాల భూమి వారి ఆధీనంలో ఉండేది. భూమిని పాలేగాళ్ల వంశంలో చివరిగా ఉన్న చెల్లెమ్మ అనే మహిళ ఓ వ్యక్తికి విక్రయించగా ఆయన అమ్మేశారు.

# తుంగలో మాటేసిన మా'రీచ్'లు



నందికొట్కూరు :తుంగభద్ర నదిలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్ల వద్ద 3.50 లక్షల టన్నుల ఇసుక నిల్వలున్నాయి.. నిత్యం 20–30 వేల మెట్రిక్ టన్నులు తవ్వి నిల్వ ఉంచుతున్నాం.. ఇక్కడ నుంచి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో ఇసుక డిపోలకు రవాణా చేస్తున్నాం.. వివిధ ప్రభుత్వ పనులు, ప్రైవేటు భవన నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా అందిస్తున్నాం. కౌతాళం మండలంలోని గుడికంబాలి, నదిచాగి, మరళి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోవడంతో గత పది రోజుల నుంచి తవ్వకాలు జరగడం లేదు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఏకంగా నదిలోకి మట్టి దారి వేసి ఇసుకను తోడేస్తున్నారు. ఈసీ అనుమతులు వచ్చేందుకు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు భారీ యంత్రాలు వినియోగిస్తున్నారు. టిప్పర్లలో పరిమితికి మించి అధిక లోడుతో తరలిస్తున్నారు.

**పర్యావరణ అనుమతులకు లేఖ**

తుంగభద్ర నదిలో గుడికంబాలి, నదిచాగి, మరళి రీచ్‌ల్లో 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు 2024లో గుర్తించారు. అందులో కొంత భాగం తవ్వుకోవడానికి పర్యావరణ అనుమతులొచ్చాయి. 1.69 లక్షల మెట్రిక్ టన్నులు తోడేశారు.

ఆయా రీచ్‌ల పరిధిలో ఇంకా 1.83 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గుడికంబాలిలో ఒక యూనిట్ ఇసుక రూ.39, నదిచాగి, మరళి రీచ్‌ల్లో టన్ను ధర రూ.40గా నిర్ణయించారు. ఈ మూడు రీచ్‌ల్లో పర్యావరణ అనుమతుల నిమిత్తం మైనింగ్ అధికారులు జిల్లా పాలనాధికారుల ఆమోదంతో ప్రభుత్వానికి లేఖలు పంపారు.

**నిత్యం 50 టిప్పర్లలో తరలింపు**

మరళి రీచ్ పూర్తిగా నీటిలో మునిగి ఉండగా.. మిగిలిన రెండు చోట్ల యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. నిత్యం 40–50 టిప్పర్లు వెళ్తున్నట్లు నదీతీర గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఒక్కో టిప్పరులో 20 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు.. ఇలా రోజుకు 800–1,000 టన్నుల మేర తరలుతోంది. రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, వేబ్రిడ్జిలు లేకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. రీచ్‌ల నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో టిప్పర్ (20 టన్నులు) ఇసుక రూ.14 వేల నుంచి రూ.16 వేలకు విక్రయిస్తున్నారు. కోడుమూరు, పత్తికొండ, ఆస్పరి ప్రాంతాలకు రూ.17 వేల నుంచి రూ.18 వేలకు అమ్ముతున్నారు.

**నెలగా తవ్వకాలు**

కౌతాళం మండల పరిధిలోని ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు రావాల్సి ఉంది. ఇవేవీ పట్టించుకోని కొందరు నెల రోజుల నుంచి తవ్వకాలు ప్రారంభించారు. నది లోపలికి టిప్పర్లు వెళ్లేందుకు ఏకంగా మట్టి రోడ్డు నిర్మిస్తున్నారు. గుడికంబాలి వద్ద కి.మీ. మేర రహదారి నిర్మాణం కొనసాగుతోంది. అందుకోసం మట్టిని టిప్పర్లలో నదిలోకి తీసుకెళ్తూ తిరిగొచ్చే క్రమంలో ఇసుక నింపుతున్నారు. నదిచాగి వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

# 'అలివి'గాని అక్రమాలు



నందికొట్కూరు : కృష్ణానది 'మత్స్య' సంపదను మాఫియా కొల్లగొడుతోంది.. నిషేధిత అలివి వలలతో చేపలకు గాలం వేస్తున్నారు.. నిత్యం రెండు వేల టన్నుల మేర చేపలను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన నిధులు వెచ్చించి నదిలో ఏటా 21 లక్షలకు పైగా చేప పిల్లలు వదులుతుంటారు. నదిలో నీటి మట్టం 790 అడుగులకు వచ్చినప్పుడు చేపల వేట చేపట్టాలి. ప్రస్తుతం 878 అడుగుల నీటిమట్టం ఉన్నా వేటాడుతున్నారు. అక్రమార్కులు ఇతర ప్రాంతాల నుంచి వేటగాళ్లను రప్పించి రాత్రివేళ నదిలోకి పంపించి వేట కొనసాగిస్తున్నారు.

**నది ఒడ్డున తిష్ఠ**

శాతనకోట, జంగంపాడు, నెహ్రూ నగర్, ముచ్చుమర్రి, చాబోలు, సంగమేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం ప్రాంతాల మీదుగా కృష్ణా నది ప్రవహిస్తోంది. చేపల మాఫియా బిహార్, ఝార?ండ్ రాష్ట్రాలతోపాటు వైజాగ్ నుంచి మత్స్యకారులను పిలిపించారు. ఒకొక్కరికి నెలకు రూ.12 వేల చొప్పున చెల్లిస్తున్నారు.

నాలుగు మండలాల్లోని ఎనిమిది ప్రాంతాల్లో 20 గుడారాలు వెలిశాయి. ఒక్కోదాంట్లో 10 నుంచి 20 మంది వరకు ఉంటున్నారు. వీరంతా అలివి (చేప పిల్లలూ పట్టుకొనేందుకు ప్రత్యేకంగా వాడేవి) వలలతో రేయింబవళ్లు నదిలో వేట కొనసాగిస్తున్నారు.

చేపల మాఫియా కనుసన్నల్లో దందా కొనసాగుతోంది. వివిధ శాఖ అధికారులు అటువైపు రాకుండా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఇచ్చి మచ్చిక చేసుకొంటున్నారు.

**నిత్యం 2 వేల టన్నులు తరలింపు**

కృష్ణానదిలో వదిలే చేప పిల్లల్లో బేర్షలు, బట్టగెండె, పొట్టు, మోసు రకాలు ఉంటాయి. వీటిని ఔషధాలు, కాస్మోటిక్స్‌లో ఉపయోగిస్తారు. ఒకసారి అలివి వల నదిలో వేస్తే సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు చేపలు చిక్కుతాయి. వీటిలో సగం వరకు చేపపిల్లలే ఉంటాయి.. వాటిని నది ఒడ్డున ఆరబెట్టి రవాణా చేస్తున్నారు.

నిత్యం రెండు వేల టన్నుల వరకు చేపలు పడుతున్నారు. వీటిలో 1,500 టన్నులను ఐస్ బాక్సుల్లో భద్రపరిచి విజయవాడ, గుంటూరు నగరాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. అక్కడ కిలో రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. వలలో చిక్కి చనిపోయిన వాటిని, చిన్న చేపలను మత్స్యకారులు ఎండబెట్టి వారే వ్యాపారం చేసుకుంటుంటారు. ఇవి కిలో రూ.50 నుంచి రూ.100 చొప్పున మార్కెట్‌కు తరలిస్తుంటారు. బయట ప్రాంతాల్లో కిలో రూ.100 నుంచి రూ.200కు అమ్ముతుంటారు.

## ఒంటరిగా వస్తాయి.. కుటుంబంగా వెళ్తాయి

తిరుపతి : అవి ఏడు సముద్రాలు దాటి వచ్చిన అతిథులు.. ఖండాలు వేరైనా మన నేలపట్టునే తమ 'పుట్టింటి'గా మార్చుకున్న విదేశీ విహంగాలు. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి, ఇక్కడ జోడి కట్టి, గూడు కట్టి, పిల్లలతో తిరిగి ఎగిరిపోవడమే వాటి జీవన ప్రయాణం. సూళ్లూరుపేటలో జరుగుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా 'నేలపట్టు' పక్షుల కేంద్రం సందర్శకులకు కనువిందు చేస్తోంది. **అరుదైన గ్రే పెలికాన్‌ల విడిది**: పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలు కనువిందు చేస్తే, నేలపట్టులో మాత్రం 'గ్రే పెలికాన్' పక్షులదే హవా. ఐయూసీఎన్ రెడ్ లిస్టు ప్రకారం అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్న ఈ పక్షులు ఇక్కడ ప్రధాన ఆకర్షణ.

**తల్లి కాపలా.. తండ్రి ఆహారాన్వేషణ :** ఏటా అక్టోబర్‌లో ఇక్కడికి వస్తాయి. ఇక్కడికి వచ్చాకే తమ భాగస్వామిని ఎన్నుకుంటాయి. జతకట్టిన తర్వాత బ్యారింగ్టోనియా చెట్లపై గూళ్లు కట్టుకుంటాయి. గుడ్లు పొదిగి, పిల్లలు బయటకు వచ్చాక తల్లి, తండ్రి పక్షులు బాధ్యతలను పంచుకుంటాయి.

**ఎగరడం, వేటాడటంపై శిక్షణ :** నేలపట్టులో పుట్టిన పిల్ల పక్షులకు తల్లిదండ్రులు ఇక్కడే ప్రత్యేక శిక్షణ ఇస్తాయి. ఈత కొట్టడం, చేపలను వేటాడటం, గాలిలో ఎగరడం వంటి విద్యలన్నీ ఇక్కడే నేర్పిస్తాయి. దాదాపు ఏప్రిల్ నాటికి పిల్ల పక్షులు స్వయంగా ఎగిరే స్థాయికి చేరుకుంటాయి. ఆ తర్వాత పిల్లలతో సహా పక్షులన్నీ తమ స్వదేశాలకు తిరిగి పయనమవుతాయి.

**ఇక్కడే ఎందుకు?** ఇక్కడ నీటిలో పెరిగే ఈ చెట్లు పక్షులకు రక్షణ కవచంలా ఉంటాయి. ఆకులు దట్టంగా ఉండి గూడు కట్టుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. పక్కనే ఉండే అటవీ ప్రాంతం సతతహరిత



పొదలతో నిండి ఉంటుంది. గూడు కట్టుకోవడానికి కావాల్సిన పుల్లలు ఇక్కడ సమృద్ధిగా దొరుకుతాయి. సమీపంలోని పులికాట్ సరస్సు, సముద్ర తీరం, పంట పొలాల్లో చేపలు, కప్పలు, పాములు, పురుగులు వంటి ఆహారం పుష్కలంగా లభిస్తుంది.

**సంరక్షణే ధ్యేయంగా..**

నేలపట్టులో మానవ ప్రమేయం, శబ్ద కాలుష్యం లేకుండా ఫారెస్ట్ సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే వైట్ ఐబిస్, కార్మరెంట్ వంటి పక్షులు రెండు దఫాలుగా పిల్లలను పెట్టాయి. పర్యాటకులు పక్షులను వీక్షించేందుకు ఇదే సరైన సమయం. సౌజన్య, నేలపట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ప్రస్తుతం ఇక్కడున్న పక్షుల వివరాలు

పెద్దవి: 20 వేలు


పిల్లలు: 10 వేలు

## మద్యం ముట్టరు.. గుడ్డు, మాంసం తినరు!

రాయదుర్గం : కట్టుబాటు.. ఆచరణ: రాయదుర్గం పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడిగుప్ప గ్రామంలో కోళ్ల పెంపకం, కోడిగుడ్డు, మాంసం తినడం నిషిద్ధం. మద్యం ముట్టరు.

**ఎన్నేళ్ల నుంచి : 400 ఏళ్ల నుంచి..**

ఎందుకని?: ఈ గ్రామానికి ఏలిక అయిన పాళేగాడు రాజుగా ఉండేవాడు. ఇతనికి రాయదుర్గం పట్టణానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండేది. ఆయన ప్రతిరోజూ రాత్రి ప్రియురాలి ఇంటికి వెళ్ళి వచ్చేవాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కర్ణాటకలోని చిత్రదుర్గం రాజు బుడిగే చిన్నయ్య..అడిగుప్ప కొండలో దాచిన ధనరాసులను కొల్లగొట్టేందుకు పథకం వేశాడు. శత్రుసైనికులకు మద్యం, కోడిమాంసం రుచి చూపించి మత్తులో ముంచి.. కోటలోని



ధన రాసులను తీసుకెళ్ళేందుకు ఉపక్రమించాడు. ఈ సమయంలో అడిగుప్ప కులదైవం రాజుల దేవరస్వామి రాజు కలలో దర్శనమిచ్చి జరుగుతున్న సంగతిని వివరించింది. ఆయన అడిగుప్పకు చేరుకుని బుడిగే చిన్నయ్యను, ఇతని సైన్యాన్ని, చంపి కొండ వద్ద పాతి పెట్టారని చెబుతారు. ఇప్పటికీ వారి సమాధులు కొండ వద్ద ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా మద్యం, మాంసం ముట్టబోమని ఆ ఊరి వారందరితో రాజు ప్రమాణాలు చేయిస్తారు. అప్పటినుంచి ఆ గ్రామంలో మద్యనిషేధం అమల్లోకి వచ్చింది. ఈ కట్టుబాటుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అనారోగ్యానికి గురి కావటం, లేదా ఆస్తి నష్టం కలగటం జరుగుతాయని నమ్ముతారు. అప్పటి నుంచి రాజును కీర్తిస్తూ ప్రతి ఏటా ఫిబ్రవరిలో జాతర జరుపుతారు. ఇప్పటికీ ఆగ్రామంలో ఎక్కువ మందికి రాజు అని వచ్చేలా పెట్టుకుంటారు. చిన్నపిల్లలకు మధ్యాహ్న భోజనంలో కూడా కోడిగుడ్డు వడ్డించపోవడం చూస్తే కట్టుబాట్లను ఎంతగా ఆచరిస్తున్నారో ఇట్టే అర్థం అవుతుంది.

## నైపుణ్యాలకు పదునుపెట్టు.. కొలువుకదే మెట్టు

కర్నూలు : "ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోండి.. దాన్నే మీ జీవిత లక్ష్యం చేసుకోండి.. దాన్నే ధ్యానించండి.. కలగనండి.. దాన్నే శ్వాసించండి.. ఇదే విజయానికి మార్గం" అని స్వామి వివేకానంద అన్నారు. యువత సైతం ఉపాధి లక్ష్యం ఎంచుకోవాలి.. అందుకనుగుణంగా అడుగులు వేయాలి. అవకాశాలను వినియోగించుకోవాలి.

పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పలు పెద్ద కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఉపాధి అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో యువత ఆయా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఉపాధికి బాటలు వేసుకోవాలి.

నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఉమ్మడి జిల్లాలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ద్వారా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన (డీడీయూజీకేవై)ను అమలు చేస్తున్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు మూడు నుంచి ఆరు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు ఆయా కోర్సులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ నైపుణ్యాలు, లైఫ్ స్కిల్స్‌తో పాటు కోర్సుకు



సంబంధించిన డొమైన్ నైపుణ్యాలను బోధిస్తున్నారు. ప్రాంగణ ఎంపికల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

డీడీయూజీకేవై కింద కర్నూలు జిల్లాలో 324 మందికి ఉపాధి కల్పించాల్సి ఉండగా 249 మందికి, నంద్యాల జిల్లాలో 291గాను 224 మందికి ఉపాధి చూపారు. పీఎంకేవీవై కింద కర్నూలు 780, నంద్యాల జిల్లాలో 660 మందికి ఉపాధి చూపాలని కేంద్రం ఇటీవల లక్ష్యాలను నిర్దేశించింది.

**ఊరూరా ఉద్యోగ మేళా** సీడాప్, నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధి కల్పన శాఖల సమన్వయంతో కర్నూలు జిల్లాలో గతేడాది డిసెంబరు నాటికి 78 ఉద్యోగ మేళాలు నిర్వహించారు. 4,375 మంది ఉద్యోగాలు పొందినట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో 62 ఉద్యోగ మేళాలు నిర్వహించగా.. 4,276 మంది అభ్యర్థులను ఆయా కంపెనీలు ఎంపికలు చేసుకున్నాయి.

**విదేశాల్లోనూ..**

ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసి 2–3 ఏళ్ల అనుభవం ఉన్న యువకులు, నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి జర్మనీ, దుబాయ్‌లో ఉద్యోగాలు ఇస్తున్నారు. అక్కడి భాషతో పాటు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. గ్లోబల్ మొబిలిటీ– స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కింద జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా, రష్యా తదితర విదేశీ భాషలపై శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ప్రస్తుతం నర్సింగ్ చదివినవారికి జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నారు.

**రూ.56 వేల కోట్ల పెట్టుబడులు**

ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. బ్రాహ్మణపల్లెలో రిలయన్స్ సంస్థ అతిపెద్ద బేవరేజెస్, కన్జూమర్ ఉత్పత్తుల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. గుట్టపాడులో సిగాచి ఇండస్ట్రీస్ సంస్థ, ఆర్పీఎస్ సంస్థలు రూ.370 కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నాయి. ఓర్వకల్లులో సెమీ కండెక్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఈవీ పార్క్.. డ్రోన్ల తయారీకి డ్రోన్ సిటీ ఏర్పాటు కానున్నాయి. ఓర్వకల్లు పారిశ్రామికవాడలో రూ.56 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇవన్నీ ఏర్పాటైతే 20 వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# నిఘా నీడలో ప్రయోగ పరీక్షలు

కర్నూలు : పదో తరగతి తర్వాత ఇంటర్ విద్య ఎంతో కీలకం. ఇక్కడి నుంచే ఉన్నత లక్ష్యానికి బాటలు పడతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. దీనికితోడు సంకల్ప్ పేరుతో వంద రోజుల ప్రణాళికను ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కూటమి ప్రభుత్వం అందించింది. దీనిని అధ్యాపకులు అమలు చేస్తున్నారు. మరోవైపు ప్రయోగ పరీక్షల్లోనూ రాణించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఒకేషనల్, ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జనరల్ (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు వార్షిక ప్రయోగ పరీక్షలు జరుగుతాయి.

**కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించే ప్రయోగ పరీక్షల గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తోపాటు రాష్ట్ర కమాండ్ కంట్రోల్




రూమ్‌కు అనుసంధానం చేస్తారు.

**144 సెక్షన్ అమలుకు చర్యలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ఆదర్శ, కేజీబీవీలతోపాటు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 152, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 131 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో రెండో ఏడాది ఎంపీసీలో 10,805, బైపీసీలో 5,076 మందితోపాటు ఒకేషనల్‌లో మొదటి, రెండో ఏడాదిలో 5,271 మంది విద్యార్థులు చదువుతున్నారు. నంద్యాల జిల్లాలో రెండో ఏడాది ఎంపీసీలో 8,210, బైపీసీలో 4,531 మందితోపాటు ఒకేషనల్ మొదటి, రెండో ఏడాదిలో 3,975 మంది విద్యార్థులు ఉన్నారు. ఏ కళాశాల వారికి.. ఆ కళాశాలలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

## 'ఉల్లి'కి పాట్లే

డోన్: ఉల్లి రైతులను ఆదుకునే ఉద్దేశంతో గతంలో డోన్‌తో పాటు కర్నూలు, కృష్ణగిరి, గూడూరు ప్రాంతాల్లో రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. ధరలు లేని సమయంలో దిగుబడులను ఆరబెట్టుకునేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. రైతులకు అవగాహన లేకపోవడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. రాష్ట్రంలోనే ఉల్లి సాగులో ఉమ్మడి కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. గత కొన్నేళ్లుగా గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో 20 వేల హెక్టార్లకుపైగా సాగైంది. రబీలో 3 నుంచి 4 వేల హెక్టార్లకు పరిమితమైంది. ధరలు లేని సమయంలో ఉల్లి దిగుబడులను నిల్వ చేసుకునేందుకు డోన్



పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు కృష్ణగిరి, గూడూరు, కర్నూలులో 2018 ప్రాంతంలో ఉల్లి గోదాములు నిర్మించారు.

**రూ.కోట్లు ఖర్చు చేసినా..**

ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.50 లక్షలకుపైగా నిధులు వెచ్చించారు. డోన్‌లో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.కోటి నిధులతో రెండు ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఏ ప్రాంతంలోనూ ఉల్లి గోదాములు పనిచేయడం లేదు. రైతులు వినియోగించుకున్న దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉల్లి గోదాములు ఏర్పాటు చేసినా అన్నదాతలకు అవగాహన కరవైంది. వీటి ఉపయోగాలను వివరించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి.

## సుదీర్ఘ కట్టడం.. సుందర పర్యాటకం

మార్కాపురం: మార్కాపురం జిల్లా మార్కాపురం మండలం తిప్పాయపాలెం రిజర్వాయర్ ప్రకృతి సోయగాలతో కళకళలాడుతోంది. చుట్టూ విస్తరించిన పచ్చదనం, కొండల మధ్య నిక్షిప్తమైన ఈ జలాశయం స్థానికంగానే కాదు, ఇతర రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షిస్తోంది.

**1938లో నిర్మాణం**

ప్రధానంగా తిప్పాయపాలెం రిజర్వాయరు 454 అడుగుల పొడవు, ఉపరితల వెడల్పు 6 అడుగులుగా ఉంది. దీని నీటి సామర్థ్యం 181 మిలియన్ ఘనపు అడుగులు (మిలియన్ క్యూబిక్ ఫీట్స్, 181 ఎంసీఎఫ్‌టి (లేక) 0.181 టీఎంసీలు). ఈ డ్యామ్‌కు కుడి, ఎడమ రెండు కాలువల ద్వారా మొత్తం 1,200 ఎకరాల ప్రాథమిక సాగుకు నీరందించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు సూచిక ద్వారా తెలుస్తుంది. బ్రిటిష్ కాలంలో 1938వ సంవత్సరంలో నిర్మించిన చారిత్రక సాగు ప్రాజెక్టు. ఇది ప్రధానంగా సాగుకోసం నిర్మించిన నీటినిల్వ ప్రాజెక్ట్ (ఇరిగేషన్ ప్రాజెక్టు). చిన్న డ్యామ్‌గా జల వనరుల శాఖ జాబితాలో ఉంది.


**ఆకట్టుకుంటున్న దేవాలయాల సమూహం..**

తిప్పాయపాలెం రిజర్వాయరు ఒడ్డున ప్రసిద్ధి చెందిన మునీశ్వరాలయం భక్తులకు దర్శనమిస్తోంది. ఇది కొండ గుహలో స్వయంభువుగా వెలసిన శివలింగం అని గ్రామస్థులు భక్తితో పూజలు నిర్వహిస్తారు. శివరాత్రి సందర్భంగా వేలాదిగా పర్యాటకులు విచ్చేసి జాగారాలు చేస్తారు. శివరాత్రి సమయంలో ఎద్దుల పోటీల లాంటి గ్రామ ఉత్సవాలకు తిప్పాయపాలెం ప్రసిద్ధి. కొండ మీద వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, కింద ప్రాంగణంలో కృష్ణాలయం ఆకట్టుకుంటాయి.

**జిల్లా కేంద్రానికి కేవలం 15 కి.మీ దూరం**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రానికి కేవలం 15 కి.మీ దూరంలో ఉన్న ప్రాజెక్టుచెంత ప్రభుత్వం పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. తిప్పాయపాలెం రిజర్వాయరు జిల్లా స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని గ్రామస్థులు, మార్కాపురం పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గొలుసు దుకాణాలపై.. ఎందుకీ అలుసు..!



కుప్పం : మండలం శివానందపురం వద్ద ఓ చిల్లర దుకాణంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. విక్రయాలు నిత్యకృత్యమైనా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వి.కోట మండలంలోని అటవీ సరిహద్దు గ్రామం.. చింతమాకులపల్లె వద్ద బెల్టుషాపులో వందల మద్యం సీసాలు నిల్వ చేసుకొని.. రేయింబవళ్లు విక్రయిస్తు న్నా.. రాజకీయ ఒత్తిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. జిల్లాలోని కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు సర్వసాధారణంగా మారాయి. సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయకపోవడంతో కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కర్ణాటక సమీప గ్రామాల్లో పొరుగు రాష్ట్రానికి చెందిన దుకాణాల నుంచి మద్యంను తీసుకొచ్చి చిల్లర దుకాణాలు, ఇళ్లలో నిల్వ చేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేయకపోవడంతో గొలుసు కట్టు వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

**లైసెన్సు ఫీజులకు అడ్వాన్సులు తీసుకొని..**

పలుచోట్ల అధికారిక మద్యం దుకాణాల నిర్వాహకులు లైసెన్సు ఫీజుల కోసం బెల్టుషాపుల వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో అడ్వాన్సులు తీసుకొని.. మద్యంను సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బెల్టుషాపులకు పోటీ అధికంగా ఉండటంతో.. ఒక్కో వ్యాపారి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అడ్వాన్సులు చెల్లించినట్లు ప్రచారం సాగుతోంది. ప్రత్యేకించి వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లో పదుల సంఖ్యలో బెల్టు దుకాణాల నిర్వాహకులు రూ.లక్షల్లో అడ్వాన్సులు చెల్లించి.. దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

**తనిఖీలకు రాజకీయ అడ్డంకులు**

పలమనేరు పరిధిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీఐ, ఎస్సైతో పాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు రాజకీయ సిఫార్సులతో డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. కుప్పం స్టేషన్‌లోనూ సీఐ, ఎస్సైతో పాటు ఏడుగురు సిబ్బంది ఉన్నారు. అక్రమ మద్యంతో పాటు సారా, గంజాయి నిర్మూలనలో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా.. సిబ్బంది కొరత అవరోధంగా మారింది. మరోవైపు మద్యం బెల్టుషాపులు, సారా అరికట్టేందుకు రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నట్లు సమాచారం.

**నవోదయం.. 2.0 ను ప్రారంభించినా..**

నాటు సారా తయారీ, విక్రయాల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం గతేడాది ప్రారంభించిన నవోదయ.. 2.0 కార్యక్రమం ద్వారా ఆశించిన ఫలితాలు రాలేదని స్పష్టమవుతోంది. సారా తయారీని మాన్పించి.. ప్రభుత్వం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించాల్సి ఉండగా.. ఆచరణలో విఫలం కావడంతో.. అటవీ ప్రాంతాల్లో అక్రమానికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. తమిళనాడు, ఆంధ్రా సరిహద్దు అడవుల్లో నాటు సారా తయారీ, విక్రయాలు సాగుతున్నాయి.

# పుష్కరిణులకు ప్రాణం పోయరూ..



ఆళ్లగడ్డ : పుష్కరిణులు మన ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యాలు. రాజుల కాలంలోని కోటలు అక్కడక్కడ పరిరక్షిస్తున్నారు. కాని వారి హయాంలో నిర్మితమైన కోనేరులు, బావులు కాల గర్భంలో కలిసిపోతున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో కోనేరులు జీవం కోల్పోయి నిర్జీవంగా మారుతున్నాయి. కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఇక్కడ కోనేర్ల నిర్మాణం జరిగింది. ఎగువ, దిగువ ఆలయాలతో నల్లమల అటవీ ప్రాంతంలో మొత్తం ఐదు పుష్కరిణులు ఉన్నాయి. దిగువ ఆలయ సమీపంలోని కోనేరు మినహా మిగిలినవి నిర్వహణ లేమితో ప్రాశస్త్యం కోల్పోతున్నాయి.

**ఎక్కడెక్కడ ఉన్నాయంటే..**

దిగువ అహోబిలంలో ఆలయానికి సమీపంలో ఆయుర్వేద ఆసుపత్రి వెనుక, లక్ష్మీవనం సమీపంలో ఆళ్వారు కోనేరు, భార్గవ నృసింహస్వామి ఆలయానికి సమీపంలో అక్షయ తీర్థం, ఎగువ అహోబిలంలో కోనేరులు ఉన్నాయి. ఇందులో ఆళ్వారు కోనేరు ముళ్లపొదలు నిండి అధ్వాన స్థితిలో ఉంది. కట్టడం చాలా వరకు కుంగిపోయింది. అహోబిలం నుంచి బాచేపల్లె రహదారిలో రెండు కోనేరులు ఉండగా అవి ముళ్లపొదల చెంత ఉండటంతో శిథిల దశకు చేరుకుంటున్నాయి. ఆర్.కృష్ణాపురం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరు చుట్టూ ముళ్లపొదలు చేరడంతో దుర్భరంగా మారింది. కోనేరు ప్రాకారం కుంగిపోయింది. మర్రిపల్లె గ్రామంలో కోనేరు సైతం చెత్తతో నిండి పూడికకు గురైంది.

కోటకందుకూరులో ఏనుగుల బావిగా పిలిచే కోనేరు రూపురేఖలు కోల్పోయింది. ఈ కోనేరు నీటిని అప్పట్లో తాగడానికి వినియోగించేవారు. ఆదరణ లేకపోవడంతో ముళ్లపొదలు, చెత్త చెదారంతో నిండి మరుగున పడింది. కట్టడాలు ధ్వంసమయ్యాయి. ఈద్గా వద్ద మరో కోనేరు దుస్థితి కూడా అలాగే ఉంది. ఆర్.కృష్ణాపురం రహదారిలోని మరో చిన్న కోనేరు పూర్తిగా దెబ్బతిని మట్టిలో కలిసిపోయింది.

**జీవం పోస్తే ప్రయోజనం**కోనేరులతో పాటు దిగుడు బావులు ఆళ్లగడ్డ మండలంలో సుమారు 20కి పైగా ఉన్నాయి. వాటిని శుభ్రం చేసి పూర్వవైభవం తీసుకువస్తే జలసిరి సంతరించుకుంటుంది. గ్రామ ప్రజలకు నీటి అవసరాలను తీర్చడమే గాక పంట పొలాలకు నీరందించే కల్పతరువులుగా మారుతాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా పూడిక తొలగింపుతో పాటు పరిశుభ్రం చేస్తే నీరు నిల్వ ఉండేందుకు ఆస్కారం ఉంది. ప్రాచీన చరిత్రకు జీవం పోయడంతో పాటు జల అవసరాలు తీరుతాయనడంలో సందేహం లేదు. చింతకొమ్మదిన్నె రహదారిలో, పాతకందుకూరులో రెండు కోనేర్లలో వాన నీరు నిల్వ ఉండటంతో పొలాలకు వినియోగించుకుంటున్నారు.

# విదేశీ విహంగం.. సెలవుల్లో విహారం

నందికొట్కూరు : కళ్లముందే చెంగుచెంగున ఎగిరే కృష్ణ జింకలు.. తలపై నుంచి గిర్రున దూసుకెళ్లే అరుదైన విదేశీ పక్షులు.. సందడి చేసే తోడేళ్లు, నక్కల సముదాయాలు.. కనుచూపు మేరలో దక్షిణాఫ్రికా గడ్డిభూములను తలపించే బంగారు వర్ణంలో మెరిసే గడ్డి మైదానాలు.. వెరసి ప్రకృతి సౌదర్యంతో రోళ్లపాడు అభయారణ్యం ఆహ్వానిస్తోంది. సంక్రాంతి సెలవుల్లో పిల్లలను తీసుకొస్తే విహారంతో పాటు విజ్ఞానం అందించినట్లవుతోంది. మార్చి నెలలో తమ స్వస్థలాలకు వెళ్లిపోయే విదేశీ పక్షులను చూసే అవకాశం ఉందని అటవీ సిబ్బంది తెలుపుతున్నారు. బట్టమేక పక్షి సంరక్షణకు 1988లో మిడుతూరు మండంలోని రోళ్లపాడు సమీపంలో అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. ఆరేళ్ల క్రితం బట్టమేక పక్షిని గుర్తించినట్లు అటవీశాఖ సిబ్బంది చెబుతున్నారు. దీని గురించి వివరిస్తూ ఏర్పాటు చేసిన బొమ్మల ప్రదర్శన ఆకట్టుకుంటోంది.


వివిధ దేశాల వలస పక్షులతో కలిపి 202 రకాల జాతులు, 21 రకాల క్షీరదాలు, 27 రకాల సరీసృపాలు, 9 రకాల ఉభయచరాలు, 62 రకాల సీతాకోకచిలుకలు, ఎనిమిది రకాల తూనిగలను ఈ అభయారణ్యంలో గుర్తించారు.

**సఫారీలో తిరుగుతూ వీక్షించొచ్చు**

అటవీశాఖ సిబ్బంది సఫారీ జీపులో తీసుకెళ్లి అభయారణ్యంలో జంతువులు, పక్షులను ప్రత్యక్షంగా చూపుతూ.. వాటి జీవన విధానాన్ని వివరిస్తారు. వివిధ పక్షులతోపాటు కృష్ణ జింకలు, తోడేళ్లు, నక్కలను దగ్గరి నుంచి వీక్షించవచ్చు. అరణ్యం విశిష్టతను వివరించేలా విజ్ఞాన కేంద్రంతోపాటు పక్షులు, వన్యప్రాణుల జీవన విధానాన్ని వివరిస్తూ డాక్యుమెంటరీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. బటన్ నొక్కి వివిధ పక్షుల శబ్దాలను వినేలా ప్రత్యేకమైన బోర్డు ఏర్పాటు చేశారు. మైదానాన్ని కనుచూపు మేర చూసేలా రెండు ఎత్తయిన వాచ్ టవర్లు కూడా ఇక్కడ నెలకొల్పారు.

**మార్చిలో వలస బాట**

యూరప్, రష్యా, మంగోలియా, సైబీరియా తదితర దేశాల నుంచి



34 రకాల పక్షులు రోళ్లపాడు అభయరణ్యానికి ఏటా వలస వస్తుంటాయి. ఫిబ్రవరి వరకు ఉండి, వేసవి ఎండల తీవ్రత పెరిగే సమయంలో తిరిగి స్వదేశాలకు వెళ్లిపోతుంటాయి. తాజాగా లగ్గర్ ఫాల్కన్, మొంటాగ్ హారియర్, పెరెగ్రిన్ ఫాల్కన్, పెద్దమచ్చల డేగ, బూటెడ్ డేగ, పాలిడ్ హారియర్ వంటివి ఇక్కడికి వచ్చాయి. ఇవి మార్చిలో తిరుగు ప్రయాణమయ్యే అవకాశం ఉంది. ఇప్పుడే వస్తే వీటిని చేసే అవకాశం ఉంది.

**విడిది సౌకర్యం**

పర్యాటకుల వసతి కోసం నాలుగు గదులు, డార్మిటరీ అందుబాటులోకి తీసుకొచ్చారు. nstr.co.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. ఇలా బుక్ చేసుకున్న వారికి భోజనం, సఫారీ ఉచితంగా ఏర్పాటు చేస్తారు. కేవలం సఫారీ అయితే ఇద్దరికి వెయ్యి, ఆపై వచ్చిన ఒక్కొక్కరికి రూ.300 చెల్లించాల్సి ఉంది. పెద్దలతోపాటు వచ్చిన చిన్నారులను ఉచితంగా తీసుకెళ్తారు. పిల్లలే సమూహంగా వస్తే ఒక సఫారీకి రూ.వేయి తీసుకుంటారు. దీనిలో దాదాపు 15 మంది కూర్చోవచ్చు. నుంచి గురువారం వరకు రాయితీ కల్పిస్తున్నారు.

# 'దిగులు' కాలువే

ఆలూరు : ఎల్లెల్సీ పరిధిలో ప్రస్తుతం 30 వేలకుపైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం గేట్ల మరమ్మతుల నేపథ్యంలో కాల్వకు నీటి సరఫరా ఆపేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టామని.. పంటలకు నీరందకపోతే అప్పుల పాలవుతామని పేర్కొంటున్నారు. జిల్లాలో హాలహర్వి, హొళగుంద, ఆదోని, కౌతాళం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరుకు వరకు దిగువ కాలువ ప్రవహిస్తుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుంటాయి. రైతులు ఎక్కువగా వరి, మిరప, పత్తి తదితర పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వరి కోతలు కోస్తున్నారు. ఎల్లెల్సీ పరిధిలో పెద్దఎత్తున మిరప సాగవుతోంది. దీనికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది.

**కీలక సమయంలో..**

వాస్తవానికి దిగువ కాలువకు ఏటా మార్చి చివరి వరకు సాగు నీరందేది. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త గేట్లు అమర్చే ఉద్దేశంతో జనవరి 10వ తేదీన నీటి విడుదల ఆపేస్తున్నట్లు అధికారులు ఇదివరకే ప్రకటించారు. ప్రస్తుతం 13వ తేదీ వరకు అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరో నెల రోజుల పాటు పంటను కాపాడుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో నీటి సరఫరా ఆపేస్తే పంటలు పూర్తిగా దెబ్బతింటాయని చెబుతున్నారు.



ఇప్పటికే భారీగా ఖర్చు చేశామని.. ఈనెలాఖరు వరకు నీరు విడుదల చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**భారీగా పెట్టుబడి పెట్టా**

కాలువ కింద ఐదెకరాల్లో మిరప సాగు చేపట్టా. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం కాయ దశలో ఉంది. నెల రోజుల వరకు నీటి తడుల అవసరం ఉంది. నీటి సరఫరా ఆపేస్తామని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నా. నెలాఖరు వరకు నీటి విడుదల చేయాలి.

మల్లికార్జునగౌడ్, పచ్చార్లపల్లె (హాలహర్వి)

# వాటంగా పంచుకున్నారు

కర్నూలు : కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ నిధులు పక్కదారి పట్టాయి. ఇక్కడ ఏటా 1,800 వరకు జరుగుతుంటాయి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద చేసే శస్త్రచికిత్సలు, ప్రసవాలకు కూటమి ప్రభుత్వం నిర్ణీత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఇందులో 50 శాతాన్ని 'పేషెంట్ కేర్ ఫండ్' కింద రోగుల సంక్షేమానికి ఖర్చు చేస్తారు. మిగిలిన 50 శాతం నిధులను సేవలందించిన వైద్యులు, స్టాఫ్ నర్సులు తదితరులు పంచుకుంటారు. ఈ మొత్తంలో సుమారు 70 శాతం వైద్యులకు, మిగిలిన మొత్తాన్ని ఇతర సిబ్బందికి కేటాయించాలి. ప్రసవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ వైద్యాలయానికి గత మూడేళ్ల కాలంలో రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి.

అందరూ తీసుకోవాల్సి ఉండగా..

కందుకూరు పీహెచ్‌సీకి సొంత భవనం నిర్మించకపోవడంతో అక్కడివారు సైతం కోసిగి పీహెచ్‌సీలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల వారు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. ఇక్కడికి వచ్చే రోగులకు అవసరమైన సేవలను నలుగురు వైద్యులూ అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని కోసిగిలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు వైద్యులూ పంచుకోవాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే తీసుకోవడం వివాదాస్పదంగా మారింది.

**రోగుల సంక్షేమానికి వెచ్చించక..**

డా.ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగుల సంక్షేమానికి ఉపయోగించాల్సిన నిధుల్లో ఒక్క రూపాయి ఖర్చు పెట్టిన దాఖలాలు లేవు. రూ.26,36,461 అందుబాటులో ఉంది. ఎలా వినియోగించాలన్న అంశంపై స్పష్టత లేకపోవడంతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు.

**ఒకరికి మొండిచేయి**

కోసిగి పీహెచ్‌సీకి డా.ఎన్టీఆర్ వైద్యసేవ కింద గత మూడేళ్లలో రూ.50 లక్షలు రాగా వైద్యుల వాటా సుమారు రూ.17,74,134. ఆ మొత్తాన్ని పీహెచ్‌సీలోని నలుగురు వైద్యుల్లో ఒకరికి డబ్బులు చెల్లించకుండా మిగిలినవారు తీసుకున్నారు. కోసిగిలో విధులు నిర్వర్తించిన డా.మనోజ్‌కు రూ.8,62,485, డా.రజిత రూ.4,49,412, డా.నజీర్‌కు రూ.4,15,511 అందాయి. డా.నజీర్ స్థానంలో వచ్చిన డా.రాజ కిరీటి రూ.46,726 అందుకున్నారు. డా.అభిరూప్ అనే వైద్యుడికి అందలేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని చెప్పడంతో మిన్నకుండిపోయారు. కానీ ఎప్పటికప్పుడు నిధులు వస్తున్నట్లు తెలుసుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదేమని అడిగితే కందుకూరు పీహెచ్‌సీకి చెందిన వైద్యుడు కావడంతో వాటా ఇవ్వలేదని చెబుతున్నట్లు సమాచారం.

# రూ.కోట్ల ఖర్చు... చుక్క నీరిస్తే ఒట్టు!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పరిధిలో జల్ జీవన్ మిషన్ పనులు కోసం రూ.38.51 కోట్లు మంజూరయ్యాయి. వీటితో వై.పాలెం నియోజకవర్గంలోని 250 గ్రామాల్లో మొత్తం 261 పనులు చేపట్టాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో ప్రారంభమైన పనులు సక్రమంగా చేపట్టలేదు. కొన్ని గ్రామాల్లో పూర్తియినట్లు చూపినా క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. గోళ్లవిడిపి, పిల్లికుంట తండా, మూలమడుగు తండా, జగనన్నకాలనీ, కొమరోలు తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. ఖర్చు మాత్రం మొత్తంగా చేసినట్లు చూపారు. నిరుపయోగంగా పైపులు... ఈ పనుల కోసం రెండేళ్ల క్రితం తెచ్చిన హెచ్‌డీపీ పైపులు చాలా చోట్ల రోడ్ల పక్కన ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయి. కొన్నిచోట్ల పిచ్చి మొక్కల్లో కలిసిపోయాయి. 2025 మార్చి నాటికి మొత్తం పూర్తి కావాల్సి ఉన్నా... 182 పనులు చేసినట్లు రికార్డులో చూపారు. ఇందులో అసంపూర్తివే చాలావరకు ఉన్నాయి. ఇప్పటివరకు రూ.18 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్క చూపారు. ఎక్కడా పనులు సరిగా సాగక పోవడంతో ప్రజల కన్నీటి కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పనుల గడువును ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకు పొడిగించినట్లు తెలిపారు. పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. పుల్లలచెరువు మండలంలోని శతకోడు, రెంటపల్లె, రాచకొండ, పీఆర్‌సీ తండా; వై.పాలెం మండలం... గుట్టలచేను, పాలుట్ల, నెక్కంటి; దోర్నాల మండలం... భ్రమరాంబిక కాలనీ, గంటవానిపల్లె, బలిజకాలనీ, త్రిపురాంతకం మండలంలోని యానాది కాలనీ, సంఘం తండా, వెంగాయపాలెం పనులు చేపట్టలేదు.

## రెడ్ డ్రెస్ హీట్ పెంచిన రుక్మిణీ వసంత్!

ఒకవైపు సినిమాలలో తమ నటనతో ఆకట్టుకుంటూనే మరొకవైపు సోషల్ మీడియా వేదికగా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను మెప్పించే దిశగా అడుగులు వేస్తున్నారు కొంతమంది హీరోయిన్స్. అందులో భాగంగానే ఇప్పుడు సరికొత్త అవుట్ ఫిట్స్ తో ప్రేక్షకుల ముందుకు రావడమే కాకుండా ఆ దుస్తులలో తమ అందాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు అనడంలో సందేహం లేదు. అలాంటి వారిలో యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్ కూడా ఒకరు. తన అందంతో, నటనతో, హుందాతనంతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె ఇటీవల వచ్చిన కాంతార 2 చిత్రంలో నటించి తన నటనతో యావత్ పాన్ ఇండియా రేంజిలో పాపులారిటీ దక్కించుకుందిూశ్రీంశీ =ముం - వెంకీ మామ కోసం అనిల్ తనని దించేస్తున్నాడా? ఇందులోని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టిను కూడా తన నటనతో డామినేట్ చేసి ప్రేక్షకులను మెప్పించిన ఈమె.. ప్రస్తుతం ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కి బ్రేక్ పడిన విషయం తెలిసిందే. మరికొన్ని చిత్రాలలో బిజీగా ఉన్న రుక్మిణి వసంత్ మరోవైపు ఆడియన్స్ ను ఆకట్టుకోవడానికి ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది. అందులో రెడ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె కుర్చీలో కూర్చొని హుందాగా



తన అందాన్ని ఎక్స్పోజ్ చేసింది.. చూపరులకు కనువింపుగా ఉన్న ఈమె అందాన్ని చూసి అభిమానులు కవిత్వాలు వల్లుతున్నారు. ఈమె చూపులు మరింత ప్రకాశవంతంగా అనిపిస్తున్నాయి. తన అవుట్ ఫిట్ తో అభిమానులను మెస్మరైజ్ చేసింది రుక్మిణి వసంత్. 2019లో వచ్చిన కన్నడ చిత్రం బీర్బల్ ద్వారా సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టింది. 2023లో కన్నడ రొమాంటిక్ డ్రామా సప్త సాగర దాచేయెల్లో అనే చిత్రంతో అటు కన్నడ ఇటు తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. ఈ సినిమాకి గాని కన్నడలో ఉత్తమ నటిగా ఫిలింఫేర్ క్రిటిక్స్ అవార్డు లభించింది. ఇక తెలుగులో నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఈ చిత్రానికి సుధీర్ వర్మ రచనా, దర్శకత్వం వహించగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ద్వారా బి వి ఎస్ ఎన్ ప్రసాద్ నిర్మించారు. నిఖిల్ సిద్ధార్థ తో పాటు రుక్మిణి వసంత్, దివ్యాంశ కౌశిక్ హీరోయిన్లుగా నటించారు. ఎన్నో అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. దాంతో ఈమెకు కూడా గుర్తింపు లభించలేదు. కానీ ఆ తర్వాత తమిళంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన మదరాసి సినిమాలో నటించినా.. ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేదని చెప్పాలి. ఒక కాంతార చాప్టర్ వన్ చిత్రంతో కనకావతి పాత్రతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాతో పాటు టాక్సిక్ సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ఇంగ్లీష్ , కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా తదితరులు కీలకపాత్రలు పోషిస్తూ ఉండగా.. వెంకట్ కే నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## శేఖరుడు ఆ సీటని భర్తీ చేస్తే ఇక తిరుగే ఉండదు!

టాలీవుడ్లో పవర్ఫుల్ సపోర్టింగ్ క్యారెక్టర్లకు ఇప్పుడు భారీ కొరత ఏర్పడుతోందా?.. శ్రీహరి లాంటి పవర్ఫుల్ సపోర్టింగ్ ఆర్టిస్ట్ లేని లోటు అందరి మదిని తొలిచేస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కారణం అప్పట్లో పవర్ఫుల్ సపోర్టింగ్ క్యారెక్టర్లకు కేరాఫ్ అడ్రస్గా నిలిచిన హీరో రియల్ స్టార్ శ్రీహరి. తనని దృష్టిలో పెట్టుకుని ఆ రోజుల్లో డైరెక్టర్లు కథలు రాసేవారు. తను కుదరదంటే ఆ సినిమానే ఉండేది కాదు. అంతగా శ్రీహరి పవర్ ఫుల్ క్యారెక్టర్ల విషయంలో తనదైన ముద్ర వేశారు. ఇప్పుడు అలాంటి నటుడి అవసరం ఇండస్ట్రీకి కనిపిస్తోంది. -మగధీర- శ్రీహరి పోషించిన షేర్ ఖాన్ క్యారెక్టర్ లేకుండా పోల్చుకోలేం. అదే విధంగా -నువ్వొస్తానంటే నేనొద్దంటానా-లో శివరామకృష్ణ క్యారెక్టర్లో తనని తప్ప మరొకరిని చూడలేకపోయే వాళ్లం. -ఢీ- శంకర్ గౌడ్, కింగ్ జ్ఞానేశ్వర్ భాయ్, డాన్ శీను నర్సింగ్, బృందావనం -శివుడు-, తుఫాన్లో షేర్ఖాన్, ఆర్ రాజ్ కుమార్లో అజిత్ టాకా..ఇలా ఎన్నో సినిమాలకు రియల్ స్టార్ శ్రీహరి బ్యాగ్ బోన్గా నిలిచి ఆ సినిమాల సక్సెస్లకు



కారణమయ్యాడు. -ఆర్ రాజ్కుమార్- సినిమా షూటింగ్ సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురైన శ్రీహరి అకస్మాత్తుగా మృతి చెందడంతో అప్పటి నుంచి ఆ స్థానాన్ని టాలీవుడ్లో ఎవరూ భర్తీ చేయలేకపోతున్నారు. ఇప్పటికీ ఆ సీట్ అలాగే ఖాలీగా ఉంది. ఇప్పుడు అలాంటి పవర్ఫుల్ సపోర్టింగ్ క్యారెక్టర్లు చేయగల నటుడు కావాలని రాజమౌళి లాంటి డైరెక్టర్ నుంచి యంగ్ స్టార్స్, డైరెక్టర్స్ వరకు ఎదురు చూస్తున్నారు. వారందరికి యాంగ్రీ యంగ్మెన్ డా. రాజశేఖర్ గుడ్ న్యూస్ చెప్పేలా కనిపిస్తున్నాడు. వెండితెరపై యాంగ్రీ యంగ్ మెన్గా పవర్ఫుల్ పోలీస్ క్యారెక్టర్లకు కేరాఫ్ అడ్రస్గా నిలిచిన రాజశేఖర్ -కల్కి- తరువాత హీరోగా ప్రభావం చూపించలేకపోతున్నాడు. దీంతో కొంత విరామం తీసుకుని నితిన్ -ఎక్స్ ట్రార్డినరీమెన్-లో బిజీగా నటించినా ఫలితం లేకుండా పోయింది. క్యారెక్టర్ని బలంగా రాయకపోవడం, కథలో దమ్ములేకపోవడంతో రాజశేఖర్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. అయితే తాజాగా శర్వానంద్ హీరోగా రూపొందుతున్న -బైకర్-లో రాజశేఖర్ కీ రోల్ పోషిస్తున్నాడు. బుల్లెట్ సునీల్ అనే పవర్ఫుల్ క్యారెక్టర్లో తను కనిపించబోతున్నాడు. నేడు ఆయన పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఓ వీడియోని విడుదల చేశారు. ఇందులో రాజశేఖర్ క్యారెక్టర్ని రివీల్ చేశారు. ఫార్మర్ మోటోక్రాస్ రేసర్ అంటూ ఆయన క్యారెక్టర్కిచ్చిన ఎలివేషన్స్ చూస్తుంటే శేఖరుడికి ఇన్నాళ్లకు కరెక్ట్ క్యారెక్టర్ పడిందనిపిస్తోంది. ఈ వీడియో చూసిన వారంతా ఇదే మాట అంటున్నారు. శర్వా బైక్ రేసర్గా నటిస్తున్న ఈ మూవీలో తనకు మెంటార్గా రాజశేఖర్ కనిపించబోతున్నాడు. ఈ సినిమా వైబ్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ పక్కా అని అర్థమవుతోంది. అదే నిజమై..రాజశేఖర్ క్యారెక్టర్ క్లిక్కయితే రాజశేఖరుడు రియల్ స్టార్ శ్రీహరి సీటుని భర్తీ చేయడం ఖాయం అనే టాక్ టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. శర్వాతో కలిసి రాజశేఖర్ నటిస్తున్న -బైకర్- ఏప్రిల్ 3న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.




## వారణాసి సెట్స్‌లో పృథ్వీరాజ్ పడ్డ కష్టం ఇదే!





రాజమౌళి సినిమాలో హీరో ఎంత పవర్ఫుల్గా ఉంటారో, విలన్ కూడా అంతే ధీటుగా కనిపిస్తారు. ఇప్పుడు మహేష్ బాబుతో తీస్తున్న 'వారణాసి'లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ను ఎంచుకోవడమే ఒక పెద్ద సంచలనం. రీసెంట్ గా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ తన పాత్ర గురించి పంచుకున్న విషయాలు చూస్తుంటే, జక్కన్న ఈసారి ఒక విభిన్నమైన విలనిజాన్ని మనకు పరిచయం చేయబోతున్నారని అర్థమవుతోంది. అసలు ఈ 'కుంభ' పాత్ర వెనుక ఉన్న అసలు సీక్రెట్ ఏంటో పృథ్వీరాజ్ మాటల్లోనే బయటపడింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ఒక క్రూరమైన విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ క్యారెక్టర్ గురించి ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం మంచి లేదా చెడు అనే కోణంలో ఉండదని చెప్పారు. తన కెరీర్ లోనే అత్యంత అన్‌ప్రెడిక్టబుల్ గా సాగే క్యారెక్టర్ ఆర్క్ దీనికి ఉందని ఆయన వివరించారు. అంటే విలన్ చేసే పనులు ఎప్పుడు ఎలా ఉంటాయో ఎవరూ ఊహించలేరన్నమాట. తన నిజజీవితానికి ఏమాత్రం సంబంధం లేని ఇంతటి డార్క్ రోల్ చేయడం ఒక పెద్ద ఛాలెంజ్ అని పృథ్వీరాజ్ చెప్పుకొచ్చారు. రాజమౌళి డైరెక్షన్ స్టైల్ గురించి కూడా పృథ్వీరాజ్ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. జక్కన్న సెట్స్‌లో నటీనటులు ఎప్పుడూ కంఫర్ట్‌గా ఉండరట. ఎప్పుడూ ఏదో ఒక ఛాలెంజ్ ఇస్తూ నటులను ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉంటారని, ఆ ఒత్తిడి వల్లే నటుల నుండి బెస్ట్ అవుట్‌పుట్ వస్తుందని ఆయన తెలిపారు. ఎక్కడా రిలాక్స్ అవ్వకుండా నిరంతరం శ్రమిస్తేనే రాజమౌళి మార్క్ పర్ఫెక్షన్ వస్తుందనేది పృథ్వీరాజ్ మాటలను బట్టి స్పష్టమవుతోంది. సినిమాలో కుంభ గెటప్ కూడా చాలా విభిన్నంగా ఉండబోతోంది. టెక్నాలజీతో కూడిన ఒక అధునాతనమైన వీల్ ఛైర్, అలాగే 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో ఉండే రోబోటిక్ చేతులతో పృథ్వీరాజ్ లుక్ చాలా భయంకరంగా ఉంటుందని టాక్. ఇండియన్ సినిమాలో ఇప్పటివరకు చూడని ఒక సైకో విలన్‌గా ఈ కుంభ పాత్రను రాజమౌళి డిజైన్ చేశారట. కేవలం కళ్లతోనే భయపెట్టే ఈ విలనిజం సినిమాకే ఒక పెద్ద హైలైట్ కానుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఇన్ని గ్రాఫిక్స్, భారీ సెట్లు ఉన్నా సరే రాజమౌళి మాత్రం నటుల ఎక్స్‌ప్రెషన్స్‌కే మొదటి ప్రాధాన్యత ఇస్తారట. ఒక నటుడు నిజాయితీగా ఇచ్చే 'క్లోజప్ షాట్' కంటే పవర్‌ఫుల్ విజువల్ మరొకటి ఉండదని జక్కన్న నమ్ముతారని పృథ్వీరాజ్ చెప్పారు. అందుకే ఎంత పెద్ద యాక్షన్ సీన్ జరుగుతున్నా, నటుడి ఫేస్ లోని చిన్న మార్పును కూడా క్యాచ్ చేయడానికి రాజమౌళి చాలా సమయం కేటాయిస్తారట. అలా ప్రతి సీన్ పక్కాగా వచ్చే వరకు వదిలిపెట్టరని పృథ్వీరాజ్ వెల్లడించారు. ఇక 'వారణాసి'లో రుద్రకు పోటీగా నిలిచే ఈ కుంభ పాత్ర బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి. పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి టాలెంటెడ్ నటుడు విలన్ గా మారడం ఈ సినిమాపై ఉన్న క్యూరియాసిటీని మరింత పెంచింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కాబోతున్న ఈ గ్లోబల్ ఎడ్వెంచర్ లో హీరో, విలన్ మధ్య జరిగే ఆ మైండ్ గేమ్ ఎలా ఉంటుందో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

## అఫీషియల్: ఉస్తాద్ భగత్ సింగ్.. వచ్చేది ఎప్పుడంటే..




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పొలిటికల్ గా ఎంత బిజీగా ఉన్నా, తన ఫ్యాన్స్ ని ఎంటర్టైన్ చేయడానికి మాత్రం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. లేటెస్ట్ గా ఆయన నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' కి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. చాలా కాలంగా షూటింగ్ అప్‌డేట్స్ కోసం వెయిట్ చేస్తున్న అభిమానులకు చిత్ర యూనిట్ ఒక పక్కా ప్లాన్ తో సర్ ప్రైజ్ ఇచ్చింది. రిలీజ్ డేట్ విషయంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఎట్టకేలకూ తెరపడింది.

ఈ సినిమాను వచ్చే నెల మార్చి 26న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. సమ్మర్ హాలిడేస్ స్టార్ట్ అయ్యే టైమ్ కాబట్టి, బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వేట మొదలుపెట్టడానికి ఇది పర్ఫెక్ట్ డేట్ అని చెప్పవచ్చు. ఈ అనౌన్స్‌మెంట్ తో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ లో హడావుడి మొదలైంది. సినిమా రిలీజ్ పోస్టర్ చూస్తే పవన్ కళ్యాణ్ స్వాగ్ వేరే లెవల్ లో కనిపిస్తోంది. వందలాది మంది ప్రజల మధ్య ఒక టేబుల్ మీద నిలబడి ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ చూస్తుంటే, ఇందులో ఆయన క్యారెక్టరైజేషన్ ఎంత పవర్ ఫుల్ గా ఉండబోతోందో అర్థమవుతోంది. హరీష్ శంకర్ డైరెక్షన్ లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' ఎలాంటి హిస్టరీ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ అదే క్రేజీ కాంబో రిపీట్ అవుతుండటంతో అంచనాలు పీక్స్‌కు చేరాయి. ఇప్పటికే విడుదలైన 'దేక్ లేంగే సాలా' సాంగ్ ఒక డ్యాన్స్ బస్టర్ గా నిలిచింది. పవన్ కళ్యాణ్ తనదైన గ్రేస్ తో వేసిన స్టెప్స్ కి యూత్ అంతా ఫిదా అయిపోయారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ ఒక డైనమిక్ పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తారని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఎక్కడా క్వాలిటీ తగ్గకుండా చాలా గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ప్రతి ఫ్రేమ్ లోనూ పవర్ స్టార్ ఇమేజ్ ను ఎలివేట్ చేసేలా హరీష్ శంకర్ జాగ్రత్తలు తీసుకున్నారట. శ్రీలీల, రాశీ ఖన్నా ఈ సినిమాలో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన మ్యూజిక్ సినిమాకు మరో పెద్ద బూస్ట్ ఇవ్వనుంది. కేవలం మాస్ ఎలిమెంట్స్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో మంచి మెసేజ్ కూడా ఉండబోతోందని టాక్. థియేటర్లలో విజిలు వేయించే సీన్స్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ ని కూడా ఆకట్టుకునేలా ఈ కథను సిద్ధం చేశారట. రిలీజ్ డేట్ ఫిక్స్ అవ్వడంతో ఇకపై ప్రమోషన్స్ లో కూడా స్పీడ్ పెంచబోతున్నారని చిత్ర బృందం హింట్ ఇచ్చింది. ఇక సమ్మర్ సీజన్ లో ఉస్తాద్ భగత్ సింగ్ ఎలాంటి రికార్డులను బ్రేక్ చేస్తాడో చూడాలి.

## ప్రపంచంలోనే అత్యంత అందమైన టాప్ టెన్ హీరోయిన్స్‌లో ప్రభాస్ బ్యూటీ!

అందం అనేది చూసే కళ్ళను బట్టి ఉంటుంది అంటారు, కానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియుల లెక్కల ప్రకారం ప్రతి ఏటా అత్యంత అందగత్తెల జాబితా విడుదలవుతూనే ఉంటుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో హాలీవుడ్ భామలతో పాటు మన భారతీయ నటి కృతి సనన్ చోటు దక్కించుకోవడం విశేషం. ప్రభాస్ సరసన 'ఆదిపురుష్'లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు ప్రపంచ వేదికపై తన అందంతో అందరినీ ఆకట్టుకుంటోంది. గ్లోబల్ బ్యూటీస్ జాబితాలో మన 'జానకి': ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అందగత్తెల జాబితాలో మొదటి స్థానంలో హాలీవుడ్ సెన్సేషన్ మార్గోట్ రోబీ నిలవగా, షైలీన్ వుడ్లీ, డిల్రాబా దిల్‌మురాత్ వంటి అంతర్జాతీయ నటీమణులు వరుస స్థానాల్లో ఉన్నారు. అయితే, ఈ జాబితాలో 5వ స్థానాన్ని దక్కించుకుని మన ఇండియన్ సినిమా సత్తాను చాటింది కృతి సనన్. ఈమెతో పాటు నాన్సీ మెక్‌డోనీ, హానియా అమీర్, అనా డి అర్మాస్, ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్ మరియు హండే ఎర్చెల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ సుందరీమణులు ఈ టాప్-10లో చోటు సంపాదించారు. అత్యంత



కఠినమైన పోటీని తట్టుకుని కృతి ఈ స్థానాన్ని గెలుచుకోవడం ఆమె ఫ్యాన్స్‌కు పండగే అని చెప్పాలి. ప్రభాస్ తో కెమిస్ట్రీ.. 'ఆదిపురుష్' లో జానకి: ఇక కృతి సనన్ పేరు వినగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది 'ఆదిపురుష్' సినిమా. ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్ సరసన 'జానకి' పాత్రలో ఆమె నటించిన తీరు అద్భుతం. రాముడిగా ప్రభాస్ గంభీరమైన రూపానికి, జానకిగా కృతి సుకుమారమైన అందం తోడై వెండితెరపై ఒక దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించింది. కేవలం అందమే కాదు, ఆ పాత్రలో ఆమె పండించిన భావోద్వేగాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి కెమిస్ట్రీ గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రభాస్ లాంటి స్టార్ హీరోతో జోడీ కట్టి, ఇప్పుడు గ్లోబల్ లెవల్లో అందగత్తెగా గుర్తింపు పొందడం విశేషం. ఈ జాబితాలో చోటు సంపాదించడం అనేది కృతి సనన్ కేవలం గ్లామర్ కే పరిమితం కాదని, ఆమెకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణకు ఇది నిదర్శనమని అర్థమవుతోంది. మహేష్ 'నేనొక్కడినే' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ సుందరి, ఇప్పుడు హాలీవుడ్ స్టార్స్ అయిన ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్ వంటి వారితో పోటీ పడుతోంది. నటనలో నేషనల్ అవార్డ్ సాధించడమే కాకుండా, ఇప్పుడు గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో టాప్ లో నిలవడం ఆమె కెరీర్ లో మరో గొప్ప మైలురాయి. గ్లోబల్ బ్యూటీస్ లిస్టులో మన కృతి సనన్ ఉండటం భారతీయులందరికీ గర్వకారణం. ప్రభాస్, మహేష్ లాంటి గ్లోబల్ స్టార్స్ పక్కన ఆమె చేసిన పాత్రలు ఆమెను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. ఆమె ప్రయాణం ఇలాగే మరిన్ని విజయాలతో కొనసాగాలని కోరుకుందాం.

## సాయి ప్లలవికి ట్యాలెంటే సమస్యగా!

సాయి పల్లవిని కన్విన్స్ చేయడం అన్నది అంత సులభం కాదు. అన్ని పాత్రలకు ఆమె కనెక్ట్ కాదు. పాత్ర మనసుకు బాగా నచ్చితే తప్ప అంగీకరించదు. కానీ అందుకు దర్శకుడు తనలో తానే పెద్ద యుద్ధాలే చేయాల్సి ఉంటుందని ఆ మధ్య ఓ యువ దర్శకుడు మాటల్ని బట్టి అర్దమైంది. సాయిపల్లవిని ఒప్పించడం కోసం తాను ఎన్ని రకాలుగా పని చేయాల్సి వచ్చిందన్నది పూస గుచ్చాడు. అప్పుడే సాయి పల్లవి పాత్రల విషయంలో ఎంత కఠినంగా ఉంటుంది? అన్నది అద్దం పట్టింది. కథకు..అందులో తాను పోషించే పాత్రకు చాలా సారూప్యత ఉండాలి. కథలో పాత్ర సంపూర్ణంగా మింగిలై ఉండాలి. ఏమాత్రం డీవీయేట్ అయినా కన్విన్స్ అవ్వదు. నిర్మొహ మాటంగా నో చెప్పేస్తుంది. లేదా? పరి పూర్ణంగా సిద్ధం చేసి తిరిగి రమ్మంటుంది. ఇవన్నీ చేయగల్గిన వారితో పనిచేస్తుంది. ఎందుకులే మరో నటిని తీసుకుందాం అనుకున్న వాళ్లు ఎగ్జిట్ అవుతారు. ఈ కారణంగా అమ్మడు కొన్ని అవకాశాలు కోల్పోతుంది అన్నది కాదనలేని నిజం. ఇంత వరకూ మీడియాలో హైలైట్ అయిన అంశం కూడా ఇదే.



అయితే తాజాగా సాయిపల్లివిపై మరో కొత్త ఆరోపణ కూడా వినిపిస్తోంది. ఆమె లో ట్యాలెంట్ కూడా అవకాశాలు రాకుండా అడ్డు పడుతోంది? అన్నది మరో వెర్షన్. ఇదేంటి ప్రతిభ ఉంటే ఎవరికైనా అవకాశాలు వస్తాయి? అదే ప్రతిభతో అవకాశాలు కోల్పోవడం ఏంటి అనుకుంటు న్నారా? ఇక్కడే ఉంది అసలైన రాజకీయం. హీరోల్ని డామినేట్ చేస్తోంది అన్న కారణంగా చాలా మంది డైరెక్టర్లు ఆమెను కావాలనే దూరం పెడుతున్నట్లు ఓ చర్చ జరుగుతోంది. ప్రముఖంగా టాలీవుడ్ లో అవకాశాలు రాకపోవడానికి ఇదే అసలైన కారణంగా మాట్లాడుకుంటున్నారు. మరి ఇందులో నిజమెంత? అంటే కొంత వరకూ వాస్తవం ఉంది. -లవ్ స్టోరీ- చిత్రంలో నాగచైతన్య కు జోడీగా నటించింది. అందులో చైతన్య పాత్రను డామినేట్ చేసింది.సినిమాలో చైతన్య పాత్ర కంటే సాయి పల్లవి పాత్రకే మంచి క్రెడిట్ దక్కింది. అదనంగా సాయి పల్లవి మంచి డాన్సర్ కావడం కలిసొచ్చిన అంశం. తనలో ఈ స్కిల్ ని దర్శకుడు శేఖర్ కమ్ములా తెలివిగా సద్వినియోగం చేసుకున్నాడు. డాన్సులో తానో ప్రొఫెషనల్ అని నాగచైతన్య స్వయంగా ప్రశంసించాడు. ఆ సినిమాలో ప్రధానంగా హైలైట్ అయిన సన్నివేశాలు కూడా అవే. సాయి పల్లవి తొలి తెలుగు చిత్రం -ఫిదా- తోనే తానో ప్రొఫెషనల్ డాన్సర్ గా ప్రూవ్ చేసుకుంది. -విరాట పర్వం- లాంటి చిత్రంలోనూ సాయి పల్లవి పెర్ఫార్మెన్స్ అంతే గొప్పగా ఉంటుంది. రానా పాత్రని సైతం డామినేట్ చేసినట్లే ఉంటుంది. -అమరన్-, -గార్గీ-, -ఎన్జీకే-,- తండేల్- లాంటి చిత్రాల్లో అంతే బలమైన పాత్రలతో తనదైన ముద్ర వేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536